

హర్మన్‌ప్రీత్ సేన రికార్డు ఛేదన

సెమీస్‌లో ఆసీస్‌పై 339 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించిన అమ్మాయిలు

జెమీమా చిరస్మరణీయ సెంచరీ

వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు భారత్

8

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 90 | విజయవాడ, శుక్రవారం 31 అక్టోబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 31 October 2025 | Rs



జిన్‌పింగ్‌తో ట్రంప్ భేటీ

- సుంకాలను తగ్గించిన అమెరికా
- పలు అంశాలపై కుదిరిన ఒప్పందం
- చైనా నుంచి అమెరికాకు రేర్ ఎర్త్స్ ఎగుమతులు

7

మొంథా బాధిత రైతులకు పంటల బీమా ప్రశ్నార్థకం

- బీమా పరిధిలోకి వచ్చిన రైతులు, విస్తీర్ణం చాలా తక్కువ
- ఉచితం ఎత్తేసిన కూటమి
- అన్నదాతల ఇష్టానికే వదిలేసిన కేంద్రం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

పంటల బీమాకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడబలుక్కొని గండి కొట్టాయి. మోడీ సర్కార్ క్రాప్ ఇన్సూరెన్స్‌ను రైతుల అభీష్టానికే (ఐచ్ఛికం) వదిలేయగా, టిడిపి కూటమి ప్రభుత్వం అంతకు ముందు వరకు ఉన్న ఉచిత పంటల బీమాను ఎత్తేసి రైతులే తమ వాటా ప్రీమియాన్ని చెల్లించుకోవాలని చెప్పింది. 'డబుల్ ఇంజిన్' సర్కార్ విధానం మొంథా తుపాన్ సృష్టించిన విలయానికి లక్షల ఎకరాల్లో పంట నష్టాలను చవిచూసిన రైతులకు అందాల్సిన కొద్దిపాటి బీమాకు దూరం చేసింది. ఖరీఫ్‌లో వ్యవసాయ, ఉద్యానవన పంటలన్నీ కలుపుకొని కోటి ఎకరాలకుపైగా రైతులు సాగు చేయగా అక్టోబర్ చివరాఖరుకు దిగుబడి ఆధారిత (ఫసల్), వాతావరణ ఆధారిత.. రెండు బీమా పథకాల్లో చేరిన విస్తీర్ణం 19.57 లక్షల ఎకరాలు మాత్రమే. తమ పంటలకు ఇన్సూరెన్స్ చేయించుకున్న రైతులు సుమారు ఏడున్నర లక్షల మంది. నిరుడు ఖరీఫ్‌లో రెండు బీమా పథకాలూ కలిపి 71 లక్షల ఎకరాలు బీమా కిందికి వచ్చాయి. దాదాపు 32 లక్షల మంది రైతులు తమ పంటలకు బీమా చేయించుకున్నారు. గత ఖరీఫ్ కంటే ఈ ఖరీఫ్‌లో భారీగా బీమా చేయించిన విస్తీర్ణం, రైతుల సంఖ్య తగ్గడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాకమే కారణం

సమగ్రం అన్నారు!

కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో తాము అధికారంలోకొస్తే రైతులు, కౌలు రైతులందరినీ ఆదుకునేలా సమగ్ర పంటల బీమా తీసుకొస్తామని హామీ ఇచ్చింది. తర్జన భర్జనల అనంతరం వైసిపి హయాంలో మోడీ సర్కార్ ఒత్తిడితో ప్రవేశపెట్టిన కేంద్ర పథకాలకే జై కొట్టింది. అప్పటి వరకు రైతులు చెల్లించాల్సిన ప్రీమియాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించగా, ఆ విధానానికి స్వస్తి పలికి రైతులనే కట్టుకోమంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం బీమాను రైతుల ఇష్టాయిష్టాలకే వదిలేసింది. అంతకుముందు వరకు బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకునే రైతులకు బీమా తప్పనిసరి. బ్యాంకులే ఆ పని చేసేవి. మోడీ ప్రభుత్వం ఆ విధానాన్ని ఎత్తేసింది. రైతులు తమ సమ్మతి తెలిపితేనే బ్యాంకులు పంటలకు బీమా చేయాలంది. తామే ప్రీమియం కట్టుకోవాల్సి రావడంతో, అసలే సాగు గిట్టుబాటుకాక ఆర్థిక సంక్షోభంలో ఉన్న రైతులు, కౌలు రైతులు బీమా జోలికి వెళ్లడానికి సాహసించలేదు. 2025 ఖరీఫ్‌లో ఫసల్ బీమా కోసం నోటిఫై చేసిన 26 జిల్లాల్లో కొన్ని పంటలను ఎంపిక చేశారు. సీజన్ ముగిసే సమయానికి రైతుల నుంచి 12 లక్షల వరకు దరఖాస్తులందాయి. వాటిలో 4.52 లక్షల మంది రైతులు తమ వాటా ప్రీమియాన్ని చెల్లించి బీమా పథకంలో చేరారు. వాతావరణ ఆధారిత బీమా కోసం 20 జిల్లాలను నోటిఫై చేయగా 7.30 లక్షల మంది రైతుల నుంచి దరఖాస్తులందాయి. వారిలో 3 లక్షల మంది తమ వాటా ప్రీమియం చెల్లించి 11.17 లక్షల ఎకరాలకు బీమా చేయించుకున్నారు.

కేంద్రం నిధులివ్వలేదు

2024 ఖరీఫ్ సమయంలో 'డబుల్ ఇంజిన్' సర్కారే అధికారంలో ఉంది. సీజన్ ముగిసి ఏడాదవుతున్నా ఫసల్ బీమా ప్రీమియంలో కేంద్రం తన వాటాగా చెల్లించాల్సిన నిధులివ్వకుండా పెండింగ్ పెట్టింది. రైతులు తమ వాటా కింద రూ.60.19 లక్షలు చెల్లించగా, రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద రూ.304 కోట్లు చెల్లించింది. కేంద్రం తన వాటా కింద రూ.304 కోట్లు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.50 కోట్లే ఇచ్చింది.

ఇన్సూరెన్స్ కంపెనీలకు ఫసల్ బీమా కింద రూ.355.95 కోట్లు ప్రీమియం చెల్లించగా, ఇప్పటి వరకు 82,320 మంది రైతులకు రూ.8.53 కోట్లు మాత్రమే పరిహారం సెటిల్ చేశాయి. 2024 ఖరీఫ్‌లో వాతావరణ ఆధారిత బీమా కింద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూ.739 కోట్లు ఇన్సూరెన్స్ కంపెనీలకు చెల్లించగా ఇప్పటి వరకు రైతులకు ఒక్క రూపాయి పరిహారం రాలేదు. కేంద్రం తన వాటా ప్రీమియం నిధులు ఇవ్వకపోయినా, ఇన్సూరెన్స్ కంపెనీలు రైతులకు క్లెయిములు పరిష్కారం చేయకపోయినా టిడిపి కూటమి సర్కార్ గమ్మునుంది. నిరుడు బుడమేరు వరదలు, భారీ వర్షాలు, కరువు వచ్చినా రైతులకు బీమా ఆసరా కాలేదు. ఉచిత బీమా ఉన్నప్పుడే పరిస్థితి అంత దారుణంగా ఉంటే, ఉచిత బీమా లేని ఈ ఖరీఫ్‌లో మొంథా, ఇతర విపత్తుల బాధిత రైతులకు బీమా పరిస్థితి మరింత దారుణంగా తయారైంది.

ఖరీఫ్ బీమా అమలు తీరు

వివరం	ఫసల్ 2024	బీమా 2025	వాతావరణ 2024	బీమా 2025
జిల్లాలు	26	26	21	20
విస్తీర్ణం	51.55	8.40	19.57	11.17
రైతులు	24.05	4.52	8.00	3.04
గ్రాస్ ప్రీమియం	355.95	37.19	739.29	420.09

- విస్తీర్ణం. లక్షల ఎకరాలు   - ప్రీమియం కోట్ల రూపాయలు

సుప్రీం ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియామకం

- 24న ప్రమాణస్వీకారం



న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా (సిజెఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నియమించారు. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖా మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ప్రకటించారు. 'భారత రాజ్యాంగం ఇచ్చిన అధికారాలను వినియోగించుకుని నవంబర్ 24, 2025 నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను నియమించడానికి రాష్ట్రపతి సంతోషంగా ఉన్నారు' అని మంత్రి గురువారం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ఆయనకు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను' అని కూడా పోస్టు చేశారు. ప్రస్తుత సిజెఐ జస్టిస్ గవాయ్ ఈ నెల 23న పదవీ విరమణ చేయనున్నా రు. 24న జస్టిస్ సూర్యకాంత్ 53వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ పదవిలో ఫిబ్రవరి 9, 2027 వరకూ అంటే సుమారు 15 నెలలు పాటు, తనకు 65 ఏళ్ల వయసు వరకూ జస్టిస్ సూర్యకాంత్ సిజెఐగా కొనసాగుతారు. హర్యానాలోని హిస్సార్ పెట్వార్‌లో 1962, ఫిబ్రవరి 10న జస్టిస్ కాంత్ జన్మించారు. రోహ్తక్‌లోని మహర్షి దయానంద్ విశ్వవిద్యాలయం నుంచి 1984లో న్యాయ పట్టా పొందారు. హిసార్‌లోని జిల్లా కోర్టులో న్యాయవాది వృత్తిని ప్రారంభించారు. 1985లోనే చండీగఢ్‌లోని పంజాబ్-హర్యానా హైకోర్టుకు మారారు. రాజ్యాంగం, సర్వీసెస్, సివిల్‌కు సంబంధించిన కేసుల్లో ప్రత్యేకత సాధించారు. 2000, జులైలో హర్యానాకు అతి పిన్న వయస్కుడైన అడ్వకేట్ జనరల్‌గా నియమితుల య్యారు. 2004, జనవరి 9న పంజాబ్- హర్యానా హైకోర్టు శాశ్వత జడ్జిగా పదోన్నతి పొందే వరకూ అడ్వకేట్ జనరల్‌గా పనిచేశారు. 2018 అక్టోబర్ 5న హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు సిజెగా నియమితుల య్యారు. సుప్రీంకోర్టు న్యాయ మూర్తిగా 2019, మే 24న నియమితులయ్యారు. బీహార్‌లో ఎస్‌ఐఆర్ పారదర్శకంగా ఉండాలని, తొలగించిన 65 లక్షల ఓటర్ల జాబితాను బహిర్గతం చేయాలనే తీర్పునిచ్చిన ధర్మాసనంలో ఉన్నారు.

రూ.5,265 కోట్లు

మొంథా నష్టంపై ప్రాథమిక అంచనా

విలేకరుల సమావేశంలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మొంథా తుపాను వల్ల రాష్ట్రానికి 5,265 కోట్ల రూపాయల మేర నష్టం వాటిల్లినట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మేరకు ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు. శాటిలైట్ చిత్రాలు, డ్రోన్లు, సిసి కెమెరాలు వంటి సాంకేతికతను వినియోగించి ప్రాథమిక అంచనాలు రూపొందించినట్లు ఆయన చెప్పారు. నష్టాన్ని కూడా టెక్నాలజీ సాయంతో తగ్గించామన్నారు. వ్యవసాయ పంటలకు రూ.829 కోట్లు, ఉద్యాన పంటలకు రూ.39 కోట్లు, సెరీకల్చర్‌కు రూ.65, ఆక్వారంగంలో రూ.1,270 కోట్లు, ఆర్ అండ్ బికి రూ.2,079 కోట్లు, మున్సిపల్‌శాఖలో రూ.109 కోట్లు, వాటర్‌రిసోర్స్‌లో రూ.207 కోట్లు, పంచాయతీరాజ్‌లో రూ.8 కోట్లు, విద్యుత్‌శాఖలో రూ.16 కోట్లు నష్టం జరిగినట్లు తెలిపారు. పశు సంవర్ధకశాఖలో రూ.71 లక్షలు నష్టం జరిగినట్లు ప్రాథమికంగా తేలిందన్నారు. తుపాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 120 పశువులు చనిపోయాయని, త్వరలోనే పూర్తిస్థాయి నష్టం అంచనాలు తయారుచేసి కేంద్రానికి పంపిస్తామని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానంతో తుపాను గమనాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేశామని, అత్యంత కచ్చితత్వంతో ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు హెచ్చరికలు చేరవేయడం ద్వారా నష్టాన్ని తగ్గించగలిగామని తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖలూ సమన్వయంతో పనిచేశాయని చెప్పారు. మొదటిరోజునే పరిస్థితులు చాలా వరకూ చక్కదిద్దినట్లు సిఎం తెలిపారు. తుపాన్లు, వర్షాలను ఆపలేమని, ముందస్తు జాగ్రత్తల వల్ల ఆస్తి, ప్రాణ నష్టాలను తగ్గించామని చెప్పారు. తుపాను ప్రభావం వల్ల ఎక్కడెక్కడ నదుల్లో ప్రవాహాలు ఉంటాయనే అంశంపై అధికారులకు సూచనలు చేశామని తెలిపారు.



ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కొనేందుకు మాన్యువల్

ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు మొంథా తుపాను సమయంలో చేపట్టిన చర్యలను ఒక మాన్యువల్‌గా రూపొందిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. టెక్నాలజీ వినియోగం ప్రజల కోసమేనని అన్నారు. ప్రజాప్రతినిధులు, అన్నిస్థాయిల్లో ఉద్యోగులు, సిబ్బంది సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారని అన్నారు. ఆర్‌టిజిఎస్ నుండి మంత్రులు లోకేష్, అనిత ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయికి ఆదేశాలు జారీచేశారన్నారు. గతంలో అన్నమయ్య ప్రాజెక్టు, గుండ్లకమ్మ, పులిచింతల గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని విమర్శించారు.

వైసిపి ఫేక్ ప్రచారం

టెక్నాలజీని ఉపయోగించి నష్టం నివారించగలిగామని, దాన్ని కూడా తట్టుకోలేక వైసిపికి చెందిన కొంతమంది ఫేక్ మనుషులు ఫేక్ ప్రచారాలు చేశారని సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫేక్ పోస్టులు పెట్టి దుష్ప్రచారం చేస్తున్నారని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయడం కూడా వారికి ఇష్టం లేనట్లు ఉందని తెలిపారు.

37 కరువు మండలాలు

తుపాను వల్ల విశాఖ నుండి నెల్లూరు వరకూ భారీ వర్షాలు కురిసినా రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు పడలేదని సిఎం అన్నారు. కొన్ని ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని, ఈ నేపథ్యంలో 37 మండలాలను కరువు ప్రభావిత మండలాలుగా ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

సిపిఎం సీనియర్ నేత చింతకాయల బాబూరావు హఠాన్మరణం

ప్రజాశక్తి- తాడేపల్లిగూడెం



బాబూరావు (ఫైల్)

సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు (64) గురువారం మధ్యాహ్నం కన్నుమూశారు. ఆకస్మికంగా అస్వస్థతకు గురైన ఆయనను చికిత్స నిమిత్తం రాజమండ్రిలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడే తీవ్ర గుండెపోటుకు గురై తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. భార్య శ్రీదేవి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బాధ్యతల్లో ఉన్నారు. బాబూరావు భౌతికకాయాన్ని గురువారం సాయంత్రం తాడేపల్లిగూడెంలోని సిపిఎం కార్యాలయానికి తరలించారు. సిపిఎం సీనియర్ నేత మంతెన సీతారాం పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, బి.బలరాం, తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి, టిడిపి, సిపిఐ, ప్రజా సంఘాల నేతలు తదితరులు ఉన్నారు. బాబూరావు మృతికి సిపిఎం రాష్ట్ర కమిటీ సంతాపం తెలిపింది. ఆయన భౌతికకాయాన్ని ఏలూరులోని ఆశ్రం వైద్య కళాశాలకు శుక్రవారం మధ్యాహ్నం అప్పగించనున్నారు.

గ్రామాల చెరువుల నీటిని ఎలా తరలిస్తారు?

- ఇండోసోల్ ప్రాజెక్టుపై హైకోర్టు ప్రశ్న

ప్రజాశక్తి-అమరావతి

గ్రామస్తులు రోజువారీ అవసరాలకు వాడుకునే చెరువునీటిని ఇండోసోల్ సోలార్ ప్రాజెక్టు కోసం ఎలా తరలిస్తారని హైకోర్టు ప్రశ్నించింది. ఫొటోలు చూస్తే నీటి తరలింపునకు పైపులైన్లు వేశారని అర్థమవుతోందని అభిప్రాయపడింది. నెల్లూరు జిల్లా చేవూరు, చెన్నాయపాలెం గ్రామాల చెరువుల నుంచి ఇండోసోల్ సోలార్ ప్రాజెక్ట్‌కు నీటిని తరలిస్తున్నారో, లేదో కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. నివేదికను తదుపరి విచారణ జరిగే నవంబర్ 5 నాటికి అందజేయాలని పేర్కొంది. అనుమతులు లేకుండా నీటి తరలింపు విషయంలో ముందుకు వెళ్లరాదని షరతు విధిస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. గుడ్లూరు మండలం చేవూరు, కావలి మండలం చెన్నాయపాలెం గ్రామాల పరిధిలోని గ్రామస్తులు వాడుకునే చెరువు నీటిని ఇండోసోల్ సోలార్ ప్రాజెక్ట్‌కు తరలిస్తున్నారంటూ గ్రామస్తులు పిల్ దాఖలు చేశారు. రెండు గ్రామాల ప్రజలు చెరువు నీటిని తాగునీరు, ఇతర రోజువారీ అవసరాలకు వాడుకుంటున్నారని న్యాయవాది చెప్పారు. పరిశ్రమల అవసరాలకు తరలింపు ఆపాలన్నారు. నీటి తరలింపు సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు వ్యతిరేకమన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ప్రణతి స్పందిస్తూ, ఈ ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. సోమశిల ప్రాజెక్ట్ నుండి ఇండోసోల్ సోలార్ ప్రాజెక్ట్ కావాల్సిన నీటిని తరలిస్తామన్నారు. ఫొటోలను పరిశీలించిన హైకోర్టు పైవిధంగా ఉత్తర్వులు జారీ చేసింది.



చెరువుల్లా పొలాలు

- భారీగా పంటలకు నష్టం
- శారదా నదికి గండి
- ప్రకాశం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక
- జలదిగ్బంధంలో పలు గ్రామాలు
- నష్ట అంచనాల్లో ప్రభుత్వ యంత్రాంగం



శారదా నది గట్టు తెగి పొలాల్లోకి ప్రవహిస్తున్న నీరు

ప్రజాశక్తి- యంత్రాంగం

మొంథా తుపాను నష్టాలను చూసి రైతుల గుండె చెరువవుతోంది. ముఖ్యంగా వరి, ఉద్యాన పంటలకు భారీగా నష్టం వాటిల్లింది. కొన్ని ప్రాంతాల్లో పొలాల్లో రెండు నుంచి మూడు అడుగుల మేరకు వరద నీరు చేరడంతో చెరువులను తలపిస్తోంది. దీంతో, రైతులు తీవ్రంగా కలత చెందుతున్నారు. ఈ నీటిని బయటకు పంపేందుకు ప్రయాస పడాల్సి వస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వరికి అత్యధికంగా నష్టం జరిగింది. నదుల్లోనూ, వాగుల్లోనూ వరద నీటి ఉధృతి కొనసాగుతోంది. పలు గ్రామాలు ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. కృష్ణా నదికి వరద పోటెత్తడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. విశాఖ జిల్లాలో శారదా నదికి గండిపడింది. పంట, ఆస్తుల లెక్కింపులో ప్రభుత్వ యంత్రాంగం ఉంది.

వెలుగొండ కాలువకు గండ్లు

ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణంలో సుమారు 20 కాలనీల్లోకి మోకాళ్లలోతు నీరు చేరింది. భారీ వర్షాలకు గుండ్లకమ్మ మొదలు అన్ని నదులూ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరడంతో 15 గేట్లు ఎత్తి కిందకు వదిలారు. దీంతో, మద్దిరాలపాడు, పాత చీర్వానుప్పలపాడు గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. మద్దిరాలపాడు వద్ద 216 జాతీయ రహదారిపైకి భారీగా నీరు పొంగి ప్రవహించడంతో చీరాల-ఒంగోలుకు రాకపోకలు నిలిచిపోయాయి. వెలిగొండ సొరంగాల్లోకి వరద నీరు చేరింది. దాని కాలువలకు గండ్లు పడ్డాయి. నల్లమలలో కురిసిన వర్షాలకు కంభం చెరువు నిండి అలుగుపారింది.

పొంగి ప్రవహిస్తోన్న నల్లమడ వాగు

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కురిసిన కుండపోత వర్షాలకు పొలాల్లో నీరు మిగతా 7లో

రైతులకు అండగా నిలవండి

వీడియో కాన్ఫరెన్స్‌లో వైసిపి నేతలకు జగన్ సూచన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో రైతులకు న్యాయం జరిగేలా చూడాలని, వారికి అండగా నిలవాలని వైసిపి నేతలకు మాజీ సిఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. తాడేపల్లిలోని వైసిపి కార్యాలయం నుండి పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో గురువారం ఉదయం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత రైతులకు భరోసా లేకుండా చేశారని అన్నారు. వైసిపి ప్రభుత్వంలో పక్కాగా ఉచిత పంటలబీమా అమలు చేశామని, 85 లక్షలమంది రైతులకు, 70 లక్షల ఎకరాల్లో ఉచిత ఇన్సూరెన్స్ ఇచ్చామని తెలిపారు. రైతుల తరుపున ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించిందని చెప్పారు. ఐదేళ్లలో 54.44 లక్షల మంది రైతులకు రూ.7,802 కోట్లు పరిహారం ఇచ్చామని చెప్పారు. ఇప్పుడు 19 లక్షల రైతులకే బీమా అందుతోందని, రుణాలు తీసుకున్న 19 లక్షల రైతులకే బ్యాంకులు బీమా కల్పించాయని, మిగిలిన వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రెండేళ్లుగా ఏ సీజన్లోనూ ప్రభుత్వం ప్రీమియం కట్టలేదని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. వ్యవసాయం దారుణంగా మారిందని అన్నారు. రైతులకు ప్రభుత్వం నుండి ఒక్క పథకమూ రావడం లేదని, ఇన్‌పుట్ సబ్సిడీ లేదని, అన్నదాత సుఖీభవ లోనూ మోసం చేశారని చెప్పారు. ఇ-క్రాప్‌కు మంగళం పాడారని, రైతు భరోసా కేంద్రాలు నిర్వీర్యం అయ్యాయని విమర్శించారు. పంటలకు గిట్టుబాటుధర లేక రైతాంగం తీవ్ర కష్టాల్లో ఉందని అన్నారు. అయినా టిడిపి కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని చెప్పారు. 16 నెలల్లో రైతులకు ఎప్పుడూ ఏదో ఒక కష్టం వస్తోందని తెలిపారు. మొంథా తుపాను విషయంలో ప్రభుత్వం విపరీతంగా ప్రచారం చేసుకుందని, క్షేత్రస్థాయిలో సహాయక చర్యలు సరిగా లేవని చెప్పారు.

కొత్త మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ప్రజా ఉద్యమం నిర్వహిస్తామని, ఇప్పటికే కోటి సంతకాల కార్యక్రమం చేపట్టామని తెలిపారు. నవంబరు 11న అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించాలని, కార్యకర్తలంతా చురుగ్గా పాల్గొనాలని జగన్ కోరారు.

ఎసిబి వలలో రేపల్లె ఫారెస్ట్ ఆఫీసర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



ఎసిబికి చిక్కిన వివి రమణారావు

బాపట్ల నగర వనం నిర్మాణంలో భాగంగా చేపట్టిన పనుల తాలూకు బిల్లుల చెల్లింపుల్లో 25 శాతం లంచం ఆశించిన రేపల్లె రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ వివి రమణారావును ఎసిబి అధికారులు పట్టుకున్నారు. ఎసిబి అధికారుల సమాచారం మేరకు.. నగరవనంలో రూ.5.90 లక్షల పనులు చేసిన కాంట్రాక్టర్ వీర్లంకయ్యను రూ.1.25 లక్షలు రమణారావు లంచం అడిగాడు. కాంట్రాక్టర్ ఎసిబి అధికారులను ఆశ్రయించారు. వారు రూపొందించిన పథకం ప్రకారం..బాపట్ల-సూర్యలంక రోడ్డులోని నగరవనంలో ఫారెస్ట్ ఆఫీసర్‌కు లంచం ఇస్తుండగా ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

తుపాను బాధితులను ఆదుకోండి

- నష్టపరిహారాన్ని పెంచండి
- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మొంథా తుపాను బాధితులను ఆదుకోవాలని, జరిగిన అసాధారణ నష్టాన్ని దృష్టిలో పెట్టుకుని నష్టపరిహారాన్ని పెంచాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తుపానుతో రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందని, పేదవారు, వృత్తిదార్లు ఉపాధి కోల్పోయారని, పౌల్ట్రీ, డెయిరీ, ఆక్వా రంగానికి కూడా భారీ నష్టం జరిగిందని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ప్రజల, ప్రభుత్వ ఆస్తులకు నష్టం వాటిల్లిందని, వరిపొట్టమీద ఉన్నదశలో తుఫాను వల్ల లక్షలాది ఎకరాల్లో పంటకు నష్టం జరిగిందని తెలిపారు. రైతులు ఇప్పటికే దాదాపు రూ.30 వేల వరకూ పెట్టుబడి పెట్టారని, కౌలు రైతులు ముందస్తుగానే యజమానులకు పైకం చెల్లించారని తీవ్రంగా నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. . గుర్తింపుకార్డులతో నిమిత్తం లేకుండా గ్రామసభల ద్వారా కౌలుదారులను గుర్తించి వారికే పూర్తిపరిహారం ఇవ్వాలని, లేని ఎడల కౌలు రైతులు నష్టపోవడమే కాకుండా వ్యవసాయ రంగమే కుదేలవుతుందని తెలిపారు. వరితోపాటు పత్తి, మిర్చి, పసుపు, అరటి, పప్పుదినుసులు, మొక్కజొన్న, బొప్పాయి, కూరగాయల పంటలకు భారీ నష్టం వాటిల్లిందని తెలిపారు. ఇటువంటి వ్యాపార పంటలకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లించాలని, గత మూడు సంవత్సరాలుగా రాష్ట్రంలో పంటలబీమా పథకం దాదాపు అదృశ్యమైందని తెలిపారు. ఇన్సూరెన్స్ ప్రైవేటు కంపెనీల చేతుల్లోకి పోవడమే దీనికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా పంటలబీమా పథకం ప్రారంభించి పూర్తిస్థాయి పరిహారం చెల్లించాలని కోరారు. రాష్ట్రమంతా కురిసిన భారీ వర్షాలకు వ్యవసాయ కూలీలు, చేతివృత్తిదారులు ఉపాధి కోల్పోయారని, వారి ఇబ్బందులను ప్రత్యేకంగా గుర్తించి ప్రతి వ్యవసాయకూలీ కుటుంబానికి రూ.20 వేలు, వృత్తిదారులకు రూ.50 వేలు చొప్పున సహాయం అందించాలని కోరారు. కూలిపోయిన లేదా పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లకు రూ.25 వేలు, గట్టి ఇళ్లకు రూ.10వేలు చొప్పున సాయం చేయాలని, మునిగిన ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికి రూ.10 వేలు చొప్పున సాయంతోపాటు 25 కిలోల బియ్యం, ఇతర నిత్యావసర సామాగ్రి అందించాలని కోరారు. ప్రభుత్వ సహాయ శిబిరాల్లో ఉండి తిరిగి వెళ్లినవారికి వంట సరుకులతోపాటు బియ్యం మిగతా 7లో

క్యూబాపై ఆంక్షలు ఎత్తివేయాలి..

- ఐరాస తీర్మానానికి 165 దేశాల మద్దతు

న్యూయార్క్ : క్యూబాపై దశాబ్దాలుగా అమెరికా విధించిన ఆర్థిక ఆంక్షలను ఎత్తివేయాలని ఐక్యరాజ్య సమితి (ఐరాస) డిమాండ్ చేసింది. బుధవారం జనరల్ అసెంబ్లీలో "క్యూబాపై యుఎస్ విధించిన ఆర్థిక, వాణిజ్య ఆంక్షలను ముగించాలి" అనే తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనికి 165 దేశాలు అనుకూలంగా ఓటు వేయగా, 7 దేశాలు వ్యతిరేకించాయి. మరో 12 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. గత సంవత్సరం తీర్మానానికి 187 దేశాలు క్యూబాకు మద్దతుగా ఓటు వేయగా, అమెరికా, ఇజ్రాయిల్ రెండు దేశాలు మాత్రమే వ్యతిరేకించాయి. ప్రస్తుతం జరిగిన ఓటింగ్‌లో వీటితో పాటు అర్జెంటీనా, హంగేరీ, పరాగ్వే, ఉత్తర మాసిడోనియా, ఉక్రెయిన్ వ్యతిరేకించడం గమనార్హం. ఉక్రెయిన్‌పై రష్యా దాడులకు క్యూబా మద్దతు తెలుపుతుందని, అక్కడి క్యూబన్లు రష్యా సైన్యంతో కలిసి దాడులు చేస్తున్నారని ఆరోపిస్తూ కొన్ని యూరప్ దేశాలు ఓటింగ్‌ను బహిష్కరించాయి. క్యూబా దీన్ని ఖండించింది. తమ దేశం ఇరుదేశాల మధ్య శాంతిని కోరుకుంటుందని, శాంతి చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని స్పష్టం చేసింది.



పులిచింతల ప్రాజెక్టు వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ఎత్తయిన గోడ నిర్మించండి

తండా రైతుల ఆందోళన

ప్రజాశక్తి అచ్చంపేట (పల్నాడు జిల్లా)


పులిచింతల ప్రాజెక్టు నుండి దిగువకు ఆకస్మికంగా నీళ్లు వదలడంతో తమ పొలాలు నీట మునుగుతున్నాయని తండా రైతులు ఆందోళన చేపట్టారు. తమ పొలాలు ముంపునకు గురికాకుండా ఎత్తైన కాంక్రీట్ గోడ నిర్మించాలని రైతులు డిమాండ్ చేశారు. ప్రాజెక్టుకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న జడపల్లి తండా, కంచుబోడు తండాలకు చెందిన రైతులు మాట్లాడుతూ.. ఎటువంటి సమాచారం లేకుండా నీటిని విడుదల చేశారని, దీనివల్ల తమ పొలాలు నీట మునుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పొలాలు ముంపునకు గురి అవుతుండటంతో పాటు భూములు కోతకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎత్తయిన కాంక్రీట్ గోడ నిర్మించాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగాల గేట్‌వేగా 'నైపుణ్యం పోర్టల్'

- ప్రతి నెలా, ప్రతి నియోజకవర్గంలో జాబ్‌మేళాలు
- సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూసే వారి కోసం రూపొందించే 'నైపుణ్యం' పోర్టల్ ఉద్యోగాల గేట్‌వేగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణపై గురువారం సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాలు అందించాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని సాకారం చేసేలా అధికారులు కృషి చేయాలని అన్నారు. ఇకపై ప్రతి నెలా, ప్రతి నియోజకవర్గంలో జాబ్ మేళాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నవంబర్‌లో జరిగే భాగస్వామ్య సదస్సులోగా నైపుణ్యం పోర్టల్ ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందిన వారికి ఇక నుంచి అధికారికంగా ధ్రువపత్రాలు జారీ చేయాలని చెప్పారు. పోర్టల్‌లో ఐటిఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలలు, యూనివర్సిటీలు వివిధ విద్యాసంస్థలతో పరిశ్రమలు, సంస్థలను అనుసంధానించాలని ఆదేశించారు. విద్యాసంస్థలకు ఫ్యూచర్ ట్రెండ్స్ తెలిసేలా చేయాలని చెప్పారు. ప్లేస్మెంట్ వివరాలనూ ట్రాకింగ్ చేసేలా ఉండాలని తెలిపారు.



నైపుణ్యాభివృద్ధి శిక్షణపై సమీక్షా సమావేశంలో సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ తదితరులు

పాఠశాల స్థాయిలో విద్యార్థుల నూతన ఆవిష్కరణలను మరింత ఉన్నతీకరించేలా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో అనుసంధానించాలని తెలిపారు.

క్లస్టర్ల ఆధారంగా నైపుణ్య శిక్షణ : లోకేష్

క్లస్టర్ బేస్డ్ అప్రోచ్ ద్వారా నైపుణ్యాలను పెంచేలా ప్రయత్నిస్తున్నామని, స్పేస్, ఆక్వా, క్వాంటం వంటి రంగాల్లో సంస్థలు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించేలా కార్యాచరణ చేపట్టామని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఈ సమావేశంలో తెలిపారు. మొత్తం 15 క్లస్టర్ల ద్వారా పరిశ్రమలకు మానవ వనరుల్ని అందించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని వివరించారు. ఈ విధానంపై ఆస్ట్రేలియాలో అధ్యయనం చేసి అమలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో నిర్వహించిన జాబ్ మేళాల ద్వారా 1.44 లక్షల మందికి ఉద్యోగాలు లభించాయని ముఖ్యమంత్రికి అధికారులు తెలిపారు. నైపుణ్యం పోర్టల్ నుంచి ఎఐ ద్వారా అభ్యర్థులు తమ రెజ్యూమ్ రూపొందించుకునే వెసులుబాటు కల్పించినట్లు వెల్లడించారు.



చింతకాయల బాబూరావు భౌతికకాయానికి పూలమాలలు వేస్తున్న ఆయన సతీమణి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీదేవి, పక్కనే సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, ఎంఎల్‌సి గోపీమూర్తి

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం

- చింతకాయల బాబూరావు మృతిపట్ల పలువురు సంతాపం
- ప్రజా ఉద్యమాలకు తీరని లోటు : వి. శ్రీనివాసరావు

ప్రజాశక్తి - యంత్రాంగం

సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు తాడేపల్లిగూడెంలో ఓ మధ్య తరగతి కుటుంబంలో జన్మించారు. రైస్ మిల్లు డ్రైవర్‌గా పనిచేస్తూ వారి సమస్యలపై పోరాడే క్రమంలో సిఐటియులో చేరి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బాధ్యతలు నిర్వర్తించారు. సిపిఎం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యునిగా పనిచేస్తూ జిల్లాల విభజన నేపథ్యంలో అప్‌ల్యాండ్, ఏలూరు జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. జిల్లాల పునర్విభజన అనంతరం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యునిగా ఉంటూ రైతు రంగం బాధ్యతలు చూస్తున్నారు. భౌతికకాయానికి ఏలూరు, పశ్చిమగోదావరి కార్యదర్శులు ఎ.రవి, జెఎన్‌వి.గోపాలన్, సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి.నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగరావు, వివిధ ప్రజా సంఘాల జిల్లా నేతలు నివాళులర్పించారు.

బాబూరావు మృతి కార్మికవర్గానికి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలో సాధారణ కార్మికుడిగా జీవితాన్ని ప్రారంభించి కార్మిక నాయకుడిగా పశ్చిమగోదావరి జిల్లా పార్టీ కార్యదర్శిగా, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా పలు రాకల బాధ్యతలు నిర్వహించారని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రత్యేకించి శ్రీదేవికి రాష్ట్ర కమిటీ తరపున సానూభూతి ప్రకటించారు. బాబూరావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ సిపిఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పి మధు మరో ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం, కెవిపిఎస్, యుటిఎఫ్, ఎపిఎస్‌ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ గొర్రెల మేకల పెంపకం దారులు సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాలు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపాయి. బాబూరావు మృతి పట్ల సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం, మాజీ ఎమ్మెల్యే పాటూరు రామయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి బి.వెంకట్, సిఐటియు జాతీయ కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య తదితరులు సంతాపం తెలిపారు.

బాబూరావు మృతి పట్ల సిఐటియు తెలంగాణ రాష్ట్ర కమిటీ సంతాపం తెలిపింది. సిఐటియు తరపున అఖిల భారత కోశాధికారి ఎం. సాయిబాబు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. వీరయ్య, సుధాభాస్కర్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ సంతాపం తెలిపారు. బాబూరావు కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పెండింగ్ సబ్సిడీ నిధులు విడుదల చేయాల్సిందే

- మంగళగిరి ఎపిఐఐసి కార్యాలయం వద్ద గిరిజన పారిశ్రామికవేత్తల అర్ధనగ్న ప్రదర్శన
- కమిషనర్ హామీతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

గిరిజన పారిశ్రామికవేత్తలకు రావలసిన సబ్సిడీ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ ట్రాన్‌పోర్టర్స్ అండ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు గురువారం మంగళగిరి ఎపిఐఐసి కార్యాలయ భవనం వద్ద అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిరసన వ్యక్తం చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు కె శామ్యూల్ మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లుగా రీయింబర్స్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ నిధులు విడుదల కాకపోవడంతో గిరిజన పారిశ్రామికవేత్తలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రతి నెల చెల్లించవలసిన ఇఎంఐలను చెల్లించలేక అనేకమంది గిరిజన వ్యాపారులు ఆర్థిక ఒత్తిడిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీపావళి కానుకగా విడుదల చేసిన రూ.1,500 కోట్లలో



మంగళగిరి ఎపిఐఐసి కార్యాలయం వద్ద అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న ఎస్‌టి పారిశ్రామికవేత్తలు

ఆరు శాతం అయిన రూ.90 కోట్లు ఎస్‌టి పారిశ్రామికవేత్తలకు కేటాయించాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు అందజేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సంవత్సరానికి కేటాయించిన రూ.46 కోట్ల బడ్జెట్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వం తిరిగి వెనక్కి తీసుకుందన్నారు. ఈ సమస్యలను ప్రిన్సిపల్ సెక్రటరీ యువరాజ్‌కి దృష్టికి తీసుకెళ్లగా, ఎస్‌టి పారిశ్రామికవేత్తల బకాయిలను వంద శాతం చెల్లించిన తరువాతే మిగిలిన పారిశ్రామికవేత్తలకు నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇండస్ట్రియల్ డిపార్ట్‌మెంట్ కమిషనర్‌ను ఈ నెల 24న కలిసి న్యాయం చేయాలని కోరినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రి లోకేష్ స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్‌కు నాయకులు వినతి పత్రం అందజేశారు. సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె పరమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం రామకోటయ్య, ప్రధాన కార్యదర్శి ఎం ఆంజనేయులు, సహాయ కార్యదర్శి కె వాసు, ట్రెజరర్ టి వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ కార్యదర్శి టి రామకృష్ణ, సభ్యులు కె శ్రీనివాసరావు, కె వెంకయ్య పాల్గొన్నారు.

మరో 12,771 కోట్ల విద్యుత్ వడ్డన

- 18న ఎపిఇఆర్‌సి విచారణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రజానీకంపై మరో 12,771 కోట్ల విద్యుత్ వడ్డనకు రంగం సిద్ధమైంది. డిస్కమ్‌లు సమర్పించిన ట్రూ-అప్ ప్రతిపాదనలపై ఈ నెల 18న బహిరంగ విచారణ నిర్వహించనున్నట్లు ఎపిఇఆర్‌సి కార్యదర్శి పి కృష్ణ బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. (2019-24) 4వ నియంత్రణ కాలంలో ఆదాయ లోటు వచ్చిందని పేర్కొంటూ విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్ వినియోగదారులపై రూ.12,771 కోట్ల భారాన్ని ప్రతిపాదించిన విషయం తెలిసిందే. ఈ ప్రతిపాదనలపై జులై 31న నోటిఫికేషన్ విడుదల చేసిన నియంత్రణ మండలి ప్రజలు, విద్యుత్ వినియోగదారులు, విద్యుత్ నిపుణుల నుంచి అభ్యంతరాలు, సలహాలతో డిస్కంల సమాధానాలను కూడా స్వీకరించింది. వీటిపై నవంబర్ 18వతేదిన కర్నూలు లోని ఎపిఇఆర్‌సి కార్యాలయంలో ఉదయం 11 గంటలకు విచారణ జరగనుంది.

తిరుమలలో పుష్పయాగ మహోత్సవం

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల శ్రీవారి ఆలయంలో కార్తీక మాసం శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని నిర్వహించే పుష్పయాగానికి అవసరమైన పుష్పాల ఊరేగింపు గురువారం తిరుమలలో ఘనంగా జరిగింది. కల్యాణవేదిక వద్ద గల ఉద్యానవన విభాగంలో ముందుగా పుష్పాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, ఉద్యానవన సిబ్బంది, శ్రీవారి సేవకులు కలిసి పుష్పాలను ఊరేగింపుగా శ్రీవారి ఆలయం వరకు తీసుకువచ్చారు.



కృష్ణా జిల్లా కోడూరులో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న పవన్ కల్యాణ్

తుపానుపై కేంద్రానికి త్వరలో నివేదిక

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - అవనిగడ్డ, కోడూరు, మోపిదేవి :

మొంథా తుపాను నష్టంపై నివేదిక తయారు చేసి కేంద్రానికి పంపుతామని, అవసరం మేరకు కేంద్ర సాయం కోరతామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ, పర్యావరణం, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో తుపాను నష్టాన్ని గణనీయంగా నివారించగలిగామని చెప్పారు. కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలో గురువారం ఆయన పర్యటించారు. ముందుగా మండల కేంద్రమైన కోడూరు గ్రామపంచాయతీ పరిధిలోని కృష్ణాపురం ఆర్‌సిఎం చర్చి వద్ద దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించారు. పొలంలోకి దిగి నేలవాలిన వరి పంటను చూసి రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అవనిగడ్డలో దెబ్బతిన్న అరటి తోటలు, విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద తుపాను నష్టాలపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తుపాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్‌కు చెందిన 274 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేశామన్నారు. 1,583 గ్రామాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని, ఆయా గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య నిర్వహణకు సుమారు 21,055 మంది సిబ్బందిని వినియోగించాల్సి ఉందని చెప్పారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని ప్రతి రేషన్ కార్డుదారునికీ 25 కిలోల బియ్యం (మత్స్యకార కుటుంబాలకు 50 కిలోలు), కిలో చొప్పున పంచదార, కందిపప్పు, నూనె ఇతర నిత్యావసర సరుకులు ఉచితంగా అందిస్తామన్నారు. సహాయక శిబిరాల్లో ఉన్న ఒక వ్యక్తికి రూ.వెయ్యి చొప్పున కుటుంబానికి గరిష్టంగా మూడు వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వాసంశెట్టి సుభాష్, కొల్లు రవీంద్ర, ఎంపి వల్లభనేని బాలశౌరి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

'మొంథా'ను జాతీయ విపత్తుగా ప్రకటించాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మొంథా తుపానును జాతీయ విపత్తుగా గుర్తించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ప్రకృతి విలయాలను వెంటనే జాతీయ విపత్తుగా ప్రకటించుకునే ప్రధాని మోడీ రాష్ట్రంపై వివక్ష చూపిస్తున్నారని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10 లక్షలకుపైగా రైతు కుటుంబాలు రూ.20 వేల కోట్లకుపైగా నష్టపోయాయని తెలిపారు. నష్టం అంచనాకు ప్రత్యేక బృందాలను రాష్ట్రానికి పంపాలని, నివేదికలొచ్చే లోపు తక్షణ సాయం కింద రూ.10 వేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 20 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగితే, 2.88 లక్షల ఎకరాల్లోనే నష్టం జరిగినట్లు చూపడం రైతులను మోసం చేయడమేనన్నారు.



ఊళ్ల పాలెంలో మహిళలతో మాట్లాడుతున్న దామచర్ల సత్య

తుపాన్ బాధితులకు అండగా ప్రభుత్వం

- రాష్ట్ర మారిటైమ్ బోర్డు ఛైర్మన్ సత్య

ప్రజాశక్తి-శింగరాయకొండ (ప్రకాశం జిల్లా)

మొంథా తుపానుతో నష్టపోయిన ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య తెలిపారు. ప్రకాశం జిల్లా శింగరాయకొండ మండల పరిధిలోని బింగినపల్లి, ఊళ్లపాలెం, పాకల, సోమరాజు పల్లి గ్రామాలను గురువారం ఆయన సందర్శించారు. తొలుత బింగినపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పెద్దన్నపాలెంలో పర్యటించి స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బింగినపల్లి చెరువును పరిశీలించి లీకేజీ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువు కట్ట తెగిపోతే పెద్దన్నపాలెంకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలిపారు. అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఊళ్లపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని మత్స్యకారులు పడుతున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లోని వర్షపు నీటిని మోటార్ల ద్వారా నీటిని బయటికి పంపించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోండి

- దెబ్బతిన్న పంటలను పరిశీలించిన సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు
- కొండ ప్రాంతాల్లో రక్షణ గోడలు నిర్మించాలి : బాబూరావు
- వరికి రూ.25,000 నష్టపరిహారం చెల్లించాలి : ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - యంత్రాంగం

మొంథా తుపానుతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిపిఎం నాయకులు కోరారు. నెలకొరిగిన వరి, దెబ్బతిన్న పంటలను గురువారం సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు పరిశీలించారు. గుంటూరు జిల్లా కొల్లిపర, తెనాలి, మండలాల్లోని దావలూరు, జముడుపాడు, బుర్రిపాలెం తదితర గ్రామాల్లో దెబ్బతిన్న పంట పొలాలను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, గుంటూరు జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి తదితర బృంద నాయకులు పర్యటించారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎకరా వరికి రూ. 25,000, అరటి, పసుపు, క్యాలీ ఫ్లవర్ వంటి పంటలకు ఎకరాకు రూ. 50,000లు నష్టపరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాజధాని ప్రాంతం ఉండవల్లి, పెనుమాకలో నష్టపోయిన పంట పొలాలను సిపిఎం బందంతో కలిసి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు పరిశీలించారు. ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంతో పాటు పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయడాన్ని అభినందిస్తూనే, రైతుల పంటలను కాపాడటంలో విఫలమయ్యారని విమర్శించారు. గుంటూరు జిల్లా పెదనందిపాడు, కాకుమాను మండలాల్లో పత్తి, మిరప, వరి పంటలను సిపిఎం, రైతుసంఘాల నాయకులు పాశం రామారావు తదితరులు సందర్శించారు. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలంలోని యలమంద, చిన్న తురకపాలెం, చింతలపాలెం, గోనెపూడి, గ్రామాలలో ఎపి రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి



అల్లూరి జిల్లా పాడేరు మండలం దోకులూరులో భారీ వర్షానికి కూలిన ఇంటిని పరిశీలిస్తున్న అప్పలనర్స తదితరులు

గోపాలరావు తదితరులు పర్యటించి దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు.

విజయవాడ 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు కొండ ప్రాంతంలో చెట్లు నేలకొరిగిన ఘటనలో ధ్వంసమైన ఇళ్లను స్థానిక కార్పొరేటర్ బోయి సత్యబాబుతో కలిసి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు పరిశీలించారు. బాబూరావు మాట్లాడుతూ... నిరుపేదలు నివసించే కొండ ప్రాంతాలలో రక్షణ గోడలు నిర్మించాలని, రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం రూ.100 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ధ్వంసమైన ఇళ్లకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం పెదఓగిరాల, ఆకునూరు, కాటూరు, కడవకొల్లు, గండిగుంట గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. హరిబాబు పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. మోపిదేవిలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు పర్యటించారు.

ఏలూరు జిల్లా నిడమర్రు మండలంలోని అడవికొలను, భువనపల్లి గ్రామాల్లో పంట నష్టపోయిన రైతులను సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు పరామర్శించారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండల యండగండి సచివాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపి వినతిపత్రం అందజేశారు. అనకాపల్లి జిల్లా మునగపాక మండలం యాదగిరిపాలెం, చూచుకొండ, గణపర్తి, ఆనందపురం తదితర గ్రామాల్లో నేలకొరిగిన చెరుకు, నీట మునిగిన వరి పొలాలను ఎపి రైతు సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, కోశాధికారి గండి నాయన బాబు పరిశీలించారు. దేవరాపల్లి మండలం వాలాబు పంచాయతీ శివారు బొర్రచింత గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బిటి.దొర పర్యటించి అక్కడి గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అల్లూరి జిల్లా పాడేరు మండలం జి.ముంచింగిపుట్టు పంచాయతీ దోకులూరులో సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, జి.ముంచింగిపుట్టు సర్పంచ్ కిల్లో సత్యనారాయణ తదితరులు పర్యటించారు. విశాఖలో చాకలి గెడ్డ, ముత్యమాంబ కాలనీ, రాజీవ్ కాలనీ, అంబేద్కర్ కాలనీ, పైడిమాంబ కాలనీల్లో తుపాను బాధిత కుటుంబాలను పరామర్శించారు. విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం కొండమల్లిపూడిలో వర్షాలకు కూలిపోయిన గిరిజన ఇళ్లను సిపిఎం నాయకులు సందర్శించారు.

ఐదు కేటగిరీల్లో పరిశ్రమలు

- మారిటైమ్ బోర్డు మార్గదర్శకాలు జారీ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మారిటైమ్ బోర్డు పరిధిలో ఐదు రకాల పరిశ్రమలను ఏర్పాటుచేసేందుకు నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్ర పెట్టుబడులు, మౌళికాభివృద్ధి శాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ పరిధిలో చేపట్టాల్సిన పోర్టు ఆధారిత నిర్మాణాలు, పరిశ్రమల ఏర్పాట్లు, అందుకు విధివిధానాలను గురువారం జారీచేసిన ఉత్తర్వుల్లో పొందుపరిచారు. ఏర్పాటుచేసే పరిశ్రమలను ఐదు కేటగిరీలుగా విభచించారు. మారిటైమ్ బోర్డు పరిధిలో పోర్టు ఆధారిత పరిశ్రమల ఏర్పాటు సమయంలో ఐదు రకాల పరిశ్రమలకు అనుమతులు ఇవ్వనున్నారు. అతి చిన్న మైక్రో స్థాయి పరిశ్రమ నుంచి చిన్న, మధ్య, సబ్ లార్జ్-లార్జ్, మెగా- అల్ట్రా మెగా స్థాయి వరకు ఈ పరిశ్రమలను విభజించారు. 125 కోట్ల నుంచి 500 కోట్ల వరకు పెట్టుబడితో స్థాపించే వాటిని సబ్ లార్జ్ కేటగిరీలో, 501 నుంచి వెయ్యి కోట్ల వరకు స్థాపించే పరిశ్రమలను లార్జ్ కేటగిరీలో చేర్చారు. 1001 కోట్ల నుంచి ఐదు వేల కోట్ల వరకు మెగా పరిశ్రమలుగా, ఆపై పెట్టుబడులతో ఏర్పాటుచేసే పరిశ్రమలను అల్ట్రా మెగా పరిశ్రమలుగా గుర్తిస్తారు. ఇదే సమయంలో పోర్టు ఆధారిత పరిశ్రమల్లో ఏయే పరిశ్రమలను ఏర్పాటు చేయాలన్నదానిపైనా ఉత్తర్వుల్లో స్పష్టత ఇచ్చారు. ఓడరేవుల అభివృద్ధికి ఉపయోగపడే పరిశ్రమలు, పోర్టులకు సన్నిహితంగా ఉండే ప్రాంతంలో ఏర్పాటుచేసేందుకు అవకాశం ఉన్న పరిశ్రమలు, ఓడల నిర్మాణ కార్యక్రమాలు, తీర రవాణా, ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అభివృద్ధి, జన పర్యాటకం ఈ పరిధిలోకి వస్తాయి. ప్రధానంగా పర్యాటకానికి సంబంధించి పర్యాటక టెర్మినల్స్ నిర్మాణం, వాటర్ టాక్సీల కోసం ప్రత్యేక టెర్మినళ్లు, కయాకింగ్, డైవింగ్, పారా సైలింగ్ వంటి అడ్వంచర్ క్రీడా కార్యక్రమాలు, ఆ రంగంలో నైపుణ్య హబ్‌ల ఏర్పాటు వంటివి ఉంటాయి. ఇదే సమయంలో పరిశ్రమలు, ఇతర ఏర్పాట్లకు సంబంధించి సాధారణ, ఆర్థిక, సాంకేతిక, ప్రోత్సాహకాలు, డాక్యుమెంట్లు, పరిశీలనకు కమిటీల ఏర్పాట్లు వంటి వాటిపైనా మార్గదర్శకాల్లో స్పష్టతనిచ్చారు. అనుమతులు వచ్చిన తరువాత వాటిని ఉల్లంఘిస్తే తీసుకునే చర్యలు, విధించే జరిమానాలపైనా ఉత్తర్వుల్లో పేర్కొనడం విశేషం.

పిపిఎడిఎ ఏర్పాటు

కాగా తాజాగా పోర్టుల సన్నిహిత ప్రాంత అభివృద్ధి అథారిటీని (పోర్టు ప్రాక్సిమల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ-పిపిఎడిఎ)ను ఏర్పాటుచేస్తూ ప్రత్యేక ఉత్తర్వులు జారీచేశారు. దీని పరిధి పది కిలోమీటర్లుగా ఉంటుందని స్పష్టం చేశారు. దీనికి ఒక కమిటీ ఏర్పాటు చేస్తూ మారిటైమ్ బోర్డు చైర్మన్ అధ్యక్షతన, బోర్డు సిఇఓ, ఆయా పోర్టులు ఉండే జిల్లాలకు సంబంధించి జిల్లా కలెక్టర్, పరిశ్రమలశాఖ జిఎం, ఆర్ అండ్ బి ఎస్ఇ, విద్యుత్ శాఖ ఎస్ఇలను సభ్యులుగా చేర్చారు.

ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించాల్సిందే

కర్నూలు కలెక్టరేట్ ఎదుట సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఆరోగ్య శ్రీ ద్వారా వైద్య సేవలను కొనసాగించాలని, బకాయి పడ్డ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కర్నూలు కలెక్టరేట్ ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ...రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి బకాయి పడిన రూ.2700 కోట్ల ఆరోగ్య శ్రీ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌టిఆర్ వైద్య సేవ పేరుతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులలో వైద్య సేవలు నిలిచిపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. నరేంద్ర మోడీ మెప్పుకోసం జిఎస్‌టి సంబరాల పేరుతో వందల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసే బదులు ప్రజల వైద్యం కోసం ఖర్చు పెడితే ఉపయోగకరంగా ఉండేదన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆరోగ్యశ్రీ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అంజిబాబు, ఆనంద్‌బాబు, రామకష్ణ, జిల్లా నాయకులు అరుణమ్మ, ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం రాజశేఖర్ మాట్లాడారు. బకాయిపడ్డ నిధులు విడుదల చేయకపోతే భవిష్యత్తులో ఇతర రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలను సమీకరించి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి. రాముడు అధ్యక్షత వహించారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

జౌన్‌పూర్‌లో రోడ్డు ప్రమాదం

- 16 మంది శ్రీకాకుళం వాసులకు గాయాలు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి, పలాస

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని జౌన్‌పూర్‌లో గురువారం ట్రావెల్స్ బస్సును లారీ ఢీకొన్న ఘటనలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన 16 మంది గాయపడ్డారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి, పలాస మండలానికి చెందిన 40 మంది రైలులో తీర్థయాత్రలకు వెళ్లారు. వారిలో 16 మంది కాశీ నుంచి అయోధ్యకు ట్రావెల్ బస్సుల్లో వెళ్తుండగా జౌన్‌పూర్ జాతీయ రహదారి వద్ద లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో కోటబొమ్మాళి గ్రామానికి చెందిన బోయిన ముత్యాలరావు, ఆయన భార్య ఉషారాణి, జామి కిషోర్, పలాస మండలం బ్రాహ్మణతర్లాకు చెందిన పట్నాన వజ్రమూర్తి, రమాదేవికి తీవ్రంగా, మిగిలిన వారికి స్వల్పంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను అక్కడ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. జౌన్‌పూర్ కలెక్టర్, వారణాసి అధికారులతో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. క్షతగాత్రులతో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. క్షతగాత్రులను సురక్షితంగా స్వస్థలాలకు తరలించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని హామీనిచ్చారు.

'అంబేద్కర్ స్మృతివనం' కార్మికులకు జీతాలు చెల్లించాలి

- కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్మృతివనంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులకు జీతాల బకాయిలు వెంటనే చెల్లించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. జీతాల కోసం ఆందోళన చేస్తున్న కార్మికులను గురువారం కలిసి, మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్మృతివనం నిర్వహణ విషయంలో ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందన్నారు. జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ తక్షణమే స్పందించి కార్మికులకు జీతాల బకాయిలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో సిఐటియు, దళిత ప్రజా సంఘాలు ఐక్య ఉద్యమాలు చేయనున్నట్లు తెలిపారు. అధికారుల కార్యాలయాలు, కాంట్రాక్టర్ ఇంటిని ముట్టడించనున్నట్లు హెచ్చరించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్మృతివనం (సామాజిక న్యాయ మహాశిల్పం) సిఇఒ మల్లికార్జునను కలిసి సమస్యల పై చర్చించారు. పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు జి.క్రాంతికుమార్, సిఐటియు నాయకులు ఎం.బాబూరావు, వై.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

'మొంథా'తో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మొంథా తుపాను సృష్టించిన భీభత్సం వల్ల పంటలు నష్టపోయిన రైతంగాన్ని, బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం విడుదల చేసిన ప్రకటనలో మొత్తం 15 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని, సుమారు 10 లక్షల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. తుపాను ప్రభావం 40 లక్షల పైచిలుకు కుటుంబాలపై పడిందని అన్నారు. పంట నష్టపరిహారాన్ని వెంటనే లెక్కించి, రైతులను, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఎకరాకు రూ.25 వేల నుంచి 50 వేల వరకూ నష్టపరిహారం తక్షణమే చెల్లించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు పంపి నిధులు రాబాట్టాలని సూచించారు.

మెడికల్ కళాశాలల పిపిపి విరమించండి

రాష్ట్రంలో ఏర్పాటు చేసే ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ (పిపిపి) ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని సిపిఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. రాష్ట్రానికి 10 ప్రభుత్వ వైద్య కళాశాలలను కేంద్రం మంజూరు చేయగా, పిపిపి విధానంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం దుర్మార్గమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య పేర్కొన్నారు.

తోషిబా ఐఒటి హ్యాకథాన్‌కు దరఖాస్తుల స్వీకరణ

బెంగళూరు : తోషిబా డిజిటల్ సొల్యూషన్స్, తోషిబా సాఫ్ట్‌వేర్ ఇండియాతో కలిసి దేశంలోనే తొలిసారి గ్రిడ్‌డిబి క్లౌడ్ ఐఒటి హ్యాకథాన్‌ను నిర్వహించనున్నట్లు తెలిపాయి. 2026 జనవరి 31-ఫిబ్రవరి 1 వరకు బెంగళూరులో దీన్ని ఏర్పాటు చేస్తోన్నట్లు ఆ కంపెనీ పేర్కొంది. దీనికోసం 2025 డిసెంబర్ 14 వరకు దరఖాస్తు చేసుకోవడానికి వీలుందని తెలిపింది. మైక్రోసాఫ్ట్ అజూర్ మార్కెట్‌ప్లేస్‌లో అందుబాటులో ఉన్న ఈ టైమ్ సిరీస్ డేటాబేస్‌ను ఉపయోగించి స్టార్టప్‌లు, విద్యార్థులు, డెవలపర్లు రియల్-టైమ్ ఐఒటి అప్లికేషన్‌లను అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. స్మార్ట్ తయారీ, శక్తి, మొబిలిటీ, ఆరోగ్యం వంటి రంగాల్లో ప్రపంచ సవాళ్లను పరిష్కరించే ప్రోటోటైప్‌లు తయారు చేసి, టాప్ 5 జట్లు ఫైనలిస్టులుగా నిలువవచ్చు.

హాస్టల్లో భోజనం... బడిలో పడక

- శిథిలావస్థలో తోటవాడ బిసి వసతిగృహం
- రెండేళ్ల కిందటే ఖాళీ చేయాలని ఇంజనీరింగ్ అధికారుల సిఫార్సు
- కొత్త భవనం కోసం ప్రతిపాదనలు పంపినా క్లియరెన్స్ ఇవ్వని ప్రభుత్వం



పాడుబడిన స్థితిలో తోటవాడ బాలుర వసతిగృహం

టి.భీమారావు, శ్రీకాకుళం ప్రతినిధి

అది బడుగు పిల్లల వసతిగృహం. 50 ఏళ్ల కిందట నిర్మించిన భవనం. ఎక్కడికక్కడ పెచ్చులూడి ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి. కొద్దిపాటి వర్షం పడినా స్లాబ్ నుంచి నీరు కారుతుంది. రెండేళ్ల కిందట పరిశీలించిన ఇంజనీరింగ్ అధికారులు దాన్ని ఖాళీ చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. దీనిపై బిసి సంక్షేమ అధికారులు అప్పట్లోనే ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం క్లియరెన్స్ ఇవ్వలేదు. దీంతో, ముందుజాగ్రత్తగా అధికారులు వారిని సమీపంలోని ఉన్నత పాఠశాలలో రాత్రి పడుకోబెడుతున్నారు. భోజనాలు, స్నానాలకు మాత్రం హాస్టల్‌కు వస్తున్నారు. ఇదీ శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం తోటవాడ బిసి బాలుర సంక్షేమ వసతిగృహంలోని పరిస్థితి. ఈ వసతి గృహం పాటు పలు వసతి గృహాలను 'ప్రజాశక్తి' పరిశీలించింది. తోటవాడ బిసి బాలుర వసతిగృహంలో 48 మంది విద్యార్థులు చదువుతున్నారు. సుమారు ఐదు దశాబ్దాల కిందట నిర్మించిన ఈ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది.



గిరిజన కళాశాల వసతిగృహం హాల్‌లో నిద్రిస్తున్న విద్యార్థులు

హాస్టల్లో పేరుకు 12 గదులు ఉన్నా, పూర్తిగా దెబ్బతినడంతో ఎనిమిది గదులకు తాళాలు వేసేశారు. కాస్తోకూస్తో బాగున్న గదుల్లో విద్యార్థులను ఉంచుతున్నారు. ఆ గదుల నుంచి విద్యార్థులు ఉంటున్న సయమంలోనే స్లాబ్ నుంచి పెచ్చులూడి పడడంతో అధికారులు వారిని రాత్రివేళ్లలో అక్కడ ఉంచడం లేదు. సమీపంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఓ గదిలో పడుకోబెడుతున్నారు. విద్యార్థులు ఉదయం వసతిగృహానికి వచ్చి కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. హాస్టల్ భవనం పరిస్థితి బాగాలేకపోవడంతో వర్షాలు, తుపాన్ల సందర్భంలో వారికి సెలవు ఇచ్చి ఇళ్లకు పంపేస్తున్నారు. పలుమార్లు ఇళ్లకు పంపేస్తుండడంతో తమ చదువులు సక్రమంగా సాగడం లేదని వారు వాపోతున్నారు. బిల్డింగ్ బాగాలేదని ఇంజనీరింగ్ అధికారులు సూచించిన తర్వాతే విద్యార్థులను దగ్గర్లో ఉన్న పాఠశాలల్లో పడుకో పెడుతున్నామని బిసి సంక్షేమాధికారి ఇ.అనురాధ తెలిపారు. కొత్త భవనం కోసం ప్రభుత్వానికి రెండేళ్ల కిందట డిటైల్ రిపోర్టు పంపామని, పెరిగిన అంచనా వ్యయంతో మరోసారి ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు.

పరాయిపంచన గిరిజన పిల్లలు

జిల్లాలో ఎయిర్‌పోర్టులు, థర్మల్ పవర్ ప్లాంట్ల కోసం రైతుల నుంచి వేలాది ఎకరాల భూమిని తీసుకుంటున్న టిడిపి కూటమి ప్రభుత్వం గిరిజన విద్యార్థుల హాస్టల్ భవనానికి మాత్రం కనీసం పది సెంట్ల జాగాను ఇవ్వడానికి దృష్టి సారించడం లేదు. దీంతో, ఏజెన్సీ, మారుమూల ప్రాంతాల నుంచి వచ్చి జిల్లా కేంద్రంలో చదువుకుంటున్న గిరిజన విద్యార్థులు పరాయి పంచన కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. జిల్లా కేంద్రంలో గిరిజనులు సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు నిర్మించిన గిరిజన భవన్‌లో ఉండాల్సి వస్తోంది. ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, నర్సింగ్ తదితర కోర్సులు చదివే విద్యార్థులు సుమారు 210 మంది ఉంటున్నారు. కల్యాణ మండపం మాదిరిగా నిర్మించిన రెండంతస్థుల భవనంలో నాలుగు మరుగుదొడ్లే ఉన్నాయి. బహిర్భూమి కోసం సమీపంలోని నాగావళి నదికి వెళ్తున్నారు. వసతిగృహానికి సమీపంలోగల గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని ఆర్ఒ ప్లాంట్ నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నారు. హాలులోనే భోజనం, అక్కడే పడుకోవాల్సి వస్తోంది. చలికాలంలో, తుపానుల సమయంలో గాలులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరికి సొంత భవనం నిర్మాణానికి స్థలం కావాలని కోరుతూ గతంలో ఐటిడిఎ పిఒగా పనిచేసిన యశ్వంత్ కుమార్ రెడ్డి, ప్రస్తుత కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కూడా ప్రభుత్వానికి లేఖ రాసినా ఫలితం లేకపోయింది.

ఎల్‌ఐసి ఎంఎఫ్ నుంచి కన్సంప్షన్ ఫండ్

ముంబయి : ప్రముఖ ఫండ్ హౌస్‌లలో ఒక్కటైన ఎల్‌ఐసి మ్యూచువల్ ఫండ్ కొత్తగా ఎల్‌ఐసి ఎంఎఫ్ కన్సంప్షన్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ స్కీమ్ నూతన ఎన్ఎఫ్ఒ అక్టోబర్ 31న తెరుచుకుంటుందని.. నవంబర్ 14తో ముగుస్తుందని ఆ సంస్థ తెలిపింది. నిరంతరం అమ్మకం, కొనుగోలు కోసం తిరిగి నవంబర్ 25న తెరుచుకుంటుంది. 2025న తిరిగి తెరవబడుతుంది. ఈ స్కీమ్‌కు ఫండ్ మేనేజర్లుగా సుమిత్ భట్నాగర్, కరణ్ దోషి వ్యవహరిస్తారు. ఈ ఎన్ఎఫ్ఒ కనీస దరఖాస్తు మొత్తాన్ని రూ.5,000గా నిర్ణయించింది. ఎస్ఐపి ద్వారా నెలకు కనీసం రూ.200 పెట్టుబడిగా పెట్టుకోవడానికి వీలుంది.

బస్సు ప్రమాద మృతుల కుటుంబాలకు సాయం

- మంత్రికి చెక్కులు అందజేసిన ట్రావెల్స్ ప్రతినిధులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లా చిన్నటేకూరు సమీపంలో జరిగిన బస్సు ప్రమాద దుర్ఘటన బాధితులకు కావేరి ట్రావెల్స్ యాజమాన్యం రూ.40 లక్షలు ఆర్థిక సాయం అందజేసింది. కలెక్టర్ ఛాంబర్‌లో మంత్రి టి.జి భరత్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి, ఎస్‌పి విక్రాంత్ పాటిల్, జెసి నూరుల్ కమర్, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత రెడ్డి సమక్షంలో ట్రావెల్స్ ప్రతినిధులు మంత్రికి చెక్కులు అందజేశారు. మరణించిన వారి కుటుంబ సభ్యులకు రూ.రెండు లక్షల చొప్పున మొత్తం రూ.38 లక్షలు, తీవ్రంగా గాయపడిన నలుగురికి రూ.50 వేల చొప్పున రూ.రెండు లక్షలతో కలిపి మొత్తం రూ.40 లక్షల చెక్కును అందజేశారు.

ధరల సెగతో తగ్గిన పసిడి డిమాండ్

- ఆభరణాల అమ్మకాల్లో 31 శాతం పతనం

న్యూఢిల్లీ : అధిక బంగారం ధరలు ఆ లోహం డిమాండ్‌ను భారీగా దెబ్బతీశాయి. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో బంగారం డిమాండ్‌లో 16 శాతం క్షీణతతో 209.4 టన్నులకు పడిపోయిందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ (డబ్ల్యుజిసి) గురువారం ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. ఆభరణాల డిమాండ్ పరిమాణంలో 31 శాతం క్షీణత చోటు చేసుకుంది. మరోవైపు నాణేలు, బార్ల కోసం పెట్టుబడి డిమాండ్ 20 శాతం పెరిగింది. అభరణాల డిమాండ్ 31 శాతం పతనమై 117.7 టన్నులుగా నమోదయ్యింది. అధిక ధరల నేపథ్యంలో ప్రజలు తక్కువ బరువు, తక్కువ స్వచ్ఛత కలిగిన అభరణాలను కొనుగోలు చేశారు. ఏడాదికేడాదితో పోల్చితే సెప్టెంబర్ త్రైమాసికంలో బంగారం దిగుమతులు 37 శాతం పతనమై 194.6 టన్నులుగా నమోదయ్యింది. రీసైక్లింగ్ 7 శాతం తగ్గి 21.8 టన్నులుగా చోటు చేసుకుంది. వినియోగదారులు తమ పసిడిని నిలకడగా పెట్టుకోవడమే రీసైక్లింగ్ తగ్గడానికి కారణమని డబ్ల్యుజిసి పేర్కొంది. "పెట్టుబడుల డిమాండ్ 74 శాతం పెరిగి 91.6 టన్నులుగా నమోదయ్యింది. ఈ విలువ రూ.88.970 కోట్లుగా ఉంటుంది. పసిడిపై దీర్ఘకాలంలో ఉన్న మక్కువ, విలువను దృష్టిలో పెట్టుకుని కొనుగోళ్లు జరిపారు." అని డబ్ల్యుజిసి ఇండియా రీజినల్ సిఇఒ సచిన్ జైన్ పేర్కొన్నారు.



'స్వల్పకాలంలో బంగారం ధరలు రూ.1,18,000 నుండి రూ.1,24,500 మధ్య అస్థిరంగా ఉండొచ్చని ఎల్‌కెపి సెక్యూరిటీస్ నిపుణుడు జతీన్ త్రివేది తెలిపారు. ధనతేరస్, దీపావళి సమయంలో వినియోగదారుల రాక సుమారు 15 శాతం పెరగడంతో డిసెంబర్ త్రైమాసికంలో ఆభరణాల డిమాండ్ కోలుకుంటుందని బులియన్ వర్గాల అంచనా. గురువారం 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారం ధర రూ.1,19,620గా నమోదయ్యిందని ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ (ఐబిజెఎ) తెలిపింది. ఇంతక్రితం రోజు రూ.1,19,350గా పలికిందని పేర్కొంది. ఇటీవల బంగారం ధరలు ఓ దశలో ఆల్‌టైం రికార్డ్ గరిష్టాలను తాకిన విషయం తెలిసిందే. 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారం ధర రూ.1.32 లక్షలకు చేరి వినియోగదారులను హడల్ ఎత్తించిన విషయం తెలిసిందే.

బిసి వసతి గృహాల నిర్మాణానికి రూ.60 కోట్లు

- మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అసంపూర్తిగా నిలిచిపోయిన బిసి వసతి గృహాల నిర్మాణాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం రూ.60 కోట్లు మంజూరు చేసినట్లు బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. గత ప్రభుత్వం బిసి వసతి గృహాలను గాలికి వదిలేసిందన్నారు. విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ ఛార్జీలు చెల్లించకపోగా, కనీసం వసతి గృహాలకు మరమ్మతులు కూడా నిర్వహించలేదని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వసతి గృహ విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం అందిస్తుందన్నారు. డైట్, కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తున్నట్లు చెప్పారు.

రాష్ట్ర కార్యక్రమంగా భక్త కనకదాస జయంతి

భక్త కనకదాస జయంతిని రాష్ట్ర కార్యక్రమంగా నిర్వహిస్తామని, ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు రెండు రోజుల్లో జారీ అవుతాయని మంత్రి సవిత తెలిపారు. వచ్చే నెల 8న ఈ కార్యక్రమాన్ని రాష్ట్రస్థాయిలో అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో నిర్వహించనున్నామని, మంత్రి నారా లోకేష్ హాజరవుతారని చెప్పారు. సామాజిక వేత్తగా, స్వరకర్తగా భక్త కనకదాస తన కీర్తనలు, రచనలతో సమాజంలోని అసమానతలపైన, కుల వ్యవస్థపైనా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని పేర్కొన్నారు.

ఆర్యవైశ్యులకు ప్రాధాన్యత

అన్ని రంగాల్లో ఆర్యవైశ్యులకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇస్తుందని సవిత తెలిపారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘాల నాయకులు మంత్రిని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలకు సంబంధించిన వినతి పత్రాన్ని మంత్రికి అందజేశారు. రాష్ట్రంలో వైశ్యులను ఆర్య, శెట్టి, గుప్త, కోమటి, వేగిన, బుక్క, జనపశెట్టి అనే పేర్లతో సంబోధిస్తున్నారని, వీరందరినీ ఆర్యవైశ్యులుగా ప్రభుత్వం గుర్తిస్తూ చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎంఇఐఎల్ చేతికి 250 మెగావాట్స్ పవర్ ప్లాంట్

- తమిళనాడులో సొంతం చేసుకున్న సంస్థ

హైదరాబాద్ : తమిళనాడులో నేవేలి వద్ద ఉన్న 250 మెగావాట్ల లిగ్నైట్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) కొనుగోలు చేసింది. అబుదాబి కేంద్రంగా ఉన్న సంస్థ నుంచి 100 శాతం వాటాను కొనుగోలు చేసినట్లు ఎంఇఐఎల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. తమ అనుబంధ సంస్థ ఎంఇఐఎల్ ఎనర్జీ దీనిని స్వాధీనం చేసుకుందని పేర్కొంది. ఈ స్వాధీన ప్రక్రియ ఎంఇఐఎల్ గ్రూప్ వ్యూహాత్మక పరిణామంగా చెప్పవచ్చు. ఒక పెద్ద ఇపిసి కాంట్రాక్టర్ నుంచి అంతర్గతంగా మౌలిక సదుపాయాల అభివృద్ధి, యాజమాన్యం, నిర్వహణలో నిమగ్నమైన సమగ్ర ఇన్‌ఫ్రా డెవలపర్‌గా మారే దిశలో కీలకమైన అడుగుగా ఈ కొనుగోలు నిలుస్తోందని ఎంఇఐఎల్ పేర్కొంది. ప్రస్తుతం ఇంధన రంగంలో 5.2 గిగావాట్లకు పైగా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని ఎంఇఐఎల్ కలిగి ఉంది. "ఉన్నత నాణ్యత గల విద్యుత్ ఉత్పత్తి ఆస్తులను స్వాధీనం చేసుకోవడంలో ఇది ఒక మైలురాయిగా నిలుస్తోంది. థర్మల్, హైడ్రో, పునరుత్పాదక శక్తి రంగాలను సమన్వయం చేసే సమతులిత, స్థిరమైన విద్యుత్ ఉత్పత్తి పోర్ట్‌ఫోలియో నిర్మాణానికి మేము కట్టుబడి ఉన్నాము" అని ఎంఇఐఎల్ గ్రూప్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ సలిల్ కుమార్ మిశ్రా పేర్కొన్నారు.

యూ ట్యూబ్ ఉద్యోగులపై ఎఐ పిడుగు

వాషింగ్టన్ : కృత్రిమ మేధా (ఎఐ)తో యూట్యూబ్‌లో భారీగా ఉద్యోగాలు పోతున్నాయి. సిబ్బంది స్వచ్ఛంద తొలగింపునకు వీలుగా గూగుల్‌కు చెందిన ఈ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ వాలంటరీ ఎగ్జిట్ ప్లాన్‌ను ప్రకటించింది. ఎఐ టెక్నాలజీ వేగంగా పెరుగుతున్న సమయంలో.. యూట్యూబ్‌లో తప్పకుండా కొన్ని మార్పులు చేయాల్సి ఉందని ఆ సంస్థ సిఇఒ నీల్ మోహన్ తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని కంపెనీ ఈ నిర్ణయం తీసుకుందన్నారు. పదేళ్ళలో తొలిసారి తమ ప్రొడక్ట్ డివిజన్‌లో మార్పులు చేస్తున్నామన్నారు. అమెరికాలో పనిచేస్తున్న యూట్యూబ్ ఉద్యోగులు స్వచ్ఛందంగా తమ ఉద్యోగాన్ని వదులుకుంటే పరిహారం కింద వారికి నిష్క్రమణ ప్యాకేజీలను అందించనున్నట్లు తెలిపారు. కంటెంట్ క్రియేషన్, యూజర్ ఎక్స్పీరియన్స్ వంటి వాటిని ఎఐ ప్రభావితం చేయనుంది. కొత్త మార్పులు 2025 నవంబర్ 05 నుంచి అందుబాటులో రానున్నాయి. యూట్యూబ్ మాతృసంస్థ గూగుల్ తన ఉత్పత్తులు, సేవలలో ఎఐ ద్వారా భారీ పునర్నిర్మాణ ప్రకియలు చేపడుతోన్న విషయం తెలిసిందే.



పుమాలో 900 మందికి ఎసరు

జర్మనీకి చెందిన ప్రముఖ స్పోర్ట్స్ వియర్ బ్రాండ్ పూమా వచ్చే ఏడాది చివరి నాటికి 900 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు ప్రకటించింది. మార్చిలో ప్రకటించిన ఖర్చులను తగ్గించే కార్యక్రమంలో భాగంగా కంపెనీ ఈ ఏడాదిలో ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా 500 మంది ఉద్యోగులను తొలగించింది. కొత్త చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆర్థర్ హోయెల్డ్ ఆధ్వర్యంలో ఉద్వాసనలు కొనసాగుతున్నాయి. కంపెనీ ఉత్పత్తులకు అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గిపోవడం, సుంకాల ప్రభావంతో కంపెనీ లాభాలు పడిపోవడంతో ఆ సంస్థ పొదుపు చర్యలకు పాల్పడుతోంది.

మెడికల్ కళాశాలల పిపిపి విధానంపై హైకోర్టు వ్యాఖ్య దురదృష్టకరం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మెడికల్ కళాశాలల పిపిపి విధానంపై దాఖలైన పిల్ విచారణ సమయంలో హైకోర్టు చేసిన వ్యాఖ్య దురదృష్టకరమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. పిపిపి విధానంలోకి పది ప్రభుత్వ మెడికల్ కళాశాలలు తీసుకువచ్చే టెండర్ ప్రక్రియను ఆపాలని హైకోర్టులో పిల్ విచారణకు వచ్చిన సందర్భంగా ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల్లో జోక్యం చేసుకోలేమని హైకోర్టు వ్యాఖ్యానించడం దురదృష్టకరమని తెలిపారు. ఇప్పటి వరకూ న్యాయస్థానాలు అనుసరిస్తున్న సహజ న్యాయసూత్రాలకు హైకోర్టు వ్యాఖ్య విరుద్ధంగా ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాలు ప్రజా సంక్షేమానికి సమాజ శ్రేయస్సుకి విరుద్ధంగా ఉంటే జోక్యం చేసుకోకుండా కోర్టులు దూరంగా ఎలా ఉండగలవని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పిపిపి విధానంలోకి మార్చి ప్రైవేటుపరం చేయడం రాజ్యాంగానికి లోబడి ఉన్నదా లేదా అన్నది పరిశీలించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడం ప్రాథమిక హక్కులకు భంగకరమని, ప్రభుత్వ నిర్ణయం సామాజిక న్యాయానికి తూట్లు పొడుస్తుందని వివరించారు. ఈ విషయంలో ఉన్నత న్యాయస్థానం జోక్యం చేసుకుని ప్రజాప్రయోజనాలను కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తక్షణం టెండర్ ప్రక్రియను ఆపాలని, ప్రభుత్వ ఆధ్వర్యంలోనే వైద్యకళాశాలల నిర్మాణాన్ని కొనసాగించాలని శ్రీనివాసరావు డిమాండు చేశారు.

రాజ్యాంగం వల్లే దళితుల జీవితాల్లో వెలుగు

- టిడిపి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజ్యాంగం వల్లే దళితుల జీవితాలు మెరుగుపడ్డాయని, మత గ్రంథాల వల్ల కాదని టిడిపి ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యులు ఎంఎస్ రాజు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాను భగవద్గీతను అవమానపరిచినట్లు వైసిపి అనుకూల సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారంటూ ఆయన ఖండించారు. బిఆర్ అంబేద్కర్, భారత రాజ్యాంగం గొప్పతనాన్ని వివరించానని, రాజ్యాంగం వల్లే దళితుల జీవితాల్లో వెలుగులు వచ్చాయని పేర్కొన్నారు. భగవద్గీత, ఖురాన్ వంటి మత గ్రంథాల వల్ల దళితుల జీవిత ప్రమాణాలు మెరుగుపడలేదని, రాజ్యాంగం వల్లే మెరుగుపడ్డాయని తెలియజేశానని వివరించారు. తాను హిందువునని, దళితుడనని, హిందూ సమాజాన్ని కించపరిచే వ్యాఖ్యలు చేయలేదని పేర్కొన్నారు.

కులాల మధ్య చిచ్చే వైసిపికి పెట్టుబడి : నాదెండ్ల బ్రహ్మం

కులాల మధ్య చిచ్చుపెట్టడమే వైసిపి రాజకీయ పెట్టుబడి అని టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి విమర్శించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కందుకూరులో రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణను రెండు కులాల పేర్లతో ముడిపెట్టి రాష్ట్రంలో కుల విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేసిందన్నారు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం వెంగలయపాలెం గ్రామానికి చెందిన శేషమ్మ ఆత్మహత్యకు కులం రంగు పులిమి తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు.

సంపాదకీయం

కిరాతకం!


ఇజ్రాయిల్ క్రూరత్వం ప్రపంచాన్ని విస్మయపరుస్తోంది. ఘోరం, దారుణం, దుర్మార్గం, అమానుషం వంటి మాటలన్నీ దాని పైశాచిక చేష్టల ముందు చిన్నబోతున్నాయి. రెండేళ్ల నుంచి ప్రతిరోజూ పాలస్తీనాపై పడి, నరమేధం సృష్టిస్తూనే ఉంది. ఇరవై రోజుల క్రితం ట్రంప్ ప్రకటించిన శాంతి ఒప్పందం తూట్లు పడి, రక్తమోడుతున్న తెల్ల పావురం మాదిరిలా విలవిల్లాడుతోంది. మంగళవారం అర్ధరాత్రి పిచ్చెక్కిన మృగంలా ఇజ్రాయిల్ సైన్యం గాజాపై విరుచుకుపడింది. డ్రోన్లు, యుద్ధ విమానాలతో బాంబులు కురిపించి, 104 మందికి పైగా సామాన్య ప్రజల ప్రాణాలను హరించింది. 21వ శతాబ్దం ముందు ఒక పరమ హేయమైన, క్రౌర్యమైన అమానుష ఘట్టాన్ని రచించిన వికృత చరిత్రకు కర్తగా ఇజ్రాయిల్ మిగిలిపోతుంది.

ఇజ్రాయిల్ పగకి, పంతానికీ ఒక హద్దంటూ లేకుండా పోవటం విచారకరం. దురాక్రమణే ధ్యేయంగా, జాతి హననమే లక్ష్యంగా దాని దుశ్చర్యలు అడ్డూ అదుపూ లేకుండా సాగుతున్నాయి. యుద్ధమంటే రెండు దేశాల సైనిక బలగాల మధ్యనో, సైనిక కేంద్రాల మధ్యనో, ఆర్థిక మూలాలను దెబ్బ తీయటం మీదనో కేంద్రీకృతమై సాగటాన్ని మనం చూస్తాం. ఇజ్రాయిల్ యుద్ధనీతి మొదటినుంచీ వీటికి భిన్నంగానే ఉంది. పిల్లలు, మహిళలు, ఆసుపత్రులు, పాఠశాలలు, సహాయ శిబిరాలు, నివాస ప్రాంతాలు, సహాయక కార్యకర్తలు, జర్నలిస్టులు, రాత్రులు, పగళ్లూ ... ఇలా ఏ మినహాయింపూ, తటాపటాయింపూ లేకుండా విచక్షణారహితంగా మారణహోమం సాగించింది. యుద్ధోన్మాదంతో రగిలిపోతూ ఇష్టానుసారం బీభత్సకాండ సృష్టించింది. పాలస్తీనాను సర్వనాశనం చేసి, పౌరులు మొత్తాన్ని తుదముట్టించటమే లక్ష్యం అన్నట్టుగా దాని తీరు ఉంది. దాదాపు వందేళ్ల క్రితం నియంత హిట్లర్ జాత్యాహంకారంతో సృష్టించిన ఫాసిస్టు బీభత్సకాండను ఇది గుర్తు చేస్తోంది. నాడు అమానవీయమైన కర్కశత్వానికి గురైన జాతి నివసించే నేల నుంచే ఇప్పుడు ఇలాంటి అమానుష కాండ కొనసాగటం ఒక చారిత్రిక వైచిత్రి!

తొమ్మిది దశాబ్దాలుగా ఇజ్రాయిల్ ... పాలస్తీనాను ఆక్రమిస్తూ విస్తరించటమనేది ఒక చారిత్రిక వాస్తవం. రెండేళ్ల నుంచి అది తీవ్రస్థాయికి చేరింది. వెస్ట్‌బ్యాంక్‌ను పూర్తిగా ఆక్రమించటంతో పాటు గాజాపైనా పట్టు సాధించటానికి దౌర్జన్యకరమైన సైనిక చర్యలు సాగిస్తోంది. కోటిమందికి పైగా ఉన్న పాలస్తీనా ప్రజలు ఇప్పటికే తమ ఊళ్లను, ఇళ్లను వదిలి ఇతర ప్రాంతాలకు, దేశాలకు చెల్లాచెదురైపోయారు. పాలస్తీనాలో ఇప్పుడు 50 లక్షల మంది నివసిస్తుంటే– మిగతా వారు ఇతర దేశాలకు శరణార్థులుగా తరలిపోయారని ఒక అంచనా. గాజా ప్రాంతం స్థానికులతోనూ, ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని తరలొచ్చిన పాలస్తీనా ప్రజలతోనూ కిటకిటలాడుతోంది. అలాంటి ప్రదేశాల్లో వైమానిక దాడులు చేయటం ద్వారా ఇజ్రాయిల్ భయభ్రాంతులు సృష్టిస్తోంది. ఇప్పటికే 68,643 మంది పౌరులను చంపి, లక్షా 70 వేల మందిని గాయపర్చి రక్తదాహం తీర్చుకొంది. లక్షలాది నివాసాలను, కట్టడాలను కుప్ప కూల్చింది. ఆకలితో అల్లాడుతున్న ప్రజలకు ఇతర దేశాల నుంచి మానవతా సాయం అందకుండా అడ్డుపడుతోంది. ఈ విధ్వంసాన్ని, విద్వేషాన్ని ప్రపంచం మొత్తం నిరసిస్తున్నా, అంతర్జాతీయ వేదికలు ఖండిస్తున్నా అది వెనకడుగు వేయకపోవటం దారుణం.

పరమ హేయమైన ఇజ్రాయిల్ రాక్షసత్వానికి అమెరికా కూడా బాధ్యత వహించాలి. అక్టోబరు తొమ్మిదో తేదీన తాను ప్రకటించిన కాల్పుల విరమణ – ఆ మరుసటి రోజు నుంచే ఉల్లంఘనకు గురవుతున్నా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నోరు మెదపటం లేదు. లక్షలాదిమంది ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటం అమెరికాకు ఒక క్రీడగా మారిపోయింది. అప్పుడప్పుడు నెతన్యాహుని నిలువరిస్తున్నట్టు పైకి ప్రకటనలు చేస్తూనే – దాడులను కొనసాగించే దుర్నీతికి అండగా నిలబడుతూ వస్తోంది. కాల్పుల విరమణకు ఇజ్రాయిల్ కట్టుబడి ఉండేలా అమెరికా ప్రపంచానికి ఒక స్పష్టమైన హామీనివ్వాలి. అంతర్జాతీయ సంస్థలతో కలిసి, అందుకనుగుణమైన కార్యాచరణను తక్షణం చేపట్టాలి. ఇజ్రాయిల్ అమానుష, ఉన్మాద దాడులను దౌత్యపరమైన చర్చలూ, చర్యల ద్వారా మాత్రమే నిలువరించటం సాధ్యం. పాలస్తీనాను ఒక దేశంగా గుర్తించి, దాని హక్కులను, సరిహద్దులను కాపాడాలి. ఆ పనిని చిత్తశుద్ధితో చేపట్టి, కిరాతక దాడులకు ముగింపు పలకటం అత్యంత కీలకం, అవశ్యం.

మహనీయుల మాట



సామాజిక ఉత్పత్తికి తోడ్పడే శ్రమకు ఉపకరించే విధంగా విద్య ఉండాలి.
- వి.ఐ.లెనిన్


దుర్భర దారిద్ర్యాన్ని నిర్మూలించిన తొలి రాష్ట్రం కేరళ

విశ్లేషణ

ఏ దేశ గొప్పతనమైనా...ఆ దేశం దగ్గర ఎన్ని అణ్వాయుధాలు ఉన్నాయి? ఎంత సైనిక పాటవం కలిగి ఉంది? అనే అంశాల మీద కన్నా... ఆ దేశ ప్రజానీకం ఎంత మెరుగైన జీవన ప్రమాణాలతో జీవిస్తున్నారనే అంశం మీద ఆధారపడి ఉంటుందనేది నిర్వివాదాంశం. సరిహద్దు దేశాలతో జరిపే యుద్ధాల్లో ఎదురయ్యే జయాపజయాల కన్నా...అవిద్య, దారిద్ర్యం, వైద్య సౌకర్యాల లేమి, నివాస వసతుల కొరత వంటి సామాజిక సమస్యలపై యుద్ధం చేసి విజయం సాధించడమే గొప్ప.

ప్రపంచ వ్యాప్తంగానూ, మన దేశంలోనూ ఆర్థిక, ఆదాయ, సంపద, సామాజిక అసమానతలు తీవ్రంగా పెరిగిపోతున్న నేపథ్యంలో దుర్భర పేదరికాన్ని అనుభవిస్తున్న ప్రజానీకాన్ని పైకి తీసుకురావడానికి కేరళలో సిపియం నాయకత్వంలోని వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఆదర్శంగా నిలుస్తాయి.

దుర్భర పేదరికాన్ని రూపుమాపడంలో కేరళ దేశంలోనే తొలి రాష్ట్రంగా నిలవనున్నది. కేరళలోని వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వం ఎల్.డి.ఎఫ్ అనుసరిస్తున్న ప్రత్యామ్నాయ ప్రజానుకూల విధానాల ఫలితమిది. సోషలిస్టు ఆదర్శాల ప్రేరణతో ప్రతి మనిషికీ గౌరవప్రదంగా జీవించే హక్కు, క్షేత్రస్థాయి ప్రజాస్వామ్యం, సమ్మిళిత అభివృద్ధి సాధించడాన్ని ఎల్.డి.ఎఫ్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. దారిద్ర్యం అనేది రాజకీయ ఎంపికే తప్ప అనివార్య వాస్తవికత కాదని...ప్రణాళికా బద్ధంగా, కమ్యూనిటీ ఆధారిత వ్యూహంతో లక్షలాది మంది పేదరికాన్ని రూపుమాపడం ద్వారా ఎల్.డి.ఎఫ్ ప్రభుత్వం రుజువు చేసింది.



అతుల్ చంద్ర

కేరళ ప్రభుత్వం దుర్భర దారిద్ర్య నిర్మూలనా పథకం (ఇ.పి.ఇ.పి) అమలు చేస్తున్నట్లు 2021 మే నెలలో ప్రకటించింది. స్థానిక సంస్థల స్క్రూటినీ, సబ్–కమిటీ పరిశీలన, ముఖాముఖి ఇంటర్వ్యూలు, గ్రామ సభల నిర్ధారణ – ఇలా నాలుగంచెల ప్రక్రియ ద్వారా 1,18,309 కుటుంబాలు దుర్భర పేదరికంలో ఉన్నాయని కేరళ రాష్ట్ర ప్రణాళికా బోర్డు గుర్తించింది. ఈ జాబితాను నిర్ధారించడానికి 20 శాతం ఆడిట్ కూడా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుకుంటున్న వారిని సర్వే నుండి మినహాయించారు. తిండి, ఆదాయం, గృహ వసతి, వైద్య సౌకర్యాలు...ఈ నాలుగూ అందుబాటులో లేని కుటుంబాలను గుర్తించారు. దుర్భర పేదరికంలో ఉన్న వారిలో 81 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. మలప్పురం జిల్లాలో అత్యధికంగాను, కొట్టాయం జిల్లాలో అత్యల్పంగానూ ఉన్న ఈ కుటుంబాలలో 40,000 కుటుంబాలు ఆరోగ్య సమస్యలతో, 34,523 కుటుంబాలు ఆహార లేమితో, 15,091 కుటుంబాలు నిలువ నీడ లేని సమస్యలను ఎదుర్కొంటున్నాయని గుర్తించి ఆ యా కుటుంబాల అవసరాలకు తగినట్లు సౌకర్యాలు కల్పించారు. ఈ కుటుంబాల వారికి నైపుణ్య శిక్షణ కల్పించి సహకార సంస్థల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడానికి తగిన ఆర్థిక చేయూతను అందచేశారు. ఆ రకంగా కేరళ వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వం దుర్భర పేదరికం అనుభవిస్తున్న కుటుంబాలను పైకి తీసుకురావానికి ప్రత్యేక శ్రద్ధ పెట్టింది.

> భూ సంస్కరణలను చిత్తశుద్ధితో అమలు చెయ్యడం ద్వారా రాష్ట్రంలో ఫ్యూడల్ సంబంధాలను బద్దలు కొట్టి కౌలు రైతులకు భూ యాజమాన్య హక్కులు కల్పించింది. భూ పరిమితి చట్టాన్ని పక్కాగా అమలు చేసింది. మిగులు భూములను భూమి లేని నిరుపేద వ్యవసాయ కార్మికులకు పంపిణీ చేసింది. పర్యవసానంగా గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయంగా కొనసాగుతూ వచ్చిన అగ్రకుల భూస్వాముల అధిపత్యానికి గండి పడింది. సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయి. రైతుల, వ్యవసాయ కూలీల బేరసారాల శక్తి మెరుగుపడింది.



కేరళలో వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వం తొలిసారిగా ఏర్పడిన నాడు చేపట్టిన సంస్థాగత సంస్కరణల మూలంగా 1970వ దశకంలో 59.79 శాతంగా ఉన్న దారిద్ర్యం 2011 నాటికి 11.03 శాతానికి తగ్గింది. భూ సంబంధాలలో చేపట్టిన మార్పులు, అవినీతి రహిత సుపరిపాలన, సంక్షేమ పథకాల సక్రమ అమలు, జెండర్ భాగస్వామ్యానికి ప్రాధాన్యతలు కల్పించడం ద్వారా మాత్రమే ఇది సాధ్యపడింది.

భూ సంస్కరణలను చిత్తశుద్ధితో అమలు చెయ్యడం ద్వారా రాష్ట్రంలో ఫ్యూడల్ సంబంధాలను బద్దలు కొట్టి కౌలు రైతులకు భూ యాజమాన్య హక్కులు కల్పించింది. భూ పరిమితి చట్టాన్ని పక్కాగా అమలు చేసింది. మిగులు భూములను భూమి లేని నిరుపేద వ్యవసాయ కార్మికులకు పంపిణీ చేసింది. పర్యవసానంగా గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయంగా కొనసాగుతూ వచ్చిన అగ్రకుల భూస్వాముల అధిపత్యానికి గండి పడింది. సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయి. రైతుల, వ్యవసాయ కూలీల బేరసారాల శక్తి మెరుగు పడింది.

కేరళలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అధికార వికేంద్రీకరణ ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించి స్థానిక సంస్థల సామర్థ్యాన్ని బలోపేతం చేసింది. స్థానిక సంస్థలకు నిధులు, పరిపాలనా అధికారాలను కల్పించింది. ఏ పంచాయతీకి ఆ పంచాయతీ ఆ గ్రామ వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించి, అమలు చేసుకునే హక్కులు కల్పించింది. దీనిమూలంగా ప్రజల్లో పౌర చైతన్యం, పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెరిగింది.

వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వం వచ్చిన ప్రతిసారీ ప్రజారోగ్యం, విద్యాబోధనల మీద ప్రత్యేక శ్రద్ధ వహించింది. 2017లో 'ఆర్ద్రం మిషన్' పేరిట రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలన్నింటిలో మానసిక సమస్యలు, ప్రమాదంలో ఏర్పడిన గాయాలకు తక్షణ వైద్యం అందేలా మెరుగుపరిచింది. సార్వజనీన విద్య, వృత్తి శిక్షణా కోర్సులు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం నిధులు వెచ్చించి 96.2 శాతం అక్షరాస్యత సాధించి నైపుణ్యమైన, మెరుగైన ఆరోగ్యవంతమైన కార్మిక శక్తి పెంపొందేలా చూసింది.

కేరళ అభివృద్ధి నమూనాలో మహిళా సాధికారతా కల్పన కీలక పాత్ర పోషించింది. 1998లో ప్రారంభించిన 'కుడుంబశ్రీ' పథకంలో 45 లక్షల మంది మహిళలను భాగస్వాములుగా చేసింది. మైక్రో ఫైనాన్స్, సమిష్టి వ్యవసాయం, ఔత్సాహిక పరిశ్రమలకు ప్రోత్సాహకాలు కల్పించడం, లక్షలాది మంది మహిళలకు జీవనభృతి కల్పించడం ద్వారా పితృస్వామిక సామాజిక కట్టుబాట్లను సవాలు చేసే ఆత్మస్థైర్యాన్ని వారిలో నింపింది.

'అగతి రహిత కేరళమ్' పేరిట సమగ్ర సామాజిక సంక్షేమ పథకాలను అమలు చేస్తుంది. వృద్ధాప్య పింఛన్లు, వికలాంగ భృతి, అణగారిన కులాల కుటుంబాలకు చెందిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల చెల్లింపులు అమలు చేస్తుంది. కేరళను ఆదర్శ సంక్షేమ రాష్ట్రంగా తీర్చిదిద్దింది.

కేరళ వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి పౌరుడూ ఆత్మగౌరవంతో హుందాగా జీవితం గడిపేందుకు తగినన్ని చర్యలు చేపట్టినప్పటికీ ధరల పెరుగుదల, వయసు మళ్లిన జనాభా పెరుగుదల వంటి సమస్యలను ఎదుర్కొంటున్నది.

అభివృద్ధికి పున:నిర్వచనం

నిధుల కేటాయింపులో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పక్షపాత వైఖరిని కనబరుస్తూ, గవర్నర్ గిరీని అడ్డుపెట్టుకుని వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వ పరిపాలనా వ్యవహారాల్లో అనవసరమైన జోక్యానికి పూనుకుంటూ కేరళ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టి ప్రజల్లో అసంతృప్తిని కూడగట్టేందుకు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నది. అయినప్పటికీ వీటిని అధిగమిస్తూ ప్రజానుకూల విధానాలను అమలు చేయడానికి ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నది.

అసమాన సామాజిక ఆర్థిక వ్యవస్థలో సాంకేతిక అభివృద్ధి ఫలాలు అసమానంగానే పంపిణీ అవుతాయి. కానీ కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం సాంకేతికాభివృద్ధిని...సమాజంలో సమానత్వం, సుస్థిరాభివృద్ధి, మానవాళి మేలు కోసం వినియోగించుకోవడానికి గాను...పాలనా వ్యవహారాలలో మిళితం చేసుకొనేందుకు ఆదర్శప్రాయమైన కృషి చేస్తోంది. ఫ్రీ–సాఫ్ట్‌వేర్ ఉద్యమ స్ఫూర్తితో పాఠశాలలు మొదలు మొత్తంగా విద్యా రంగంలో వందల కోట్ల రూపాయలు లైసెన్స్ ఫీజులుగా చెల్లించనవసరం లేని 'లైనెక్స్' ఆపరేటింగ్ సిస్టమ్‌లను నెలకొల్పింది. 'కేరళ ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్'ను నెలకొల్పి అల్పాదాయ కుటుంబాలకు హైస్పీడ్ ఇంటర్నెట్‌ను ఉచితంగా అందిస్తున్నది.

ఆటోమేషన్, కృత్రిమ మేధ(ఎ.ఐ) లను డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను పెంపొందించడానికి, పునర్వినియోగ ఇంధన తయారీ రంగాలలోను ఉపయోగ పెట్టుకుంటున్నది. నూతన సాంకేతిక ఆవిష్కరణలు లేబర్ మార్కెట్లపై చూపే ప్రచారాన్ని అంచనా వేసి కార్మికులకు తర్ఫీదునిస్తున్నది.

> సుస్థిర అభివృద్ధి సాధనలో పంచాయతీలు, స్థానిక సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయి కాబట్టి ఈ స్థానిక ప్రభుత్వాలు ప్రజాస్వామ్యయుతంగా పనిచేసేందుకు తగిన నిధులు, అధికారాలు కల్పించింది. అభివృద్ధి అంటే పెట్టుబడులు తీసుకురావడం, ఆ పెట్టుబడులు తీసుకువచ్చిన సంస్థలకు వేల కోట్ల రూపాయల రాయితీలు ఇచ్చి లాభాలు దండుకోవడం అన్న పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయంగా ఆర్థిక సామాజిక న్యాయం, పర్యావరణ పరిరక్షణ, గౌరవప్రదమైన మానవీయ జీవితాలకు పూచీపడేలా జాగ్రత్తలు తీసుకుంటున్నది. ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం ద్వారా సమ్మిళిత అభివృద్ధి సాధించడానికి కృషి చేస్తూ ఆదర్శనీయమైన ప్రత్యామ్నాయాన్ని అందిస్తున్నది.

సుస్థిర అభివృద్ధి సాధనలో పంచాయతీలు, స్థానిక సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయి కాబట్టి ఈ స్థానిక ప్రభుత్వాలు ప్రజాస్వామ్యయుతంగా పనిచేసేందుకు తగిన నిధులు, అధికారాలు కల్పించింది. ఉదాహరణకు 'హరిత కేరళమ్' పేరిట పర్యావరణ పరిరక్షణను కూడా స్థానిక సంస్థల విధులలో అంతర్భాగంగా చేసింది. చెత్త మేనేజ్‌మెంట్, ఆర్గానిక్ వ్యవసాయం, వాన నీటి నిల్వ తదితర అంశాలకు స్థానిక సంస్థలే కమ్యూనిటీ ప్రణాళికలు రూపొందించుకుని అమలు చేస్తాయి.


అభివృద్ధి అంటే పెట్టుబడులు తీసుకురావడం, ఆ పెట్టుబడులు తీసుకువచ్చిన సంస్థలకు వేల కోట్ల రూపాయల రాయితీలు ఇచ్చి లాభాలు దండుకోవడం అన్న పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయంగా ఆర్థిక సామాజిక న్యాయం, పర్యావరణ పరిరక్షణ, గౌరవప్రదమైన మానవీయ జీవితాలకు పూచీపడేలా జాగ్రత్తలు తీసుకుంటున్నది. ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం ద్వారా సమ్మిళిత అభివృద్ధి సాధించడానికి కృషి చేస్తూ ఆదర్శనీయమైన ప్రత్యామ్నాయాన్ని అందిస్తున్నది. ఈ కృషి రాబోయే కాలంలో ఇలాగే కొనసాగాలని ఆశిద్దాం.

/వ్యాసకర్త ట్రైకాంటినెంటల్–ఆసియా కార్యక్రమానికి కో–ఆర్డినేటర్ /
('పీపుల్స్ డిస్పాచ్' సౌజన్యంతో)

కౌలు రైతుల సమస్యలు పట్టని ప్రభుత్వాలు

సమీక్ష

దిలీప్ రెడ్డి



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, అవశేష ఆంధ్రప్రదేశ్‌లో కౌలురైతులను ఏ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అత్యధిక శాతం మంది కౌలురైతులు భావిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం, పీపుల్స్ పల్స్ రీసర్చ్ సంస్థ కలిసి నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేలో వెల్లడైంది. కౌలురైతుల సమస్యలను ఏ రాజకీయ పార్టీ పట్టించుకోవట్లేదని 92.1 శాతం మంది కౌలురైతులు తెలుపగా, పట్టించుకుంటున్నారని కేవలం 6.1, తెలియదని 1.9 శాతం మంది తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కౌలురైతుల సమస్యలపై సెప్టెంబర్ 20 నుండి అక్టోబర్ 20 వరకు ఒక నెల రోజులపాటు ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం క్షేత్ర స్థాయిలో 26 జిల్లాల్లో సర్వే నిర్వహించి దాదాపు 3000 శాంపిళ్లు సేకరించింది. ఒక్కొక్క జిల్లా నుండి 100 నుండి 125 శాంపిళ్లు సేకరించడం జరిగింది. క్షేత్ర స్థాయిలో నిర్వహించిన సర్వే ప్రకారం కౌలురైతుల్లో దాదాపు 70 శాతం మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందినవారే ఉన్నట్లు వెల్లడైంది. ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం సభ్యులు సేకరించిన డేటాను పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ డేటా ఎంట్రీ చేసి, అనాలసిస్ చేసి నివేదికను రూపొందించింది.

కౌలురైతులకు గుర్తింపు కార్డు ఇచ్చిందా అని ప్రశ్నించినప్పుడు 87.7 శాతం మంది ఇవ్వలేదని కేవలం 12.3 శాతం మాత్రమే ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో కౌలురైతులు కూటమి ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దానికి ప్రధాన కారణం 2024 ఎన్నికల్లో కౌలురైతులకు ఇస్తామన్న గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడమే. కౌలు రైతుల గుర్తింపునకు ప్రతిబంధకంగా తయారైన పంట సాగుదారు హక్కు చట్టం (సిసిఆర్సి) స్థానంలో కొత్తగా చట్టం తెస్తామని కూటమి హామీ ఇచ్చినా ఇది అమలుకాకపోవడం పట్ల కౌలురైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు క్షేత్రస్థాయి సర్వేలో వెల్లడైంది. కూటమి 'ప్రజాగళం' పేరిట విడుదల చేసిన ఎన్నికల మ్యానిఫెస్టోలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేసి అన్ని సంక్షేమ పథకాలతో పాటు, పంటల బీమాను వర్తింపజేస్తామని హామీ ఇచ్చి 17 నెలలు కావొస్తున్నా...ఇది కార్యరూపం దాల్చకపోవడంతో కౌలు రైతులు కూటమి ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ ఏడాది కాలంలోనే కౌలు రైతుల కోసం చట్టం తీసుకొస్తామని ప్రకటించినా ఈ చట్టాన్ని తీసుకురాకపోవడం పట్ల కౌలురైతులు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. కౌలురైతుల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుంటే బాగుంటుందని ప్రశ్నిస్తే తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు చేయాలని 27.4 శాతం, గుర్తింపు కార్డు ఇవ్వాలని 22.7 శాతం, పండించిన పంటకు గిట్టుబాటు ధర కావాలని 12.9 శాతం, పెట్టుబడికి రుణాలు మంజూరు చేయాలని 10.9 శాతం, రుణమాఫీ చేయాలని 10.5 శాతం మంది కోరారు.

సామాజికంగా మీరు ఏమైనా సమస్యలు ఎదుర్కొంటున్నారా అని ప్రశ్నించినప్పుడు, భూయజమానులకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఉచితంగా సర్వీస్ చేయవలసి వస్తుందని, బడుగు బలహీన వర్గాల వారి నుండి ఎక్కువ వడ్డీ వసూలు చేస్తూ తమ సామాజిక వర్గానికి మాత్రం తక్కువ వడ్డీకే అప్పులు ఇస్తున్నట్లు కౌలురైతులు తెలిపారు. కౌలు రేట్ల విషయంలో కూడా ఇటువంటి వ్యత్యాసాలు ఉన్నట్లు సర్వేలో వెల్లడైంది. ఒక్కరికే ప్రతి సంవత్సరం కౌలుకు ఇస్తే భూమి మీద కౌలురైతులకు హక్కులు వస్తాయనే ఆందోళనలో భూయజమానులకు ఉన్నట్లు ఈ సర్వేలో తేలింది. కౌలుకు ఇచ్చిన భూములపై భూయజమాని ముందుగానే పంటరుణాలు తీసుకుంటున్నారని, భూయజమానులు బ్యాంకుకు బకాయి ఉంటే వారి భూములు సాగు చేస్తున్న కౌలురైతులకు పంట రుణాలు ఇవ్వడం లేదని సర్వేలో తేలింది. క్షేత్ర స్థాయిలో సర్వే సందర్భంగా కౌలురైతులతో మాట్లాడినప్పుడు నూతనంగా తీసుకొస్తామని చెప్పిన కౌలు చట్టంపై కూటమి ప్రభుత్వం యూటర్న్ తీసుకుందనే భావనలో అత్యధిక శాతం మంది కౌలురైతులు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కౌలు చట్టాన్ని తీసుకురావాలనే చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీ సమావేశాలు లేకపోయినా ఆర్డినెన్స్ ద్వారా ఈ చట్టాన్ని తీసుకొని రావచ్చని పలుచోట్ల కౌలురైతులు తెలిపారు. కౌలుదారులకు కొత్త చట్టం తీసుకురావడం కోసం కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 5 సదస్సులు నిర్వహించి కౌలు రైతులు, రైతు సంఘాలు, స్వచ్ఛంద సేవాసంస్థల నుండి అభిప్రాయాలు సేకరించారు. ఈ సేకరించిన సమాచారాన్ని చెత్త బుట్టలో వేశారా? లేక పరిగణలోనికి తీసుకుంటారా? అనే విషయంపై స్పష్టత లేదని పలు చోట్ల రైతులు తెలిపారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్లుగా కౌలు రైతులకు భూయజమాని ప్రమేయం లేకుండా గుర్తింపు కార్డులు జారీ చేస్తామని చెప్పినప్పటికీ, కూటమి ప్రభుత్వం వచ్చి 17 నెలలు కావొస్తున్నా కౌలు చట్టం అమలు కాలేదు, గుర్తింపు కార్డులు అందలేదు. గుర్తింపు కార్డులు లేకపోవడంతో బ్యాంకులు కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వడం లేదు, దీంతో వడ్డీకి అప్పులు తీసుకోవాల్సి వస్తోంది, అప్పుల భారం పెరుగుతోంది. ఈ పంటలో నమోదు చేసుకోలేకపోవడంతో వరదలు, తుపానుల వల్ల పంట నష్టపోయిన కౌలు రైతులకు ఇన్పుట్ సబ్సిడీలు అందడం లేదు. ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కౌలు రైతులు పంటలు అమ్ముకునే అవకాశం లేకుండా పోయింది. గుర్తింపు లేకపోవడంతో దళారులకు తక్కువ ధరకు అమ్మాల్సి వస్తోంది. వర్షాభావం, తెగుళ్ల వల్ల దిగుబడి తగ్గుతోంది. కానీ కౌలు రైతులకు ప్రభుత్వం నుండి ఎలాంటి సహాయం అందడం లేదు. చాలా మంది కౌలు రైతులు నోటి మాటతో ఒప్పందాలు చేసుకుని భూమిని తీసుకుంటారు. దీనివల్ల భూయజమానులతో వివాదాలు వచ్చినప్పుడు వారికి చట్టపరమైన రక్షణ లభించడం లేదు. ఫలితంగా సాగు చేయడానికి భూమిని, భూమిలో పెట్టిన పంటను కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగు చేయడం గురించి కౌలు రైతులకు తగిన శిక్షణ లేదా సాంకేతిక సమాచారం అందడం లేదు. దీంతో దిగుబడి తగ్గుతోంది. కౌలు రైతులు పంటల బీమా పథకాల్లో చేరలేకపోతున్నారు. ఎందుకంటే వారి వద్ద భూమి యాజమాన్య పత్రాలు లేవు. దీనివల్ల పంట నష్టపోయినప్పుడు వారికి ఎలాంటి భరోసా లేదు. రైతు భరోసా పథకం కౌలు రైతులకు సహాయం చేయడానికి ప్రవేశపెట్టబడినప్పటికీ, అర్హత పత్రాలు లేకపోవడం, అవగాహనా లోపం వల్ల చాలా మందికి ఈ పథకం ప్రయోజనం అందడం లేదు. భూ యజమాని తీసుకునే రుణంతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డు కలిగిన ప్రతీ కౌలు రైతుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలను మంజూరు చేయాలని కౌలు రైతులు కోరుతున్నారు. కౌలు రక్షణ చట్టాన్ని ఆర్డినెన్స్ ద్వారా కూటమి ప్రభుత్వం వెంటనే తీసుకొచ్చి కౌలు రైతులకు భరోసా ఇవ్వాలని, అవసరమైతే ప్రత్యేక అసెంబ్లీ సమావేశం నిర్వహించైనా ఈ చట్టాన్ని తీసుకొనిరావాలని అత్యధిక శాతం మంది కౌలురైతులు కోరుతున్నారు.

కౌలు దోపిడీ, వడ్డీ దోపిడీ, మార్కెట్ దోపిడీ, ఇన్ పుట్ ధరల దోపిడీ (విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరల నిరంతర పెరుగుదల)కి తోడు ప్రకృతి విపత్తులతో కౌలురైతులు అల్లాడిపోతున్నారు. చెమట చుక్క చిందించకుండానే భూ యజమాని అనేక ప్రయోజనాలు పొందుతున్నాడు. పంట వేసినప్పుడు దిగుబడి వస్తుందో రాదో, మద్దతు ధర దక్కుతుందో లేదో, కనీసం పెట్టిన పెట్టుబడి వస్తుందో రాదో అని తీవ్రమైన ఆందోళనతో కౌలురైతు మానసికంగా కుంగిపోతుంటారు. తద్వారా అనేక రోగాలకు, రుగ్మతలకు గురవుతున్నారు. చేసిన అప్పులు తీర్చలేక వేరే మార్గం లేక ప్రభుత్వాలు కనుకరించక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. బాధిత కుటుంబాలకు కౌలు గుర్తింపు కార్డు (భూ యజమాని కార్డు ఇవ్వడానికి ముందుకు రాకపోవడంతో) లేకపోవడం చేత రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఎక్స్‌గ్రేషియా అందనటువంటి దయనీయమైన స్థితిలో కౌలు రైతులు ఉన్నారు. ఓట్ల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రుణ మాఫీ పథకం పెడితే బ్యాంకులో ఉన్న రుణాలను మాత్రమే మాఫీ చేస్తున్నారు. దీని వల్ల కౌలురైతులకు ఎటువంటి ప్రయోజనం ఉండదు. ఈ పథకాల ద్వారా భూ యజమానులే లబ్ధి పొందుతున్నారు. ఒక మాటలో చెప్పాలంటే యజమానిని బతికించడం కోసమే కౌలురైతులు బతుకుతున్నారా? అన్న ఆలోచన రాకతప్పడం లేదు. భూమిని కౌలుకు ఇచ్చిన భూ యజమానులకు (వ్యవసాయానికి సంబంధించిన) ఎటువంటి ఆందోళనలు, మానసిక ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా, ఏ రోగాలు లేకుండా జీవితం గడుపుతున్నారు. పైగా కౌలురైతులపై వివిధ ఆరోపణలు చేస్తుంటారు. ప్రస్తుతం రాష్ట్రంలో 25 శాతం మంది భూ యజమానులే సొంతంగా వ్యవసాయం చేసుకుంటున్నారు. మరి కొంత మంది సొంత భూమితో పాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకుని పంటలు పండిస్తున్నారు. ముఖ్యంగా సొంత భూమి లేని పేదలు కౌలుకు భూమి తీసుకుని సాగు చేసే వారు గణనీయంగా ఉన్నారు. ఇదీ! ప్రస్తుతం రాష్ట్రంలో కౌలు రైతుల ప్రాథమిక స్థితి!

> కూటమి 'ప్రజాగళం' పేరిట విడుదల చేసిన ఎన్నికల మ్యానిఫెస్టోలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేసి అన్ని సంక్షేమ పథకాలతో పాటు, పంటల బీమాను వర్తింపజేస్తామని హామీ ఇచ్చి 17 నెలలు కావొస్తున్నా...ఇది కార్యరూపం దాల్చకపోవడంతో కౌలు రైతులు కూటమి ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ ఏడాది కాలంలోనే కౌలు రైతుల కోసం చట్టం తీసుకొస్తామని ప్రకటించినా ఈ చట్టాన్ని తీసుకురాకపోవడం పట్ల కౌలురైతులు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. కౌలురైతుల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుంటే బాగుంటుందని ప్రశ్నిస్తే తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు చేయాలని 27.4 శాతం, గుర్తింపు కార్డు ఇవ్వాలని 22.7 శాతం, పండించిన పంటకు గిట్టుబాటు ధర కావాలని 12.9 శాతం, పెట్టుబడికి రుణాలు మంజూరు చేయాలని 10.9 శాతం, రుణ మాఫీ చేయాలని 10.5 శాతం మంది కోరారు.

/వ్యాసకర్త 'పీపుల్స్ పల్స్' రీసెర్చ్ సంస్థ డైరెక్టర్ /

క్యూబా లొంగిపోదు...

- అమెరికా ప్రోద్బలంతోనే ఉగ్రవాదం
- క్యూబా విదేశాంగమంత్రి రోడ్రిగ్జ్

న్యూయార్క్ : క్యూబా ఎప్పటికీ సామ్రాజ్యవాదులకు లొంగిపోదని క్యూబా విదేశాంగ మంత్రి ఎడ్వర్డో రోడ్రిగ్జ్ స్పష్టం చేశారు. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో "క్యూబాపై యూఎస్ విధించిన ఆర్థిక, వాణిజ్య ఆంక్షలను ముగించాలి" అనే తీర్మానాన్ని అమెరికా వ్యతిరేకించింది. క్యూబాపై తీర్మానానికి 165 దేశాలు అనుకూలంగానూ, 7 దేశాలు వ్యతిరేకంగానూ ఓటు వేశాయి. 12 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. క్యూబాలో ప్రజాస్వామ్యం లేదని, మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని ఉగ్రవాదులకు మద్దతు తెలుపుతుందని ఆరోపించింది. ఈ ఆరోపణలపై క్యూబా విదేశాంగ మంత్రి ఎడ్వర్డో రోడ్రిగ్జ్ మాట్లాడుతూ క్యూబా ఉగ్రవాదుల బాధిత దేశమని, తమ భూభాగంలో అమెరికా ప్రోద్బలంతోనే వారి కార్యకలాపాలు కొనసాగుతున్నాయని వివరించారు. ఎప్పటికీ క్యూబా లొంగిపోదని తేల్చి చెప్పారు. ప్రస్తుత ఇబ్బందులను అధిగమించడానికి పోరాడతామని, ఆర్థిక స్థిరత్వాన్ని సాధించడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. మరోవైపు క్యూబాకు మద్దతుగా "ఎల్లప్పుడూ క్యూబాతో" అనే పేరుతో అమెరికా కమ్యూనిస్టు పార్టీ బుధవారం మారథాన్ ర్యాలీ నిర్వహించింది. బ్రెజిల్, ఈక్వెడార్, చిలీ, కెన్యా, మెక్సికో కమ్యూనిస్టు పార్టీలు అమెరికా నేరపూరిత దిగ్బంధనాన్ని అంతమొందించాలని ఉమ్మడిగా ప్రకటన విడుదల చేశాయి. 1960 నాటి నుండి క్యూబా ఆర్థిక నిర్బంధాన్ని ఎదుర్కొంటోంది. ఆంక్షలతో క్యూబా ప్రజల జీవితాలు కుదేలవుతున్నాయి. ఈ ఆంక్షల కారణంగా క్యూబా ప్రజలు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఆహారం, మందులు, ఇంధనం, విద్య, వైద్యం వంటి ప్రాథమిక అవసరాలు తీరని పరిస్థితి. ఇంధన సంక్షోభం వల్ల క్యూబాలో రోజుకు 6 నుండి 8 గంటల విద్యుత్ కోత ఉంటుంది. రవాణా వ్యవస్థ దెబ్బతిని, బస్సులు, ట్రక్కులు తగ్గినందున ప్రజలు సైకిళ్లపై ఆధారపడుతున్నారు. క్యూబా ఇతర దేశాలతో వ్యాపారం చేయడానికి బ్యాంకుల నుండి అవరోధాలున్నాయి. క్యూబా ఓడలు అమెరికా ఓడరేవులకు వెళ్లడానికి అనుమతి లేదు. వ్యవసాయానికి ఎరువులు, యంత్రాలు లేక పంటల దిగుబడి తగ్గిపోయింది. ప్రపంచంలో ఏదేశం పైనా ఇలాంటి దీర్ఘకాలిక ఆంక్షలు లేకపోవడం గమనార్హం.

బిల్లులు చెల్లించకుంటే పనులు చెయ్యలేం

- కమిషనర్‌కు నోటీసు ఇచ్చిన కాంట్రాక్టర్లు

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

విజయనగరం నగర పాలక సంస్థలో చేస్తోన్న అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిపివేసి వచ్చే నెల మూడో తేదీన నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని కమిషనర్ నల్లనయ్యకు కాంట్రాక్టర్లు గురువారం నోటీసు అందజేశారు. గత రెండేళ్లగా పూర్తి చేసిన పనులకు నేటి వరకు బిల్లులు చెల్లించలేదన్నారు. సకాలంలో పనులు పూర్తి చేసినప్పటికీ బిల్లులు చెల్లించకపోవడం సరికాదని పేర్కొన్నారు. గత బిల్లుల పేమెంటులు రాక, కొత్త బిల్లులకు పేమెంటులు ఇవ్వకపోవడం వలన తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని, మానసిక ఒత్తిడికి లోనవుతున్నామని ఆవేదన చెందారు. ఐబీఎం కోర్ కమిటీతో జరిగిన చర్చల్లో సానుకూల స్పందన రాకపోవడంతో నవంబర్ మూడు నుంచి పనులు నిలుపుదల చేసి ధర్నా చేస్తామని తెలిపారు. నోటీసు అందించిన వారిలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టులు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.బంగార్రాజు, ఆర్.రాజ్‌కుమార్, గౌరవాధ్యక్షులు ఎం.లింగారావు, పి.అశోక్, సభ్యులు నరేంద్ర, పి.శ్రీనివాసరాజు, డి.శ్రీనివాస్, వాసుదేవరావు, కె.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.


కృష్ణాజిల్లా పెనమలూరు మండలం తాడిగడపలో అరటి తోటను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

పంట నష్టాలపై పూర్తిస్థాయి నివేదికలు

- అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం

ప్రజాశక్తి - గుడివాడ, కంకిపాడు

పంట నష్టాలపై నాలుగు రోజుల్లోపు పూర్తిస్థాయి నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఈ నేపథ్యంలో గ్రామాల వారీగా బృందాలను ఏర్పాటు చేశామన్నారు. కృష్ణా జిల్లా పెదపారుపూడి మండలం వెంట్రప్రగడ, పెనమలూరు మండలం తాడిగడప, కంకిపాడు మండలం పునాదిపాడుల్లో దెబ్బతిన్న వరి, అరటి, కంద తదితర పంటలను మంత్రి అచ్చెన్నాయుడు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ సహకారంతో నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందిస్తామని, పెరిగిన పంట వ్యయానికి అనుగుణంగా రైతులకు పరిహారం అందిస్తామని చెప్పారు. పంటల బీమాపై మాజీ ముఖ్యమంత్రి జగన్ పచ్చి అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ప్రభుత్వం బీమా వాటా చెల్లించలేదని అప్పటి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి బహిరంగంగానే చెప్పారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పామర్రు, పెనమలూరు ఎమ్మెల్యేలు వర్ల కుమార్ రాజా, బోడే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరకామణి' దర్యాప్తులో తప్పిదాలు

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం(టిటిడి)లో జరిగిన పరకామణి దొంగతనం కేసు దర్యాప్తులో అడుగడుగునా తప్పిదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. దీనికి నాటి చైర్మన్, టిటిడి అధికారులు, ఈవో బాధ్యులని పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ కుట్రలను వెలికితీయడానికి హైకోర్టు సునిశితంగా దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. తిరుమలలో దొంగతనం జరిగినా ఉన్నతాధికారులెవరూ స్పందించలేదన్నారు. కోట్లాది రూపాయలు దొంగతనం చేసిన వ్యక్తి లోక్ అదాలత్‌లో రాజీపడటం న్యాయానికి సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. తిరుపతి లోక్ అదాలత్ ఇచ్చిన తీర్పును పక్కన పెట్టి ఈ కేసు పునఃవిచారణ జరిపించాలని టిటిడి హైకోర్టులో అప్పీల్ వేయాలని కోరారు. సిఐడి ఈ కేసును ప్రతిష్టాత్మకంగా దర్యాప్తు చేసి తప్పు చేసిన వారు ఎంతటివారైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దర్యాప్తు అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలన్నారు.

ఓపి, ఐపి సేవల్లో పురోగతి

- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత ఆరు నెలల్లో వైద్య సిబ్బంది హాజరు, ఓపి, ఐపి సేవల్లో పురోగతి సాధించామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆరు నెలల పనితీరుపై గురువారం సమగ్రంగా సమీక్షించారు. ప్రభుత్వ వైద్యశాలల్లో నాలుగు కోట్లకు పైగా ఓపి సేవలు నమోదయ్యాయని తెలిపారు. రోగికి ఓపి సేవలు 42 నిమిషాల నుంచి 26 నిమిషాలకు తగ్గినట్లు పేర్కొన్నారు. ఆరు నెలల కాలంలో ప్రభుత్వ వైద్యులు, ఇతర సిబ్బంది హాజరు ఈ ఏడాది ఏప్రిల్‌లో 83శాతం నుంచి సెప్టెంబర్ నాటికి 92శాతానికి పెరగడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వైద్యుల హాజరు 82శాతం మాత్రమే ఉండటం పట్ల తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్‌హెచ్ఎం పథకాల అమలులో అగ్రస్థానంలో తూర్పు గోదావరి, కడప, తిరుపతి జిల్లాలు ఉంటే, అల్లూరి సీతారామరాజు, గుంటూరు శ్రీకాకుళం జిల్లాలు వెనుకబడ్డాయని వివరించారు. మూల్యాంకన వ్యవస్థ ఫలితాల ఆధారంగా వెల్లడైన లోపాలను సరిదిద్దుకోవడానికి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఆర్‌టిసి బస్సులో పొగలు


- కిటికీ అద్దాలు పగలగొట్టి దూకేసిన ప్రయాణికులు

ప్రజాశక్తి- భోగాపురం (విజయనగరం జిల్లా)

విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న ఆర్‌టిసి పల్లెవెలుగు బస్సులో గురువారం సాయంత్రం పొగలు వచ్చాయి. భోగాపురంలో యూనియన్ బ్యాంకు సమీపంలో సర్వీస్ రోడ్డులో వెళ్తుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. ఆ సమయంలో బస్సులో 50 మందికిపైగా ప్రయాణికులు ఉన్నారు. అకస్మాత్తుగా బస్సు ముందు భాగం నుంచి నిప్పురవ్వలు చిమ్మడంతో, డ్రైవర్ ఉన్నచోట దట్టంగా పొగలు వ్యాపించడంతో ప్రయాణికులు భయంతో బస్సు అద్దాలను పగలగొట్టి కిందికి దూకేశారు. డ్రైవర్ వెంటనే బస్సు నిలిపేయడంతో మిగతా వారంతా సురక్షితంగా కిందకు దిగారు. అనంతరం వెనుక వస్తున్న మరో బస్సులో ప్రయాణికులను ఎస్ఐ సూర్యకుమారి పంపించారు. విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ వల్ల పొగలు వచ్చినట్లు తెలుస్తోంది.

వైభవంగా నారా రోహిత్ వివాహం

- హాజరైన సిఎం చంద్రబాబు దంపతులు



హైదరాబాద్ : నటుడు నారా రోహిత్ ఓ ఇంటివాడయ్యారు. నటి శిరీష (సిరి)తో ఆయన వివాహం గురువారం రాత్రి ఘనంగా జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు, సినీ, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై, వధూవరులను ఆశీర్వదించారు. 'ప్రతినిధి 2' సినిమాలో రోహిత్ సరసన శిరీష నటించారు. అలా మొదలైన వారి స్నేహం తరువాత ప్రేమగా మారింది. పెద్దల అంగీకారంతో గతేడాది వీరి నిశ్చితార్థం జరిగింది. శిరీష స్వస్థలం రాష్ట్రంలోని రెంటచింతల. తమ తల్లిదండ్రులకు నాలుగో సంతానమైన శిరీష.. ఆస్ట్రేలియాలో ఉన్నత చదువులు పూర్తి చేసి అక్కడే కొంతకాలం ఉద్యోగం చేశారు. తరువాత నటనపై ఆసక్తితో స్వదేశానికి తిరిగొచ్చారు. హైదరాబాద్‌లోని తన అక్క ప్రియాంక వద్ద ఉంటూ చేసిన సినీ ప్రయత్నాల్లో భాగంగా 'ప్రతినిధి 2'కి ఎంపికయ్యారు.

అందరి చూపు అభిషేక్‌పైనే..

- నేడు ఆస్ట్రేలియాతో రెండో టి20
- మధ్యాహ్నం 1.45ని.లకు



మెల్‌బోర్న్: తొలి టి20 వర్షార్పణం కావడంతో టీమిండియా ఇక రెండో టి20పై దృష్టి సారించింది. వర్షం కారణంగా కేవలం 9.4ఓవర్ల మ్యాచ్ మాత్రమే జరగ్గా... ఓపెనర్ అభిషేక్ శర్మ నిరాశపరిచినా.. శుభ్మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్ ధనా ధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. సూర్యకుమార్ యాదవ్ కేవలం 24బంతుల్లో 39పరుగులు చేశాడు. మరోవైపు శుభ్మన్ 20బంతుల్లో 37పరుగులతో రాణించాడు. దీంతో టీమిండియా కేవలం 9.4ఓవర్లలోనే వికెట్ నష్టపోయి 97పరుగులు చేసింది. ఆ దశలో వర్షం కారణంగా మ్యాచ్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. తొలి టి20లో టాస్ గెలిచిన ఆసీస్ కెప్టెన్ టీమిండియాను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. ఆసియాకప్ టోర్నీలో నిరాశపరిచిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్.. ఆసీస్ పిచ్‌లపై చెలరేగి ఆడుతున్నాడు. ఆసీస్ పేసర్ నాథన్ ఎల్లిస్ వేసిన బౌలింగ్‌లో వరుసగా ఫోర్, సిక్సర్ కొట్టి తిరిగి ఫామ్‌లోకి వచ్చాడు. మరో మూడు నెలల్లో టి20 ప్రపంచకప్ ప్రారంభం కానున్న దృష్టా ఆసీస్‌పై సిరీస్ నెగ్గి ఆత్మవిశ్వాసంతో ఆ టోర్నీ బరిలోకి దిగాలని చూస్తోంది.

జట్లు(అంచనా)...

ఇండియా: సూర్యకుమార్(కెప్టెన్), శుభ్మన్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, సంజు శాంసన్(వికెట్ కీపర్), దూబే, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, కుల్దీప్, వరుణ్ చక్రవర్తి, బుమ్రా.

ఆస్ట్రేలియా: మిఛెల్ మార్ష్(కెప్టెన్), హెడ్, ఇంగ్లిస్(వికెట్ కీపర్), టిమ్ డేవిడ్, ఓవెన్, స్టొయినీస్, ఫిలిప్పే, బార్ట్‌లెట్, ఎల్లిస్, కుహ్నేమన్, హేజిల్‌వుడ్.

కోల్‌కతా హెడ్ కోచ్‌గా అభిషేక్ నాయర్



కోల్‌కతా: ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) 2026కు ముందు కోల్‌కతా నైట్ రైడర్స్(కెకెఆర్) కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త హెడ్‌కోచ్ వేటలో ఉన్న ఆ ఫ్రాంచైజీ అభిషేక్ నాయర్‌కు ఆ పదవిని కట్టబెట్టింది. ఈ విషయాన్ని గురువారం ఎక్స్ వేదికగా కోల్‌కతా వెల్లడించింది. ఈమధ్యే రాజీనామా చేసిన చంద్రకాంత్ పండిట్ స్థానాన్ని నాయర్ భర్తీ చేయనున్నాడు. లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ అయిన అభిషేక్ 2009లో టీమిండియా తరఫున తొలి వన్డే ఆడాడు. అనంతరం ఐపిఎల్‌పై దృష్టి సారించి 2018లో కోల్‌కతా క్యాంప్‌లో చేరాడు. అప్పటినుంచి ఫ్రాంచైజీ కొన్న కుర్రాళ్లలో మెలకువలు పెంపొందించడమే పనిగా శ్రమించాడు. అభిషేక్ శిక్షణలోనే వరుణ్ చక్రవర్తి, వెంకటేశ్ అయ్యర్, రింకూ సింగ్‌లు రాటుదేలారు. దీంతో 2024లో కోల్‌కతా నైట్‌రైడర్స్ ట్రోఫీ గెలవడంలో కీలకపాత్ర పోషించాడు. భారత జట్టు ప్రధాన కోచ్‌గా గౌతం గంభీర్ బాధ్యతలు చేపట్టాక.. సహాయక కోచ్‌గా నాయర్‌కు అవకాశం లభించింది. కానీ, శ్రీలంకపై వన్డే సిరీస్, న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్ కారణంగా అసిస్టెంట్ కోచ్‌లపై వేటు వేయాలని బిసిసిఐ నిర్ణయం తీసుకోవడంతో నాయర్ వైదొలగాల్సి వచ్చింది. అజింక్యా రహానే సారథ్యంలోని కోల్‌కతా గత సీజన్‌లో తీవ్రంగా నిరాశపరిచింది. దీంతో హెడ్‌కోచ్‌గా ఉన్న చంద్రకాంత్ పండిట్ స్వచ్ఛందంగా వైదొలిగాడు.



వరంగల్ జలమయం..

- ఖమ్మంలో మున్నేరు ఉధృతి
- తెలంగాణవ్యాప్తంగా భారీ వర్షాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మొంథా తుపాను ప్రభావంతో గత రెండు రోజులు కురిసిన భారీ వర్షాలకు తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ నగరం జలమయమయింది. ఖమ్మంలో మునేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. పలు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వరంగల్ నగరంతో పాటు హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లోని పలు కాలనీలు చెరువులను తలపించాయి. వరంగల్-హనుమకొండను అనుసంధానం చేసే హంటర్ రోడ్డులో బొంది వాగు ఉప్పొంగడంతో గురువారం వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

ములుగు రోడ్డు వద్ద నాలా ఉధృతంగా ప్రవహించడంతో సంతోషిమాత కాలనీ, డికె నగర్, ఎన్ఎన్ నగర్, మైసయ్య నగర్, సమ్మయ్య నగర్, సాయి గణేశ్ కాలనీలోని ఇళ్లల్లోకి వరదనీరు చేరుకోవడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. వరద ప్రభావంతో వరంగల్ భద్రకాళి ఆలయానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఆలయం నుంచి పాలిటెక్నిక్ కళాశాల వరకు రోడ్డు జలమయమైంది. వరంగల్ తూర్పు పరిధిలో ఆరు పునరావాస కేంద్రాలను నగరపాలక సంస్థ అధికారులు ఏర్పాటు చేశారు. ముంపు ప్రాంతాల ప్రజలను పడవల సహాయంతో పునరావాస కేంద్రాలకు విపత్తు నిర్వహణ సిబ్బంది తరలించారు. హనుమకొండ పరిధిలోని వడ్డేపల్లి చెరువు నుంచి భారీగా వరద నీరు కాలనీల్లోకి రావడంతో జవహర్ కాలనీ, గోపాల్‌పూర్, 100 ఫీట్ల రోడ్డు జలమయమయ్యాయి. పలు కాలనీల్లో కార్లు, బైక్‌లు జల ప్రవాహంలో కొట్టుకుపోతున్నాయి.

ఖమ్మంలో మున్నేరు ఉధృతంగా 25 అడుగులకు పైగా ప్రవాహిస్తోంది. దీంతో అధికారులు మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. వరద ఉధృతికి మేన్నేరు పరిసర కాలనీల్లోని పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. నివాసాలు, వ్యాపార సముదాయాలు వరద నీటిలో మునిగిపోయాయి. వరద బాధితులను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. మున్నేరు ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్, మేయర్ నీరజ పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అలెర్ట్ చేశారు.



ఇవేం పనులు సారూ..!

- విద్యార్థులతో పనులు చేయిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - పెద్దవడుగూరు

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులు వారిచేత పనులు చేయిస్తున్నారు. విద్యార్థులతో గదిలో సిమెంటు పనులు, పేపర్ల తొలగింపు పనులు చేయిస్తున్నారు. మండలంలోని లక్షుంపల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవాల్సిన విద్యార్థులతో ఉపాధ్యాయులు పనులు చేయించడంపై పలు విమర్శలు వినపడుతున్నాయి. పాఠశాలలో మరుగుదోడ్లు, గదులను శుభ్రం చేయించేందుకు ప్రత్యేకంగా వర్కర్‌ను కేటాయించగా వారిచేత ఇవేమీ చేయించకుండా విద్యార్థులతోనే పనులు చేయించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మేయర్ దంపతుల జంటహత్య కేసు

- తీర్పు శుక్రవారానికి వాయిదా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: దివంగత నగర మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్ జంటహత్య కేసుపై తొమ్మిదో అదనపు జడ్జి శ్రీనివాసరావు గురువారం మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 6గంటల వరకు జిల్లా కోర్టు ఆవరణంలోని తొమ్మిదో అదనపు కోర్టులు ఇరువర్గాల వాదోపవాదాలు విన్నారు. జంట హత్యల కేసులో ముద్దాయిలను పోలీసులు 2.30 గంటలకు జిల్లా జైల్ నుండి పోలీస్ భద్రత నడుమ కోర్టులో హాజరుపరిచారు. సాయంత్రం 6 గంటల వరకు ఇరువర్గాల తరపు లాయర్ల వాదోపవాదనలు వినిపించారు. దీంతో జంట హత్యల కేసు తీర్పును ఈనెల 31వ తేదీ శుక్రవారానికి వాయిదా వేశారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు జంట హత్యకేసులో ఐదుగురు నిందితులను తొమ్మిదో అదనపు కోర్టులో హాజరుపరచనున్నారు

ఇద్దరు విద్యార్థులు అదృశ్యం

- కేసు నమోదు

ప్రజాశక్తి-గాలివీడు: అన్నమయ్య జిల్లా గాలివీడె మండలంలోని అరవీడు గ్రామం, గాండ్లపల్లిలో ఉన్న హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న ఇద్దరు బాలికలు జుబేదా, జాస్మిన్ అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటలకు స్కూల్‌కు వెళ్తున్నామని ఇంటి వద్ద నుంచి వెళ్లారని తెలిపారు. కానీ స్కూల్‌కు వెళ్లలేదని, తిరిగి ఇంటికి పోలేదని చెప్పారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసుగా నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రష్యా ఇంధన దిగుమతులను నిషేధించలేం

- అమెరికాకు తేల్చి చెప్పిన జపాన్

టోక్యో : రష్యా నుంచి లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ) దిగుమతులను నిషేధించలేమని అమెరికాకు జపాన్ తేల్చి చెప్పింది. జపాన్ నూతన ప్రధాని తకైచీ అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్‌తో మూడు రోజుల క్రితం టోక్యోలో సమావేశమైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా...రష్యా నుంచి ఇంధన దిగుమతులను నిషేధించడం కష్టమని తకైచీ స్పష్టం చేశారని పేరు చెప్పడానికి ఇష్టపడని ఇద్దరు జపాన్ ప్రభుత్వ అధికారులు బుధవారం రాయిటర్స్ వార్తా సంస్థకు తెలియజేశారు. మంగళవారం ట్రంప్, తకైచీ మధ్య జరిగిన ద్వైపాక్షిక సమావేశంలో ఎల్ఎన్‌జీ అంశం ప్రస్తావనకు వచ్చింది. జపాన్ ఇంధన అవసరాలను అర్థం చేసుకోవాలని ట్రంప్‌ను తకైచీ కోరారు. కొనుగోళ్లను జపాన్ ఆపేస్తే చైనా, రష్యాలు సంతోషిస్తాయని ఆమె తెలిపారు. జపాన్ దిగుమతి చేసుకుంటున్న ఎల్ఎన్‌జిలో రష్యా వాటా సుమారు 9 శాతం. రష్యాలోని సఖాలిన్-2 ఎల్ఎన్‌జీ ప్రాజెక్టులో జపాన్ కంపెనీలైన మిత్‌సుయ్, మిత్‌సుబిషి కంపెనీలకు వాటాలు ఉన్నాయి. రష్యా నుంచి ఇంధనాన్ని కొనుగోలు చేయవద్దని అమెరికా ప్రపంచ దేశాలను కోరుతున్న సంగతి విదితమే.

వియత్నాంను ముంచెత్తిన భారీ వరదలు

- 10 మంది మృతి.. పలువురు గల్లంతు

హనోయి : ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు వియత్నాంను భారీ వరదలు ముంచెత్తాయి. ఈ వరదల్లో 10 మంది మరణించినట్లు అక్కడి అధికారులు గురువారం తెలిపారు. వియత్నాంలోని యునెస్కో వారసత్వ ప్రదేశాల్లో ఒకటైన హెూయ్‌యాన్ పురాతన పట్టణం (సాంస్కృతిక) సహా తీర ప్రాంత ప్రావిన్స్‌లు వారాంతం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు అతలాకుతలమైనట్లు పర్యావరణ మంత్రిత్వ శాఖ తెలిపింది. 24 గంటల్లో రికార్డు స్థాయిలో 1.7 మీ వర్షపాతం నమోదైందని పేర్కొంది. డానాంగ్ మీదుగా ప్రవహించి హెూరుయాన్ వద్ద సముద్రంలో కలిసే థుబాన్ నది నీటి మట్టం గరిష్టస్థాయికి చేరుకుందని తెలిపింది. 60 ఏండ్ల తర్వాత 5.62 మీటర్ల గరిష్ట స్థాయిని చేరుకుందని, 1964లో ఈ నది నీటి మట్టం నాలుగు సెంటీమీటర్లకు చేరుకుందని పేర్కొంది.

గిరిజన హక్కుల కోసం దేశవ్యాప్త పోరాటం

రాజకీయ, సామాజిక, గిరిజన సంఘాల ఐక్య వేదిక తీర్మానం

రాంచీ : దేశంలో అడవి బిడ్డలపై వివిధ రూపాల్లో దాడులు పెరిగిపోతుండటం పట్ల రాజకీయ, సామాజిక, గిరిజన సంఘాల ఐక్య వేదిక తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ దాడులను ప్రతిఘటిస్తూ గిరిజన హక్కుల కోసం దేశవ్యాప్త ఉద్యమానికి పిలుపునిచ్చింది. ఆదివాసీ అధికార్ మంచ్ (ఎఎఎం) ఆధ్వర్యంలో గురువారం జార్ఖండ్‌లోని నమ్‌కమ్‌లో ఐక్య వేదిక ప్రతినిధుల సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పొలిట్‌బ్యూరో మాజీ సభ్యులు బృందాకరత్, త్రిపుర ప్రతిపక్ష నేత జితిన్ చౌదరి, జార్ఖండ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రత్నాకర్ భెంగ్రా తదితరులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. జార్ఖండ్‌లోని ఛాయ్‌బసలో పనిచేస్తున్న గిరిజనులు కాలుష్యం, ప్రమాదాల బారినపడకుండా చర్యలు చేపట్టాలని, వారి రక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ సదస్సు ముందు.. అక్రమ కేసులు బనాయించడం, జైలులో చిత్రహింసలు గురిచేయడం వంటి కేంద్ర ప్రభుత్వ వేధింపులకు బలైపోయిన ఆదివాసీ హక్కుల కార్యకర్త స్టాన్‌స్వామి విగ్రహానికి బృందాకరత్ తదితరులు నివాళులర్పించారు.



కేంద్ర ప్రభుత్వ వేధింపులకు బలైపోయిన ఆదివాసీ హక్కుల కార్యకర్త స్టాన్ స్వామికి నివాళులర్పిస్తున్న బృందాకరత్, జితిన్ చౌదరి తదితరులు

అనంతరం జరిగిన మీడియా సమావేశంలో బృందాకరత్ మాట్లాడుతూ గిరిజన హక్కులకోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోడీ సర్కార్ అనుసరిస్తున్న కార్పొరేటీకరణ విధానాలతో అడవి బిడ్డలను అడవుల్లో ఉండకుండా తరిమివేస్తోందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసీలపై బిజెపి ప్రభుత్వ కుట్రల్ని అడ్డుకునేలా సిపిఎం తన పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. హక్కుల పరిరక్షణ కోసం అడవి బిడ్డలు చేపట్టే ఉద్యమాలకు తమ పార్టీ అండగా నిలుస్తుందన్నారు.

జల్, జంగల్, జమీన్ (నీళ్లు, అడవి, భూమి) నినాదంతో మనుగడ కోసం గిరిజనులు సాగిస్తున్న పోరాటాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అత్యంత దారుణంగా అణిచివేస్తోందని జితిన్ చౌదరి ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజనుల హక్కులను పూర్తిగా హరించేందుకు కేంద్రంలోని మోడీ సర్కార్ కుట్రలు సాగిస్తోందని ఆయన విమర్శించారు. జస్టిస్ రత్నాకర్ భెంగ్రా మాట్లాడుతూ రాజ్యాంగంలోని 5వ షెడ్యూలులో గిరిజనులకు ప్రత్యేక రక్షణ కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు ఈ విషయాన్ని అనేక చారిత్రాక తీర్పుల్లో నొక్కి చెప్పిందని ఆయన తెలిపారు. గిరిజన హక్కుల పరిరక్షణ కోసం రాజకీయంగా పోరాటం మరింత విస్తృతం చేయాల్సిన అవసరముందని ఆయన తెలిపారు.

సుప్రీంకోర్టులో ముగిసిన మార్గదర్శి ఫైనాన్షియర్స్ కేసుల విచారణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సుప్రీంకోర్టులో మార్గదర్శి ఫైనాన్షియర్స్ కేసుల విచారణ ముగిసింది. 2007లో అప్పటి ప్రభుత్వం జారీ చేసిన జిఓలను సవాలు చేస్తూ మార్గదర్శి సంస్థ దాఖలు చేసిన ప్రధాన రిట్ పిటిషన్ తుది విచారణను సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం తెలంగాణహైకోర్టుకే పంపింది. ఈ వ్యవహారంపై హైకోర్టు ఇంకా తీర్పు ఇవ్వలేదని మార్గదర్శి తరపు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా తెలిపారు. దీంతో రిట్ పిటిషన్‌కి అనుబంధంగా దాఖలైన అన్ని పిటిషన్లపై విచారణ ముగించినట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. తాము కేసు మెరిట్స్‌లోకి వెళ్లదలచుకోలేదని పేర్కొంది. అయితే దీనికి ఉండవల్లి అరుణ్ కుమార్ అభ్యంతరం చెప్పారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ ఏవైనా చెప్పుకోవాలి అనుకుంటే... హైకోర్టుకే వెళ్లాలని, తాము హైకోర్టు బూట్లలోకి వెళ్ళి చూడాలనుకోవడం లేదని వ్యాఖ్యానించింది. మార్గదర్శి సంస్థ ఇప్పటికే రూ.2,100 కోట్లు డిపాజిటర్లకు ఇచ్చేశారని, ఇంకా రూ. 5.48 కోట్లు ఎస్క్రో అకౌంట్‌లో ఉన్నట్లు తుది ఉత్తర్వుల్లో ధర్మాసనం పేర్కొంది. ఇంకా ఎవరైనా ఉంటే.. తగిన ఆధారాలు చూపి తీసుకునే వెసులుబాటు ఉన్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

గాజా పరిస్థితులపై ఎంఎస్ఎఫ్ ఆందోళన

గాజా : తాజాగా గాజాలో కాల్పుల విరమణ ఉల్లంఘనతో వంద మందికి పైగా మరణించిన నేపథ్యంలో అసలు దీన్ని కాల్పుల విరమణ అని పిలవాలా అంటూ డాక్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్ (ఎంఎస్ఎఫ్) తీవ్రంగా విమర్శించింది. గాజావ్యాప్తంగా పాలస్తీనియన్ల పరిస్థితి చూస్తే అత్యంత దయనీయంగా, బాధాకరంగా వుందని పేర్కొంది. తమ బృందాలు గత రెండు రోజులుగా గాయపడిన అనేకమందికి చికిత్సనందించాయని తెలిపింది. బుధవారం ఎమర్జన్సీ రూంలోకి వెళ్లేసరికి అక్కడ పరిస్థితి చూస్తే "ఇది కచ్చితంగా పౌరులే లక్ష్యంగా చేసిన దాడి అని స్పష్టమవుతోందని' నార్వేకి చెందిన డాక్టర్ మార్టెన్ వ్యాఖ్యానించారు. అనేకమంది పిల్లలు గాయాలతో రక్తమోడుతూ నేలపై పడివున్నారని, ఇదంతాచూస్తుంటే గాజాలో కాల్పుల విరమణ వుందా అని అనుమానం వస్తోందని అన్నారు. కాగా గురువారం ఇద్దరు బందీల మృతదేహాలను హమాస్ రెడ్‌క్రాస్‌కు అప్పగించింది. ఇంత జరుగుతున్నా ఇంకా కాల్పుల విరమణ అమల్లో వుందంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రగల్భాలు పలుకుతున్నారు. మధ్యవర్తిత్వం వహించిన కతార్ మాత్రం తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేసింది. మరోవైపు లెబనాన్‌లో ఇజ్రాయిల్ పదాతి దళాలు దాడులను ఉధృతం చేశాయి. దీంతో ఈ దూకుడును ప్రతిఘటించాల్సిందిగా ఆర్మీకి ఆదేశాలు జారీ చేసినట్లు లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ తెలిపారు. తాజాగా ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో నబ్లస్‌కు దక్షిణంగా బెయిటా పట్టణంలోకి ఇజ్రాయిల్ బలగాలు దూసుకువెళ్ళాయి.

ఉద్యోగులు, పెన్షనర్ల ప్రయోజనాలకు కత్తెర!

- కేంద్ర వేతన సంఘం ప్రస్తావనాంశాలను ఖండించిన సిఐటియు

న్యూఢిల్లీ : ఎనిమిదవ కేంద్ర వేతన సంఘం (సిపిసి) ప్రస్తావనాంశాలను సిఐటియు తీవ్రంగా ఖండించింది. ఉద్యోగుల చట్టబద్ధమైన ప్రయోజనాలు, హక్కులకు, మొత్తంగా ఆర్థికవ్యవస్థకు తీవ్ర హాని కలిగించేలా పొదుపు చర్యలను మరింత ముందుకు తీసుకెళ్ళాలన్న కేంద్ర ప్రభుత్వం ఉద్దేశ్యంపై తీవ్ర సందేహాలు లేవనెత్తుతున్నాయని పేర్కొంది. ఈ మేరకు సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ఒక ప్రకటన విడుదల చేశారు.

మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం కమిషన్ ఛైర్మన్‌ను, తాత్కాలిక సభ్యుడిని నియమించడానికి, అలాగే బీహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నిబంధనలను ఆమోదించడానికి దాదాపు ఏడాది సమయం తీసుకుంది. కేవలం ఢిల్లీ ఎన్నికల ముందు సిపిసికి సంబంధించి తొలి ప్రకటన వెలువడింది.ఛైర్మన్‌పై, నిబంధనలపై నిర్ణయం తీసుకోవడంలో ఇంతగా జాప్యం చేయడంతో ఉద్యోగులు ఒకవేళ కమిషన్ సిఫార్సుల వల్ల తమకు రావాల్సిన లబ్ది ఏదైనా పొందాలన్నా దాదాపు రెండేళ్ళు వేచి వుండాల్సి వచ్చింది.

ఈ నిబంధనలు, పైగా 'నిధులు లేని, చందాయేతర పాత పెన్షన్', 'ఆర్థిక వివేచన, ఆర్థికావకాశాలు' వంటి పదాలు ఉపయోగించడం, కేంద్ర ప్రభుత్వం, పలు రాష్ట్ర ప్రభుత్వాల తప్పుడు ఉద్దేశ్యాలు, తప్పుడు భాష్యాలు ఉద్యోగుల వేతనాలు, ప్రోత్సహకాలు, పెన్షన్, ఇతర ప్రయోజనాల పెంపుపై ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తాయని ఆ ప్రకటన పేర్కొంది.

ఫైనాన్స్ బిల్లు 2025లో భాగంగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన వాలిడేషన్ యాక్ట్ నేపథ్యంలో ఈ ప్రస్తావనాంశాలు పెన్షనర్ల పెన్షన్, ఇతర ప్రయోజనాలపై చాలా వినాశకరమైన విధ్వంసాన్ని కలిగిస్తాయి. కేంద్ర వేతన కమిషన్ కసరత్తులో భాగంగా దీన్ని తక్షణమే రద్దు చేయాలి.

ఉత్పత్తితో ముడిపడిన రాయితీ (పిఎల్ఐ), కేపెక్స్ రాయితీ, ఉపాధితో ముడిపడిన రాయితీ (ఇఎల్ఐ), ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీ రాయితీ, ఇంకా పన్నుల్లో కోతలు, బ్యాంక్ రుణాల రద్దు వంటి పలు రాయితీల రూపాల్లో కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయిలు కట్టబెట్టే ఈ ప్రభుత్వం ఉద్యోగులకు వచ్చే పెన్షన్లు ఇతర ప్రయోజనాల్లో కోత విధించడానికి ప్రయత్నిస్తోందని సిఐటియు విమర్శించింది.

నయా ఉదారవాదం ప్రయోజనాలకు అనుగుణంగా వుండేలా మొత్తంగా పెన్షన్ వ్యవస్థలో మార్పు తీసుకురావడానికి ఈ నిబంధనలు సమర్ధవంతంగా ఉపయోగపడవచ్చు కానీ దీనివల్ల పాత, భవిష్యత్ పెన్షన్‌దారులు దెబ్బతింటారని పేర్కొంది. ఎన్‌పిఎస్ కింద వున్న ఉద్యోగులను యుపిఎస్ కిందకు తీసుకురావడంలో విఫలమైన ప్రభుత్వం ప్రస్తుతమున్న ఒపిఎస్‌ను కాలరాసే నిబంధనలను తీసుకువచ్చింది. ఎన్‌పిఎస్, యుపిఎస్‌లను తిరస్కరిస్తూ ఒపిఎస్ కన్నా మరేది తమకు ఆమోదయోగ్యం కాదని ఉద్యోగులు చేస్తున్న ఉద్యమానికి వ్యతిరేకంగా ఈ నిబంధనలను ఆయుధంగా ఉపయోగిస్తోందని విమర్శించింది.

ఉద్యోగులు, పెన్షనర్ల (ఒపిఎస్ కిందకు తీసుకువచ్చే) వేతనాలు, ఇతర ప్రయోజనాలన్నీ పెరిగేలా బేషరతుగా కమిషన్ నిబంధనలను సవరించాలని కేంద్ర ప్రభుత్వానికి సిఐటియు విజ్ఞప్తి చేసింది. నయా ఉదారవాద పొదుపు చర్యలకు వ్యతిరేకంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు చేసే పోరాటాలకు సిఐటియు బాసటగా వుంటుందని తపన్‌సేన్ ఆ ప్రకటనలో హామీ ఇచ్చారు.

అమెరికాలో మళ్లీ అణు పరీక్షలు

రక్షణ శాఖకు ట్రంప్ ఆదేశాలు

వాషింగ్టన్ : అణ్వాయుధ పరీక్షలను తిరిగి వెంటనే ప్రారంభించాలని అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ తన రక్షణ శాఖను ఆదేశించారు. అణ్వాయుధాలు కలిగిన ఇతర దేశాలు ఏ స్థాయిలో పరీక్షలు జరుపుతున్నాయో అదే స్థాయిలో జరపాలని ఆదేశించానని ఆయన గురువారం తెలియజేశారు. అణుశక్తితో కూడిన జలాంతర్గామిని సొంతంగా నిర్మించేందుకు మిత్రదేశమైన దక్షిణ కొరియాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చానని చెప్పారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్‌తో జరిపిన వాణిజ్య చర్చలు ఫలప్రదమయ్యాయని అన్నారు. చైనా అధ్యక్షులు జిన్‌పింగ్‌తో సమావేశం కావడానికి ముందు ట్రంప్ తన ట్రూత్ సోషల్ సామాజిక మాధ్యమ వేదికలో ఓ పోస్ట్ పెడుతూ ఏ ఇతర దేశం కంటే అమెరికా వద్ద ఎక్కువ అణ్వాయుధాలు ఉన్నప్పటికీ ఐదు సంవత్సరాలలో చైనా ఆ స్థాయికి చేరుకుంటుందని తెలిపారు. దక్షిణ కొరియా వద్ద డీజిల్‌తో నడిచే పురాతనమైన జలాంతర్గాములు ఉన్నాయని, వాటి స్థానంలో పెన్సిల్వేనియాలోని ఫిలడెల్ఫియాలో కొత్త అణు జలాంతర్గామి నిర్మాణం జరుగుతుందని చెప్పారు. అక్కడ దక్షిణ కొరియాకు చెందిన హన్వా సంస్థ ఓ నౌకాశ్రయాన్ని నిర్వహిస్తోంది.

ఇతర దేశాలు అణ్వాయుధ పరీక్షల కార్యక్రమాలు నిర్వహిస్తున్నందునే వాటిని తిరిగి ప్రారంభించాలని తాను ఆదేశించానని ట్రంప్ చెప్పారు. 'సమాన ప్రాతిపదికన అణ్వాయుధ పరీక్షలు ప్రారంభించాలని మా యుద్ధ (రక్షణ) శాఖను ఆదేశించా. ఈ ప్రక్రియ వెంటనే మొదలవుతుంది' అని తెలిపారు. కాగా అణు సామర్థ్యం కలిగిన క్షిపణులను పరీక్షించాలని ఆదేశించారా లేక అణు పేలుడు పరీక్షలకు ఆదేశించారా అనేది స్పష్టంగా తెలియడం లేదు. ఈ పరీక్షలను అమెరికా జాతీయ అణు భద్రతా విభాగం చేపడుతుంది.



అణ్వాయుధ పోటీ అనివార్యం ?

అంతర్జాతీయంగా, దక్షిణాసియాలో ట్రంప్ నిర్ణయం అణ్వాయుధ పోటీకి దారి తీస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. చైనా తన అణు వార్‌హెడ్ నిల్వలను వేగంగా పెంచుకుంటోంది. ఇటీవలి కాలంలో వాటి సంఖ్య 600కు చేరింది. 2023 నుంచి ఏటా వంద అణు వార్‌హెడ్లను చైనా తన అమ్ములపొదిలో చేరుస్తోందని స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ చెబుతోంది. 2030 నాటికి బీజింగ్ వద్ద వెయ్యి వార్‌హెడ్లు ఉంటాయని అమెరికా రక్షణ శాఖ అంచనా. రష్యా వద్ద 5,459 అణు వార్‌హెడ్లు ఉన్నాయని సెంటర్ ఫర్ ఆర్మ్స్ కంట్రోల్ అండ్ నాన్-ప్రొలిఫరేషన్ (సిఎసిఎన్‌పి) అంచనా వేసింది. వీటిలో ఇప్పటికే 1,600 వార్‌హెడ్లను క్రియాశీలకంగా మోహరించింది. అమెరికా వద్ద 5,550 అణు వార్‌హెడ్లు ఉన్నాయని కూడా సిఎసిఎన్‌పి తెలిపింది. వీటిలో 3,800 క్రియాశీలకంగా ఉన్నాయి. 1960వ దశకం మధ్యలో రెండో ప్రపంచ యుద్ధం తీవ్రంగా సాగుతున్న సమయంలో అమెరికా వద్ద 31 వేలకు పైగా వార్‌హెడ్లు ఉన్నాయి. 1991లో సోవియట్ యూనియన్ పతనం కావడంతో అప్పటి రిపబ్లికన్ అధ్యక్షులు జార్జ్ హెచ్‌డబ్ల్యూ బుష్ అణ్వాయుధాలపై మారటోరియం విధించారు. అమెరికా చిట్టచివరి సారిగా 1992లో అణు పరీక్ష జరిపింది. 1996 తర్వాత కేవలం మూడు దేశాలు మాత్రమే అణు పరీక్షలు నిర్వహించాయి. ఆ ఏడాదే అణు పరీక్షల సమగ్ర నిషేధ ఒప్పందంపై వివిధ దేశాలు సంతకాలు చేయడం మొదలైంది. 1998లో భారత్ ఒకసారి, అదే సంవత్సరం పాకిస్తాన్ రెండుసార్లు, ఉత్తర కొరియా ఐదుసార్లు అణు పరీక్షలు నిర్వహించాయి. తాజాగా దక్షిణ కొరియాను అణు జలాంతర్గాముల నిర్మాణానికి ట్రంప్ అనుమతించడంతో అణ్వాయుధాలను కలిగిన అమెరికా, చైనా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, భారత్ వంటి దేశాల సరసన ఆ దేశం కూడా చేరుతుంది.

భగ్గుమంటున్న కూరగాయల ధరలు

- టమాటా బాక్స్ రూ.1000
- కిలో మునగ కాయలు రూ.100
- మార్కెట్‌కు తగ్గిన దిగుమతులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. మొన్నటివరకూ అందుబాటులో ఉన్నా ప్రస్తుతం ఒక్కసారిగా పెరిగాయి. ప్రతి కూరలోనూ రుచి కోసం వినియోగించే టమాటా 25 కిలోలు బాక్స్ రూ.1000 ధర పలుకుతోంది. అంటే హోల్‌సేల్‌గా కిలో రూ.40 కాగా, చిల్లరగా కిలో ధర రూ.50 పలుకుతోంది. మార్కెట్ నుంచి టమాటా బహిరంగ మార్కెట్‌లోకి, గ్రామాల్లో వీధుల్లోకి వచ్చిన తర్వాత రూ.60లకు పైగానే ధర ఉంది. తూర్పుగోదావరి జిల్లాలో మొంథా తుపాను కారణంగా 171 ఎకరాల్లో కూరగాయల పంటలు నష్టం జరిగిందని అధికారుల ప్రాథమికంగా అంచనా వేశారు.



టమాటా సాగు చాలా తక్కువ కావడంతో, మార్కెట్‌లోని వ్యాపారులు అనంతపురం, చిత్తూరు, మదనపల్లి, కర్నూలు, డోన్, కర్ణాటకలోని చంతామణి, కోలారు తదితర ప్రాంతాలు నుంచి దిగుమతి చేసుకుంటారు. అక్కడ కూడా పంట నష్టం జరగడం, మరోవైపు కార్తీక మాసం నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కూరగాయలకు డిమాండ్ పెరిగింది. అయితే, ఇటీవల దిగుబడి తగ్గింది. గతంలో రోజుకు 1200 బాక్స్‌లు మార్కెట్‌కు రాగా, వారం రోజుల నుంచి 800 బాక్స్‌లు మాత్రమే వస్తున్నాయి. వారం రోజుల క్రితం బాక్స్ ధర రూ.500 ఉండగా, ప్రస్తుతం రెట్టింపు పలుకుతోంది. మునగకాడలు స్థానికంగా దిగుబడి లేకపోవడంతో చెన్నై నుంచి వస్తున్నాయి. కిలో మునగ వంద రూపాయలు ధర పలుకుతోంది. అవి కూడా మార్కెట్‌లో లభించడం లేదు. అయ్యప్ప, ఇతర మాలధారులకు వివిధ దేవాలయాల్లో అన్నదాన కార్యక్రమాలు పెరగడంతో కూరగాయ లకు మరింత డిమాండు పెరిగింది. జిల్లాలో వరి పంటలతో పాటు కూరగాయల సాగుపై అధిక శాతంగా రైతుల ఆధారపడి జీవిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 17,500 ఎకరాల నుంచి 30,000 ఎకరాల వరకు సీజన్ ఆధారంగా కూరగాయల సాగు జరుగుతుంది. వర్షాలకు పంట దెబ్బతినడంతో ప్రస్తుతం టమోటాకు డిమాండ్ పెరిగింది. చిక్కుడు కిలో రూ.60కు లభించేది. రూ.80కి పెరిగింది. గోరు చిక్కుడు ధర కిలో రూ.25 నుంచి రూ.60కు, వంకాయ కిలో రూ.30 నుంచి రూ.70, కాకరకాయ కిలో రూ.35 నుంచి రూ.50, బెండకాయ కిలో రూ.30 నుంచి రూ.40, బీరకాయ కిలో రూ.40 నుంచి రూ.70, బీన్స్ కిలో రూ.40 నుంచి రూ.60, క్యాప్సికం రూ.40 నుంచి రూ.60, క్యాబేజీ పువ్వు రూ.20 నుంచి రూ.30, పూదీన రూ.30 నుంచి రూ.80, కొత్తిమీర రూ.20 నుంచి రూ.30, మునగకాడలు ఒక్కటి రూ.5 నుంచి రూ.15, క్యారెట్ రూ.30 నుంచి రూ.50లకు పెరిగింది. బంగాళదుంపలు కిలో రూ.30 నుంచి రూ.40కు చేరాయి. పెరిగిన ధరలు కొనుగోలుదారులకు చమటలు పట్టిస్తున్నాయి.

లక్షల్లో పేరుకుపోతున్న 'ఎగ్జిక్యూషన్' పిటిషన్లు

- దావాలో గెలిచినా తీర్పు అమలులో తీవ్ర జాప్యం
- న్యాయం కోసం దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న డిక్రీ హోల్డర్లు

న్యూఢిల్లీ : కోర్టులు జారీ చేసిన ఆదేశాల అమలు కోసం దాఖలైన లక్షలాది ఎగ్జిక్యూషన్ పిటిషన్లు దేశంలోని వివిధ న్యాయస్థానాల్లో పేరుకుపోతున్నాయి. తీర్పులు, ఆదేశాల అమలులో జరుగుతున్న తీవ్రమైన జాప్యాన్ని న్యాయస్థానాల దృష్టికి తెచ్చి వాటిని సత్వరమే అమలు చేసేలా చూడాలంటూ ఎగ్జిక్యూషన్ పిటిషన్లు దాఖలు చేస్తుంటారు. వీటినే మినీ సివిల్ దావాలు అంటారు. ఇలాంటి 8.82 లక్షల పిటిషన్లు దశాబ్దాల తరబడి జిల్లా కోర్టుల వద్ద పెండింగులో ఉంటున్నాయి.

మహారాష్ట్రలో అత్యధికం

ఎగ్జిక్యూషన్ పిటిషన్లలో 39 శాతం ఒక్క మహారాష్ట్రలోనే పెండింగులో ఉండడం గమనార్హం. అంటే ఆ రాష్ట్రంలో 3,41,000 పిటిషన్లు తుది తీర్పు కోసం వేచి ఉన్నాయన్న మాట. దేశంలో మొత్తం పెండింగులో ఉన్న ఈ తరహా పిటిషన్లలో మూడింట రెండు వంతులు తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందినవే. తమిళనాడులో 86,148, కేరళలో 82,997, ఆంధ్రప్రదేశ్‌లో 68,137, మధ్యప్రదేశ్‌లో 52,218 ఎగ్జిక్యూషన్ పిటిషన్లు తుది ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నాయి. సివిల్ కేసుల్లో కోర్టు డిక్రీల అమలులో జరుగుతున్న తీవ్ర జాప్యాన్ని నివారించాలని భావించిన సుప్రీంకోర్టు...ఎగ్జిక్యూషన్ పిటిషన్లను ఆరు నెలల్లోగా పరిష్కరించేందుకు అవసరమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా దేశంలోని అన్ని హైకోర్టులకూ ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. దేశంలోని వివిధ జిల్లా కోర్టుల్లో ఎనిమిది లక్షలకు పైగా ఎగ్జిక్యూషన్ పిటిషన్లు పెండింగులో ఉన్నాయని తనకు నివేదించడంతో సుప్రీంకోర్టు ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. సివిల్ దావాల్లో చివరి అంకం ఎగ్జిక్యూషన్ పిటిషన్లే. కోర్టు ఆదేశాలను అమలు చేసేలా ఎదుటి పక్షంపై ఒత్తిడి తేవడానికి డిక్రీ పొందిన వారు ఈ పిటిషన్లు దాఖలు చేస్తుంటారు. ఈ తరహా పిటిషన్లలో సొమ్ము రికవరీ, ఆస్తి స్వాధీనానికి సంబంధించినవి ఎక్కువగా ఉంటాయి. కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో కేసులో ఓడిన వారు విఫలమైనప్పుడు డిక్రీ హోల్డర్లు ఈ పిటిషన్లు వేస్తారు. ఎగ్జిక్యూషన్ పిటిషన్ల పరిష్కారంలో జరుగుతున్న తీవ్ర జాప్యంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. జ్యుడీషియల్ ఆదేశాల అమలులో విఫలమైతే కోర్టు డిక్రీలకు అర్థం లేకుండా పోతుందని వ్యాఖ్యానించింది. కేసు గెలిచిన తర్వాత కూడా ఆ ఆదేశాల అమలు కోసం డిక్రీ హోల్డర్లు దశాబ్దాల పాటు ఎదురు చూడాల్సి వస్తోంది. సివిల్ దావాలో కోర్టు ఇచ్చిన డిక్రీని కేసు ఓడిన వారు అమలు చేయడం చాలా అరుదుగా జరుగుతుందని ట్రయల్ కోర్టుల్లో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదులు తెలిపారు. ఎందుకంటే కేసు గెలిచిన వారు వేసే ఎగ్జిక్యూషన్ పిటిషన్ మినీ సివిల్ దావాతో సమానం. దాని విచారణకు ఏళ్లూ పూళ్లూ పడుతుంది. ఎగ్జిక్యూషన్ పిటిషన్ల విచారణలో జరుగుతున్న జాప్యాన్ని సుప్రీంకోర్టు గతంలో పలు సందర్భాలలో వేలెత్తి చూపింది.

భారత ఉద్యోగులకు ట్రంప్ మరో షాక్

- వర్క్ పర్మిట్ ఆటోమేటిక్ రెన్యువల్ రద్దు

వైట్‌హౌస్: అమెరికాలో వలసదారుల పని అనుమతులను (ఎంప్లాయిమెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్ - ఇఎడి) ఆటోమేటిక్‌గా రెన్యువల్ చేసే విధానానికి అక్కడి డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ముగింపు పలికింది. అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. దీంతో భారతీయులతో పాటు వేలాది మంది విదేశీయులూ ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదంలో పడ్డారు. 2025 అక్టోబర్ 30 లేదా ఆ తర్వాత నుంచి వర్క్ పర్మిట్ రెన్యువల్ కోసం దరఖాస్తు చేసే వలసదారులకు ఇకపై ఆటోమేటిక్ రెన్యువల్ ఉండదని సెక్యూరిటీ విభాగం స్పష్టం చేసింది. అమెరికాలో ఐటి, హెల్త్‌కేర్, రీసెర్చ్ రంగాల్లో పని చేస్తున్న భారతీయులు ఈ కొత్త నిర్ణయంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇఎడి అనేది అమెరికా ప్రభుత్వం జారీ చేసే అధికారిక పత్రం. ఇది ఉన్నవారికి మాత్రమే అమెరికాలో చట్టబద్ధంగా పనిచేసే హక్కు ఉంటుంది. ఈ పత్రం గడువు ముగిసిన తర్వాత ఉద్యోగం కొనసాగించాలంటే తప్పనిసరిగా రెన్యువల్ చేయాలి. గ్రీన్‌కార్డ్‌తో శాశ్వత నివాసం పొందిన వారు ఈ పత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. అలాగే హెచ్-1బి, ఎల్-1బి, ఒ, పి వంటి వీసాలతో ఉన్న నాన్ ఇమిగ్రెంట్ ఉద్యోగులు కూడా వేరుగా ఈఏడీ కోసం దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. కానీ గ్రీన్‌కార్డ్ పెండింగ్‌లో ఉన్నవారు, వారి జీవిత భాగస్వాములు, పిల్లలు, అలాగే ఎఫ్-1, ఎం-1 వీసాలతో చదువుకునే విద్యార్థులు లేదా డిపెండెంట్ వీసాతో ఉన్నవారు అమెరికాలో పని చేయాలనుకుంటే తప్పనిసరిగా ఇఎడి తీసుకోవాలి.

గనుల శాఖలో కదలని ఫైళ్లు!

- ఎఫ్ఎసి అప్పగింతకు ససేమిరా
- 3 నెలలుగా ఉద్యోగులకు జీతాలు నిలిపివేత

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప జిల్లా గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్ (డిడి) కార్యాలయ కార్యకలాపాలు స్తంభించిపోయాయి. ప్రభుత్వానికి అధిక ఆదాయాన్ని సమ కూర్చడంలో మైన్స్, రిజిస్ట్రేషన్, ఎక్సైజ్ శాఖలు ప్రధాన పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. కీలకశాఖల్లో గనులశాఖ ఒకటి. గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకట సాయి మూడు నెలల కిందట విఆర్ఎస్ కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసు కున్నారు. ప్రభుత్వ ఆమోదానికి కృషి చేస్తూ డిప్యూటీ డైరెక్టర్ విధులకు గైహాజ్రైనట్లు విశ్వసనీయ సమాచారం. జిల్లా మైనింగ్ డిపార్టుమెంట్‌లో ఫైళ్ల క్లియరెన్స్ పేరుకుపోయింది. రాష్ట్రంలోనే ప్రముఖ ఇంజినీరింగ్ సంస్థలకు చెందిన హైవే పర్మింట్లు, తాత్కాలిక, ఇతర కంపెనీలకు సంబంధించిన పలు అనుమతులు మంజూరు ప్రక్రియ నిలిచిపోయాయి. మైనింగ్ కార్యాలయ అధికా రుల కీలక బాధ్యత తనిఖీలు చేయడం. జిల్లాలో లభించే కీలక ఖనిజాలైన ఐరన్‌ఓర్, బెరైటీస్, ఇసుక, మట్టి అక్రమ రవాణా కార్యకలాపాల నిరోధానికి సంబంధించిన తనిఖీల ప్రక్రియ సైతం ఆగిపోయినట్లు తెలుస్తోంది. మైనింగ్ డిపార్టుమెంట్ క్రియాశూన్యత అక్రమార్కులకు వరంగా మారినట్లు తెలుస్తోంది. ఫలితంగా మైనింగ్‌శాఖ ద్వారా లభించే ప్రభుత్వ ఆదాయం సైతం గణనీయంగా పడిపోయియాయి. మైనింగ్ డిడి లేకపోవడంతో మూడు నెలలుగా 12 నుంచి 15 మంది ఉద్యోగులు జీతాలకు నోచుకోవడం లేదు. టెక్నికల్ స్టాఫ్, మినీస్టీరియల్ స్టాఫ్, సర్వేయర్లు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు, మైనింగ్ కార్యాలయ ఉన్నతాధి కారులు జీతాల కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సిన దుస్థితి దాపురించింది. జీతాల మంజూరు విషయమై రాష్ట్ర మైనింగ్ డిపార్టుమెంట్‌కు చెందిన సంబంధిత సెక్షన్ల దృష్టికి తీసుకెళ్తే తీవ్ర హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. నెలల తరబడి జీతాలకు నోచని గనుల శాఖకు చెందిన ఉద్యోగులు జీవిత రథాన్ని ఎలా ముందుకెళ్తారో మైనింగ్ ఉన్నతాధికారులు ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లాలో మైనింగ్ కార్యకలాపాలు స్తంభించిన నేప థ్యంలో కలెక్టర్ గానీ, గనుల శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు గానీ పట్టించుకోవడం లేదనే విమర్శలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. ప్రభుత్వానికి గణనీయమైన ఆదాయాన్ని సమకూర్చి పెట్టే గనులశాఖలోని సీనియర్ అధికారులకు ఫుల్ అడిషనల్ (ఎఫ్ఎసి) బాధ్యతలను అప్పగించకుండా మీనమేషాలు లెక్కించడంలోని ఆంతర్యమేమిటో తెలియడం లేదనే వాదన వినిపిస్తోంది.

ముగ్గురు గంజాయి విక్రేతలు అరెస్టు

ప్రజాశక్తి-ములకలచెరువు

ముగ్గరు గంజాయి నింధితులను అరెస్టు చేసి వారి నుంచి 2 కేజీల గంజాయి, మూడు స్మార్ట్‌ఫోన్లు, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు సిఐ వెంకటేశులుతెలిపారు. సర్కిల్ పరిధిలోని పెద్దతిప్పసముద్రం పెట్రోల్ బంక్ సమీపంలో ముగ్గరు యువకులు గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందినట్లు చెప్పారు.పిటిఎం ఎస్ఐ హరిహరప్రసాద్ సిబ్బందితో దాడులు నిర్వహించి ముగ్గరిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. కురబలకోట మండలం మట్టివారిపల్లెకు చెందిన రాజోళ్ల హరీష్, మదనపల్లెకు చెందిన ఫరూక్, మదనపల్లెకు చెందిన మరో బాలుడిని గుర్తించామన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి, నింది తులను ములకలచెరువు సర్కిల్ కార్యాలయంలో అరెస్టు చూపించారు. కార్యక్ర మంలో ఎస్ఐ నరసింహుడు, రమణ. శిరాజ్ ఉన్నారు.

రూట్ మార్చారని బీమా నిరాకరించరాదు

- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : పరిహారం చెల్లింపు విషయంలో బీమా కంపెనీలకు సంబంధించి సుప్రీంకోర్టు గురువారం కీలక వ్యాఖ్యలు చేసింది. రూట్ పర్మిట్ ఉల్లంఘన వంటి సాంకేతిక కారణాలు చెప్పి బాధితుడికి పరిహారం నిరాకరించడం సరికాదని జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఓ ప్రమాదంలో బాధితుడి తప్పిదం లేదని.. అలాంటప్పుడు అతడికి పరిహారం చెల్లించాల్సిందేనని స్పష్టం చేసింది. అంతేకాదు సంబంధిత పరిహారాన్ని వాహన యజమాని నుంచి రికవరీ చేసుకోవచ్చని గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు సమర్థనీయమని పేర్కొంది. కేసు పూర్వాపరాలు ఇలా ఉన్నాయి..

కర్ణాటకలో అక్టోబర్ 7, 2014లో వేగంగా వచ్చిన ఓ బస్సు బైక్‌ను ఢీకొట్టింది. ఆ ప్రమాదంలో బైక్‌పై ఉన్న వ్యక్తి స్పాట్‌లోనే చనిపోయాడు. ఈ కేసులో బాధితుడికి వడ్డీతో కలిపి రూ.18.86లక్షల పరిహారం ఇవ్వాలని మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చింది. ఈ పరిహారం సరిగ్గా లెక్కించలేదని పిటిషనర్, మరోవైపు ప్రమాదానికి కారణమైన వాహనం రూట్ పర్మిట్‌ను ఉల్లంఘించిందని బీమా కంపెనీ ఆరోపిస్తూ అక్కడి హైకోర్టును ఆశ్రయించాయి. విచారించిన హైకోర్టు బాధితుడికి పరిహారం చెల్లించాల్సిందేనని బీమా సంస్థకు స్పష్టం చేసింది. అయితే, దానిని వాహన యజమాని నుంచి రికవరీ చేసుకునేందుకు అనుమతిచ్చింది. దీనిని సవాలు చేస్తూ బీమా సంస్థ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. మరోవైపు రికవరీకి వీలు కల్పించడాన్ని సవాలు చేస్తూ వాహన యాజమాని కూడా సుప్రీంకు వెళ్లారు. విచారించిన జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ రెండు అప్పీళ్లను తోసిపుచ్చింది. సాంకేతిక కారణాలు చెప్పి బాధితుడికి పరిహారం నిరాకరించడం సరికాదని, అది సహజ న్యాయ భావనకు విరుద్ధమని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో బాధితుడికి పరిహారం చెల్లించాలని, దాన్ని యజమాని నుంచి రికవరీ చేసుకోవడం సమర్థనీయమేనని పేర్కొంది.

పిఎంజిఎస్‌వై కింద రూ.150 కోట్లు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన (పిఎంజిఎస్‌వై) కింద ఆంధ్రప్రదేశ్‌కు రూ.150 కోట్లు విడుదల అయింది. ఈ మేరకు గురువారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రకటన విడుదల చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం సాయంలో మొదటి విడుత కింద ఈ మొత్తం విడుదల చేసినట్లు తెలిపింది. దీనిలో పిఎంజిఎస్‌వై అమలుకు రూ.146.625 కోట్లు, పరిపాలన విభాగం ఖర్చులకు రూ.3.375 కోట్లు ఖర్చు చేస్తారు.

చాబహార్ పోర్ట్‌పై ఆంక్షలు వాయిదా

చాబహార్ : ఇరాన్‌లోని చాబహార్ పోర్టు విషయంలో భారత్‌కు స్వల్ప ఊరట లభించింది. ఈ పోర్టుపై ఆరు నెలల వరకు అమెరికా ఆంక్షల నుంచి మినహాయింపు లభించిందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు. ఇటీవల రష్యా చమురు కొనుగోళ్లపై అమెరికా విధించిన ఆంక్షల ప్రభావంపైనా అధ్యయనం చేస్తున్నామని పేర్కొన్నారు. 140 కోట్ల మంది భారతీయుల ఇంధన భద్రతే లక్ష్యంగా తమ నిర్ణయం ఉంటుందని వివరించారు.

తుపాను బాధితులను ఆదుకోండి

(మొదటి పేజీ తరువాయి)

50 కిలోలు, కుటుంబ సభ్యుల సంఖ్యతో నిమిత్తం లేకుండా రూ.5 వేలు చొప్పున అదనంగా అందించాలని కోరారు. తక్షణ జీవనాన్ని పునరుద్ధరించేందుకు వీలుగా రోడ్లు, వంతెనలు, విద్యుత్‌లైన్ల మరమ్మతులు చేయించాలని, డ్రైనేజి రిపేర్లు చేపట్టాలని, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ విపత్తు సమయంలో కేంద్రం రాష్ట్రానికి తోడ్పడాలని, సాధారణంగా ఇచ్చే సాయంతో నిమిత్తం లేకుండా రూ.5 వేలు తక్షణం మంజూరు చేయాలని డిమాండు చేశారు. కేంద్రం నుండి ప్రత్యేక సహాయం సాధించేందుకు అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని పంపాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ హక్కును కాపాడుకుందాం

- డిస్కామ్‌ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐక్య కార్యాచరణ
- విద్యుత్ ఉద్యోగుల సమాఖ్య పిలుపు



న్యూఢిల్లీ : విద్యుత్ సవరణ బిల్లు-2025ను, అన్ని ప్రైవేటీకరణ చర్యలను రద్దు చేయాలని, ఎలాంటి ప్రైవేటీకరణ షరతులు లేకుండా సుస్థిర కార్యకలాపాల కోసం డిస్కామ్‌లకు ఆర్థిక సాయాన్ని అందచేయాలని భారత విద్యుత్ ఉద్యోగుల సమాఖ్య (ఇఇఎఫ్ఐ) డిమాండ్ చేసింది. డిస్కామ్‌లపై భారాన్ని తగ్గించేందుకు ఉత్పత్తి వ్యయాన్ని, విద్యుత్ ఖర్చులలో మార్కెట్ ఆధారిత ఒడిదుడుకులను నియంత్రించాలని సమాఖ్య కోరింది. క్రాస్ సబ్సిడీలను కాపాడాలని, రైతులు సహా అందరికీ విద్యుత్‌ను అందించడం ప్రాథమిక హక్కుగా గుర్తించాలని కోరింది. ఇందుకోసం మొత్తంగా విద్యుత్ రంగాన్ని కాపాడుకోవడానికి ఐక్య కార్యాచరణకు దిగాలని పిలుపిచ్చింది. ప్రైవేటీకరణకు కట్టబెట్టే కుట్రలో భాగంగా రుణాల ఊబిలో చిక్కుకున్న విద్యుత్ పంపిణీ కంపెనీలు (డిస్కామ్‌లు)కు లక్ష కోట్ల డాలర్ల బెయిల్ అవుట్ ప్యాకేజీని విధించాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రణాళికను తీవ్రంగా ఖండించింది. ఈ ప్యాకేజీ కింద రాష్ట్రాలు ప్రైవేటు కంపెనీలకు నియంత్రణను అప్పగించాల్సి వుంటుంది లేదా డిస్కామ్‌లను స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో లిస్ట్ చేయాల్సి వుంటుంది. దీంతో మొత్తంగా ప్రభుత్వ విద్యుత్ వ్యవస్థను ధ్వంసం చేసేందుకు ప్రధాని నరేంద్ర మోడీ తీసుకుంటున్న అత్యంత దురాక్రమణ చర్య ఇదని విమర్శించింది. విద్యుత్ రంగాన్ని దశాబ్దాల కాలంగా ప్రైవేటీకరణ వైపు నెట్టే ప్రక్రియలో ఈ బెయిలవుట్ తాజా చర్య. 1990వ దశకం ప్రారంభం నుండి నయా ఉదారవాద రాజకీయాల్లో ఈ అంశం పాతుకుపోయింది. ఒకే ఏరియాలో అనేక ప్రైవేటు సంస్థలు పనిచేయడానికి విద్యుత్ సవరణ బిల్లు-2025 అనుమతిస్తుంది. గ్రామీణ, తక్కువ ఆదాయ కుటుంబాలను ప్రభుత్వ డిస్కామ్‌లకు వదిలిపెట్టి పట్టణ ప్రాంతాల్లోని, సంపన్న వినియోగదారులను ఎంచుకోవడానికి ఆ సంస్థలకు వెసులుబాటు కల్పిస్తుంది. దీనివల్ల విద్యుత్ బిల్లులు పెరుగుతాయి. అసమానతలు మరింత విస్తృతమవుతాయి. పునర్వ్యవస్థీకరించిన పంపిణీ రంగ పథకం (ఆర్‌డిఎస్ఎస్) కింద రూ.3.03 లక్షల కోట్ల నిధులను ఇస్తూ, అదనపు రుణ పరిమితులు (జిఎస్‌డిపిలో 0.5శాతం వరకు)ను అందచేయడం ద్వారా ప్రైవేటీకరణ కోసం రాష్ట్రాలపై కేంద్రం ఒత్తిడి తెస్తోంది. ఆ నిధుల కోసం రాష్ట్రాలు తమ విద్యుత్ సంస్థలను అమ్ముకోవాల్సిన పరిస్థితిని రుద్దుతున్నారు.

ప్రైవేటీకరణ పదే పదే విఫలమవుతూ వచ్చింది. గత 22 సంవత్సరాలుగా ఈ సంస్కరణల ప్రక్రియ నడుస్తూ వస్తోందని ముసాయిదా విద్యుత్ సవరణ బిల్లు, 2025 పీఠికలో కేంద్ర ప్రభుత్వమే స్వయంగా అంగీకరించింది. కానీ డిస్కామ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలకు ఎలాంటి పరిష్కారాలు కనుగొనడంలో విఫలమయ్యామని తెలిపింది.

ఢిల్లీలో ప్రైవేటు సంస్థలు విద్యుత్ బిల్లులను ఏటా 15 నుండి 20శాతం పెంచుతుండడంతో 2002లో కిలో వాట్‌కు రూ3.5 వుండే టారిఫ్ 2024 నాటికి రూ.7.5కి పెరిగింది. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందచేయాలన్న హామీని నెరవేర్చేందుకు ఢిల్లీ ప్రభుత్వం వేల కోట్ల రూపాయిలను సబ్సిడీల రూపంలో పోసింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే ఏకంగా రూ.3250కోట్ల మేరకు సబ్సిడీలు ఇచ్చింది. దీనివల్ల ప్రైవేటు డిస్కామ్‌లు లబ్ది పొందాయి. ఇందుకోసం ఆరోగ్య సంరక్షణ, విద్య వంటి ఇతర సంక్షేమ రంగాల నిధులను ఇటువైపునకు మళ్లించాల్సి వచ్చింది.

ఒరిస్సాలోకూడా 1999లో తీసుకువచ్చిన ప్రైవేటీకరణ చర్యలు 25 నుండి 30శాతం మేరా టారిఫ్‌లు పెరగడానికి దారి తీశాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో చీకటి రాత్రుళ్ళు నిత్యకృత్యమయ్యాయి. ప్రైవేటు సంస్థలు విఫలమవడంతో రూ.7వేల కోట్ల బెయిల్ అవుట్ ఇవ్వాల్సి వచ్చింది.

కేంద్ర పాలిత ప్రాంతాల్లో డిస్కామ్‌ల ప్రైవేటీకరణ ప్రభుత్వం తప్పనిసరి చేసింది. చండీఘడ్‌లో ఏటా రూ.250కోట్ల లాభాలతో నడుస్తున్న సంస్థను బలవంతంగా ఈఏడాది ఫిబ్రవరిలో ప్రైవేటీకరించారు. జమ్మూకాశ్మీర్, పుదుచ్చేరి, ఇతరప్రాంతాల్లో ఇలాంటి చర్యలు కొనసాగుతున్నాయి. ప్రజలు ఎంతగా నిరసించినా ఇవి ఆగడం లేదు. యుపిలో డిస్కామ్‌ల ప్రైవేటీకరణకు జరిగిన ప్రయత్నాలకు ఎన్‌సిసిఓఇఇ నేతృత్వంలో కార్మికుల నుండి పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. దాంతో ఈ విక్రయాలకు బ్రేక్ పడింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ముక్తకంఠంతో మూకుమ్మడిగా ప్రతిఘటించాలని ఇఇఎఫ్ఐ పిలుపిచ్చింది.

కేరళలో సంక్షేమ సంబరాలు


ఎల్‌డిఎఫ్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ మహిళల ర్యాలీ

తిరువనంతపురం : కేరళలో వామపక్ష ప్రజాతంత్ర ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం తీసుకున్న సంక్షేమ నిర్ణయాల పట్ల ఆ రాష్ట్ర మహిళలు, యువత హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తోంది. రాష్ట్రంలో 35 - 60 ఏళ్ల మధ్య వయస్సున్న పేద మహిళలకు, యువకులకు నెలకు రూ.1000 ఆర్థిక సాయం అందజేస్తామని ముఖ్యమంత్రి పినరయి విజయన్ నేతృత్వంలో బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ నిర్ణయాలన్నీ నవంబరు 1 నుంచి అమలు కానున్నాయి. దీంతో పాటు రాష్ట్ర ప్రజల సంక్షేమానికి అనేక నిర్ణయాలను ప్రకటించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా గురువారం నాడు అనేక ప్రాంతాల్లో సంక్షేమ సంబరాలు జరుపుకున్నారు. ర్యాలీలు నిర్వహించారు. కాగా కేరళ ప్రభుత్వ విధానాలను, ప్రజా సంక్షేమానికి ప్రకటించిన తాజా నిర్ణయాలను అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) ఒక ప్రకటనలో స్వాగతించింది. ముఖ్యంగా రబ్బరు, వరి రైతులకు ప్రోత్సాహకాలు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేసింది.

జిన్‌పింగ్‌తో ట్రంప్ భేటీ

- సుంకాలను తగ్గించిన అమెరికా
- పలు అంశాలపై కుదిరిన ఒప్పందం
- చైనా నుంచి అమెరికాకు రేర్ ఎర్త్స్ ఎగుమతులు
- సోయాబీన్‌ను కొనుగోలు చేసేందుకు బీజింగ్ అంగీకారం

బుసాన్ (దక్షిణ కొరియా) : అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ దక్షిణ కొరియాలోని బుసాన్‌లో చైనా అధ్యక్షులు జి జిన్‌పింగ్‌తో గురువారం సమావేశమయ్యారు. ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకార (అపెక్) సదస్సుకు హాజరైన ఇరువురు నేతలు తమ ద్వైపాక్షిక సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశాన్ని 'అద్భుతమైన విజయం'గా ట్రంప్ అభివర్ణించారు. జిన్‌పింగ్ ఓ శక్తివంతమైన దేశానికి బ్రహ్మాండమైన నాయకుడని కొనియాడారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో చైనాలో పర్యటిస్తానని చెప్పారు. ఈ సమావేశం సందర్భంగా చైనా నుంచి అమెరికాకు రేర్ ఎర్త్స్ ఎగుమతులపై ఏడాది కాలానికి సంబంధించి ఒప్పందం కుదిరింది. అమెరికా నుంచి సోయాబీన్‌ను తక్షణమే కొనుగోలు చేసేందుకు చైనా అంగీకరించింది. అదే విధంగా ఫెంటానిల్ సంబంధమైన సుంకాలను తగ్గించే విషయంపై కూడా అంగీకారం కుదిరింది. ఫెంటానిల్ తయారీకి ఉపయోగించే రసాయనాలను చైనా విక్రయిస్తున్నందుకు అమెరికా ఈ ఏడాది ప్రారంభంలో 20 శాతం సుంకాన్ని విధించింది. ఇప్పుడు దానిని 10 శాతానికి తగ్గించడానికి ట్రంప్ అంగీకరించారు. దీంతో చైనాపై విధించిన మొత్తం సుంకాల రేటు 57 శాతం నుంచి 47 శాతానికి తగ్గుతుంది.


బుసాన్‌లో సమావేశం సందర్భంగా కరచాలనం చేసుకుంటున్న ట్రంప్, జిన్‌పింగ్

త్వరలోనే వాణిజ్య ఒప్పందం : ట్రంప్

జిన్‌పింగ్‌తో సమావేశం ముగిసిన తర్వాత ట్రంప్ ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో వాషింగ్టన్ బయలుదేరారు. విమానంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ చైనాపై విధించిన సుంకాలను తగ్గిస్తానని తెలిపారు. సమావేశానికి మీ రేటింగ్ ఎంత అని విలేకరులు ప్రశ్నించగా 'సున్నా నుంచి పది వరకూ ఉండే స్కేలులో పది ఉత్తమమైనది. అయితే జిన్‌పింగ్‌తో జరిపిన సమావేశానికి నేను 12 రేటింగ్ ఇస్తాను' అని చెప్పారు. ఏప్రిల్‌లో తాను చైనా వెళతానని, కొంతకాలం తర్వాత జిన్‌పింగ్ అమెరికా వస్తారని అన్నారు. చైనాకు మరిన్ని అధునాతన కంప్యూటర్ చిప్‌లను ఎగుమతి చేసే విషయంపై కూడా తాము చర్చించామని తెలిపారు. త్వరలోనే చైనాతో వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేసే అవకాశం ఉన్నదని చెప్పారు. ఈ ఒప్పందం విషయంలో రెండు దేశాల మధ్య పెద్దగా అడ్డంకులు లేవని అన్నారు. ఇంధన ఒప్పందంపై రెండు దేశాల అధికారులు త్వరలోనే సమావేశమై చర్చలు జరుపుతారని తెలిపారు. అమెరికా నుంచి ఇంధనాన్ని కొనుగోలు చేసేందుకు చైనా అంగీకరించిందని చెప్పారు. రేర్ ఎర్త్స్ అంశం పరిష్కారం అయిందని, చైనా నుంచి వీటి ఎగుమతులకు ఇక ఎలాంటి అవరోధాలు ఉండవని అన్నారు. ఫెంటానిల్ రవాణాను ఆపేందుకు కృషి చేస్తానని జిన్‌పింగ్ హామీ ఇచ్చారని తెలిపారు. అనేక అంశాలను తాము ముగింపు దశకు తీసుకొచ్చామని వ్యాఖ్యానించారు. సమావేశం ప్రారంభం కావడానికి ముందు ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో ఓ పోస్ట్ పెట్టారు. ఈ సమావేశం జీ2 అవుతుందని, అది ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలుగా అమెరికా, చైనా దేశాలను గుర్తిస్తుందని తెలిపారు.

ఆర్థిక, వాణిజ్య అంశాలపై ఏకాభిప్రాయం : జిన్‌పింగ్

సమావేశం ప్రారంభానికి ముందు జిన్‌పింగ్ మాట్లాడుతూ రెండు దేశాల మధ్య విభేదాలు ఉన్నప్పటికీ కలిసి పనిచేసేందుకు సిద్ధమేనని తెలిపారు. 'రెండు దేశాలలో పరిస్థితులు భిన్నంగా ఉంటాయి. ప్రపంచంలోని రెండు ప్రధాన ఆర్థిక వ్యవస్థలు పరస్పరం అప్పుడప్పుడు ఘర్షణ పడడం సహజమే' అని ఓ అనువాదకుడి ద్వారా ఆయన చెప్పారు. ఆర్థిక, వాణిజ్య అంశాలపై ఏకాభిప్రాయం కుదిరిందని జిన్‌పింగ్‌ను ఉటంకిస్తూ చైనా అధికార వార్తా సంస్థ సిన్హువా తెలియజేసింది. 'రెండు దేశాలకూ చెందిన ఆర్థిక, వాణిజ్య బృందాలు కీలకమైన అంశాలపై అభిప్రాయాలను ఇచ్చిపుచ్చుకున్నాయి. వాటి పరిష్కారం దిశగా ఏకాభిప్రాయానికి వచ్చాయి' అని జిన్‌పింగ్ వివరించారు. రెండు బృందాలు త్వరలోనే తిరిగి సమావేశమై తదుపరి చర్చలు కొనసాగిస్తాయని చెప్పారు. కాగా ట్రంప్, జిన్‌పింగ్ మధ్య సుమారు రెండు గంటల పాటు సమావేశం కొనసాగింది. అపెక్ సదస్సు జరిగిన జియోంగ్జు నగరానికి దక్షిణంగా ఉన్న బుసాన్ ఈ భేటీకి వేదికైంది.


సికార్‌లో నిర్వహించిన ర్యాలీ

ప్రజలపై భారాలు మోపొద్దు

- రాజస్థాన్‌లో సిపిఎం భారీ నిరసన సభ

సికార్ : ప్రజా సమస్యలు పరిష్కరించకుండా..వారిపై భారాలు వేయటం తగదని సిపిఎం పోలిట్‌బ్యూరో సభ్యులు, ఎంపి అమ్రారామ్ హెచ్చరిక చేశారు. రాజస్తాన్‌లోని బిజెపి సర్కార్ స్మార్ట్ మీటర్లు, నిరుద్యోగ సమస్యలతో పాటు మరెన్నో ప్రధానమైన అంశాలపై దృష్టిపెట్టడంలేదని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర పాలకులు సమస్యలు పరిష్కరించకపోతే.. ప్రజా ఉద్యమాలు చేపడతామని అమ్రారామ్ స్పష్టం చేశారు. అంతకు ముందు సికార్ నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలంటూ బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని నినదించారు. అనంతరం బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్యాచరణ సిద్ధం చేయనున్నట్టు సిపిఎం నాయకులు ప్రకటించారు.

ముంబయిలో కలకలం

- 17 మంది చిన్నారులను బంధించిన దుండగుడు
- చాకచక్యంగా రక్షించిన పోలీసులు
- ఎన్‌కౌంటర్‌లో నిందితుడు హతం

ముంబయి : దేశ వాణిజ్య రాజధాని ముంబయి మహానగరంలో పట్టపగలే చిన్నారులను బంధించిన ఘటన గురువారం తీవ్ర కలకలం రేపింది. పోలీసులు సకాలంలో స్పందించి రెస్క్యూ ఆపరేషన్‌ను చాకచక్యంగా చేపట్టి బాలలను రక్షించారు. ఈ సందర్భంగా జరిగిన ఎదురుకాల్పుల్లో నిందితుడిని పోలీసులు మట్టుబెట్టారు. పోలీసులు, స్థానిక మీడియా కథనాల ప్రకారం..

ముంబయి పవయి ప్రాంతంలోని ఆర్ఎ యాక్టింగ్ స్టూడియోలో రోహిత్ ఆర్య అనే వ్యక్తి గత నాలుగైదు రోజులుగా ఆడిషన్స్‌ను నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం 8-14 ఏళ్ల వయసులోపు ఉన్న 100 మంది చిన్నారులు స్టూడియోకు వచ్చారు. కొంత సమయం తర్వాత చిన్నారులను బయటకు పంపించిన రోహిత్.. కొంత మందిని మాత్రం బంధించాడు. దీంతో భయాందోళనలకు గురైన పిల్లలు స్టూడియో కిటికీల నుంచి సాయం కోసం కేకలు వేశారు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారమివ్వడంతో రంగంలోకి దిగి రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు.

నిందితుడికి సర్దిచెప్పేందుకు పోలీసులు ప్రయత్నాలు చేసినప్పటికీ వారిని విడిచి పెట్టేందుకు అతడు నిరాకరించాడు. చిన్నారులకు హాని కలిగిస్తానని బెదిరించడంతో అప్రమత్తమైన రెస్క్యూ బందం.. బాత్‌రూమ్ ద్వారా లోనికి ప్రవేశించి 17 మంది చిన్నారులు సహా 19 మందిని రక్షించింది. రెస్క్యూ ఆపరేషన్ సమయంలో నిందితుడు కాల్పులు జరిపాడని, దీంతో ఎదురు కాల్పులు జరపాల్సి వచ్చిందని పోలీసులు వెల్లడించారు. తీవ్ర గాయాలైన అతడిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయినట్లు తెలిపారు. ఘటనా స్థలం నుంచి ఎయిర్‌గన్, కొన్ని రసాయనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఆత్మహత్య బదులు ప్లాన్ మార్చా : వీడియోలో నిందితుడు

ఒక వైపు పోలీసులు పిల్లను కాపాడేందుకు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తుండగా అదే సమయంలో నిందితుడు రోహిత్ ఆర్య ఒక వీడియో విడుదల చేసినట్లు తెలుస్తోంది. 'ఆత్మహత్య చేసుకుందామనుకున్నా..కానీ ఆ తర్వాత బలవన్మరణానికి బదులు మరో ప్లాన్ ఆలోచించా. అందుకే ఈ చిన్నారులందరినీ బంధించా. నేనేమీ ఉగ్రవాదిని కాదు. డబ్బులూ అక్కర్లేదు. కానీ, కొందరితో మాట్లాడాల్సివుంది. వారి నుంచి సమాధానాలు తెలుసుకోవాల్సివుంది' అని అతడు వీడియోలో పేర్కొన్నట్లు సమాచారం. దీనినిబట్టి అతడి మానసిక పరిస్థితి సరిగా లేదని ప్రాథమికంగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఉసురు తీస్తున్న ఎస్ఐఆర్, ఎన్‌సిఆర్

- బెంగాల్‌లో మరొకరి ఆత్మహత్య

కొల్‌కతా : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర పరిశీలన (ఎస్ఐఆర్), జాతీయ పౌర పట్టిక (ఎన్‌సిఆర్) పశ్చిమ బెంగాల్‌లో అమాయకుల ఉసురు తీస్తున్నాయి. ఈ సర్వేల కారణంగా తమపై బంగ్లాదేశీయులు అనే ముద్ర వేసి అక్కడికి వెళ్లగొట్టే ప్రమాదముందని తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. తాజాగా పశ్చిమ మిడ్నాపూర్‌కు చెందిన 95 ఏళ్ల వృద్ధుడు ఎస్ఐఆర్ సర్వేతో ఆందోళనకు గురై ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పశ్చిమ మిడ్నాపూర్‌కు చెందిన 95 ఏళ్ల క్షితీష్ మజుందర్ కొన్ని ఏళ్ల నుంచి బిర్భూమ్ జిల్లాలోని ఇలాంబజార్‌లో తన కుమార్తె ఇంట్లో నివసిస్తున్నారు. నవంబర్ 4 నుంచి రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభిస్తారనే విషయం తెలిసినప్పట్నించి ఆందోళనకు గురవుతున్నారు. 2002 ఓటర్ల జాబితాలో తన పేరు లేకపోవడంతో ఎస్ఐఆర్‌కు క్షితీష్ భయపడేవాడని అతని కుటుంబ సభ్యులు చెప్పారు. ఇతను తన చిన్న వయస్సులోనే బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు వచ్చారని, ఈ వయస్సులో బంగ్లాదేశ్‌కు పంపితే తన పరిస్థితి ఏమిటనే ఆందోళన చెందేవారని క్షితీష్ మనవరాలు నిర్మల చెప్పారు. కాగా, బెంగాల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రకటించిన తరువాత నుంచి ఇది మూడో ఆత్మహత్య ఘటన. మంగళవారం 57 ఏళ్ల ప్రదీప్ కర్ తన నివాసంలోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. తన డైరీలో ఆత్మహత్యకు ఎస్ఆర్‌సి (జాతీయ పౌర పట్టిక)దే బాధ్యత అని పేర్కొన్నారు. ప్రదీప్ కర్ పశ్చిమ బెంగాల్‌లోనే పుట్టి పెరిగినప్పటికీ, ఆయన తండ్రి ఆరవై ఏళ్ల క్రితం బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు వలసవచ్చారు. అలాగే, బుధవారం కూచ్ బెహార్‌లో 70 ఏళ్ల ఖైరుల్ షేక్ ఎస్ఐఆర్ భయంతోనే విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. అధికారిక పత్రాల్లో తన పేరు అక్షరక్రమం, 2002 ఓటర్ల జాబితా, ఐడిలో తన పేరు అక్షరక్రమం వేర్వేరుగా ఉండటంతో ఎస్ఐఆర్‌తో తన పేరు తొలగిస్తారని ఖైరుల్ షేక్ భయపడ్డారు. ఈ విషయాన్ని ఐసియులో ఆయన స్వయంగా వెల్లడించారు.

చెరువుల్లా పొలాలు


కాకినాడ జిల్లా పెదపూడి మండలం కైకవోలులో కుళ్లిన పంటను చూపుతున్న రైతు

(మొదటి పేజీ తరువాయి)

భారీగా చేరి పంటలు దెబ్బతిన్నాయి. ప్రధానంగా నల్లమడ వాగు పొంగి ప్రవహిస్తోంది. గత రెండు రోజుల్లో చిలకలూరిపేటలో 226 మిల్లీమీటర్లు, నాదెండ్ల 184, యడ్లపాడు 156, ప్రత్తిపాడు 145.8, పెదనందిపాడు 122, కాకుమానులో 121 మిల్లీమీటర్లు వర్షం నమోదు కావడంతో ఈ మండలాల్లోని లక్ష ఎకరాల్లో వరి పైర్లు నీట మునిగాయి. పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. నల్లమడ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కొండపాటూరు, అప్పాపురం గ్రామాల మధ్య గండిపడి సమీపంలోని వెయ్యి ఎకరాలకు వరి పంట నీట మునిగింది. పెదనందిపాడు మండలంలోని నక్క వాగు, మేకల వాగు పొంగడంతో కొప్పర్రు, అన్నపర్రు, వరగాని గ్రామాల్లోని పంటలు, లోతట్టు ప్రాంతాలు వరద బారిన పడ్డాయి. పెదనందిపాడు వంతెన వద్ద నల్లమడ వాగు కట్టమీద 40 కుటుంబాల వారి ఇళ్లలోకి నీరు రావడంతో వారిని పునరావాస కేంద్రాలకు తరలించారు.

కృష్ణా నదికి పోటెత్తిన వరద

మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఎన్‌టిఆర్ జిల్లాలో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ క్రమంలో పులిచింతల, మునేరు నుండి వస్తున్న 1.5 లక్షల క్యూసెక్కుల నీరు కృష్ణా నదిలోకి చేరుతోంది. దీంతో, విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద గంటగంటకూ వరద ప్రవాహం పెరుగుతోంది. గురువారం సాయంత్రం ఎనిమిది గంటల సమయానికి బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో 5,82,710 క్యూసెక్కులు ఉంది. దీంతో, ఇరిగేషన్ అధికారులు రెండో నెంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ముందు జాగ్రత్తగా కాల్వలకు నీటి విడుదలను నిలిపివేశారు. బ్యారేజీ వద్ద నీటి నిల్వ సామర్థ్యం 12 అడుగులు కాగా, ప్రస్తుతం 15.2 అడుగుల మేర నీటి ప్రవాహం కొనసాగుతోంది.

పరిశీలించిన మంత్రి నిమ్మల

కృష్ణా నది వరద ఉధృతిని ప్రకాశం బ్యారేజీ వద్ద ఇరిగేషన్ అధికారులతో కలిసి రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున బ్యారేజీ దిగువన లోతట్టు, లంక గ్రామాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు.

ఉమ్మడి తూర్పుగోదావరిలో 1,80,226 ఎకరాల్లో వరికి నష్టం


ఉమ్మడి తూర్పుగోదావరిలో 1,80,226 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్టు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. కాకినాడ జిల్లాలో 42 వేల ఎకరాలు, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 21,594 ఎకరాలు, తూర్పుగోదావరి జిల్లాలో 24,464 ఎకరాల్లో వరి పంట ఇంకా ముంపులోనే ఉంది. మరో 89 వేల ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది. 7,820.15 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా గుర్తించారు. సుమారు రూ.350 కోట్ల నుంచి రూ.400 కోట్లకు పైగా పంట నష్టం వాటిల్లింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 167 ఇళ్లకు నష్టం కలిగింది. ఇందులో అత్యధికంగా పూరిళ్లు ఉన్నాయి. విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 926 విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. 132 ట్రాన్స్‌ఫార్మర్లు కుప్పకూలాయి. సుమారు 197 కిలోమీటర్ల మేర రోడ్లు ధ్వంసం అయినట్టు అధికారులు గుర్తించారు.

అల్లూరి, శ్రీకాకుళం జిల్లాల్లో వర్షాలు

తుపాను తీరం దాటినా అల్లూరి, శ్రీకాకుళం జిల్లాల్లో గురువారం కూడా వర్షాలు పడ్డాయి. అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలం మడేరు, లబ్బర్తి, కింద్ర పెద్దేరు, నెల్లిమెట్ల ఒట్టిగడ్డ, గింజర్తి, జి.కొత్తపల్లి గ్రామాల వద్ద వాగులు ప్రమాదకర స్థాయిలో ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. ఆయా గ్రామాలకు 18 గంటలుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గంగవరం, కొయ్యూరు మండలాల్లో వాగులు ఉధృతంగా ప్రవహించాయి. దేవీపట్నం మండలం గుంపెనపల్లి, లక్ష్మీపురం గిరిజన గ్రామాలకు నాలుగు రోజులుగా బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. నిత్యావసరాలతోపాటు పిల్లలకు పాలు లేక అల్లాడిపోతున్నామని గుంపెనపల్లి వాసులు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి వేడుకుంటున్నారు. గత 24 గంటల్లో శ్రీకాకుళం జిల్లా గార మండలం బూరవెల్లి, కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో 11.75 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

ఒకరు మృతి, బాలిక గల్లంతు

శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం సీతానగరం గ్రామానికి చెందిన బచ్చల భీమారావు (55) గ్రామం సమీపంలోని కాణా వద్ద చేపల కోసం వల వేశారు. అదే వల కాళ్లకు చుట్టుకుని నీటిలో చిక్కుకుపోయారు. చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో ఎంత ప్రయత్నించినా బయటికి రాలేక మృతి చెందారు. విశాఖ జిల్లా పద్మనాభం మండలం మద్ది పంచాయతీ పరిధి తునిపాలెం గ్రామంలో పల్లిగెడ్డ కాజ్‌వేపైకి వెళ్లిన చిన్నారి కాళ్ల ధనూష గల్లంతైంది. నీటి ప్రవాహం తగ్గిందని సరదాగా వెళ్లిన నలుగురు పిల్లలు కాళ్లు, చేతులు కడుక్కుంటున్నారు. ఈ సమయంలో కాలు ధనూష గల్లంతైంది.


ప్రకాశం జిల్లా, నాగులుప్పలపాడు మండలం, మద్దిరాలపాడు వద్ద 216 జాతీయ రహదారిపైకి చేరిన వరదనీరు

శారదా నదికి గండి

అనకాపల్లి జిల్లాలో రాంబిల్లి మండలం వై.లోవ సమంలోని శారదా నది ఎడమ గట్టుకు సుమారు 40 మీటర్ల పొడవైన గండిపడింది. దీంతో, వై.లోవ, రజాల, చిన్నకలవలపల్లి, పెదకవలవపల్లి గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. శారద నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాంబిల్లి మండలం కొత్తూరు గ్రామం వద్ద నది మధ్యలో ఉన్న పామాయిల్ తోటలో ఓ కుటుంబం చిక్కుకుంది. వారిని అగ్నిమాపక శాఖ, ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది రక్షించి ఒడ్డుకు తీసుకొచ్చారు. కశింకోట మండలం వెదురుపర్తి గ్రామం వద్ద ఎడమగట్టు కోతకు గురవడంతో పోలీసులు అప్రమత్తమై ఆ ప్రాంతంలో ఇసుక బస్తాలు వేశారు.

పెద్దేరు జలాశయం నుండి వరద నీటి విడుదలతో వడ్డాది వద్ద వందలాది ఎకరాలు పంట పొలాలు నీట మునిగాయి. వరద నీటితో యలమంచిలి నుంచి అచ్యుతాపురం మీదుగా గాజువాక వెళ్లే బైపాస్ రోడ్డులో రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షాలకు చీడికాడ మండలం చిన్నగోగాడలో చెరువు కోతకు గురై పొలాలు నీట మునిగాయి. రావికమతం, రోలుగుంట, మాడుగుల, గొలుగొండ మండలాలాల్లో వరి పొలాలు నీటి ముంపునకు గురయ్యాయి.



చిలక సందేశం

పిల్లలూ...బాలలు
పరిశుభ్రంగా ఉండండి
చక్కటి దుస్తులు వేయండి

చిన్నారులూ..చిట్టి గువ్వలు
కాయగూరలు తినండి
కాల్షియాన్ని పొందండి

పిడుగులూ..బుజ్జాయిలు
చిరుధాన్యాలు తినండి
ప్రోటీన్లను పొందండి

బుడుగులు..బుడతలు
చిరుతిండి తినకండి
అనారోగ్యం పడకండి

విద్యార్థులూ..విద్యార్థినులు
పోషకాలన్ని తినండి
ఆరోగ్యంగా ఉండండి



కయ్యూరు బాలసుబ్రమణ్యం,
77802 77240.

బాల్యపు ఊసుల ఉయ్యాల

నాన్నను పట్టుకు తిరిగిన లోగిలి
అమ్మను తాకితే తీరిన ఆకలి
బుడి బుడి అడుగుల జాబిలి
విహార యాత్రపు జాలీ జాలీ
నా మదిలో బాల్యపు రంగుల హోలీ

సోపతి గాళ్లతో గోలీలాట
భూపతి గానితో జలకాలాట
సీతాపతితో జాతర పాట
యాకుబ్ తోటలో కోతి కొమ్మచ్చీ
జేకే వాడలో కాల్ చిచ్చి ముచ్చీ
బాల్యపు ఊసుల ఉయ్యాలా!

సొంటి తెచ్చినా కంట్లో మంట
చంటి తెచ్చినా ఇంట్లో తంట
గద్యం చదవక కోదండాలు
పద్యం చదవక అరదండాలు

బాల్యం నేర్పిన గుణ పాఠాలు
అయ్యోరిచ్చిన ఐదు పైసలు
పూజారిచ్చిన పూత రేకులు
ఇసుకలో కట్టిన పిచ్చుక గూళ్లు
కాగితప్పడవల వర్షపు నీళ్లు
మరచిపోనివీ మరలి రానివీ
బాల్యం ఇచ్చిన బహుమతులు

చెరువులో పట్టిన చేప పిల్లలు
చేతిలో కాలిన అగ్గి పుల్లలు
బడి మానేసి చూసిన చిత్రం
బిర బిర గీసిన నల్లని ఛత్రం
గిర గిర తిరిగిన రంగుల రాట్నం
బిర బిర ఉరికిన హంగుల పట్నం
ఇంకా ఇంకా గుర్తున్నాయి
ఇంపుగ మదిలో దాగున్నాయి!


– డా.కటుకోర్యుల రమేష్,
9949083327.

నేను గీసిన బొమ్మ






బి.దీపిక,
7వ తరగతి,
జెడ్పీహెచ్ఎస్
కట్టుబడిపాలెం,
జి.కొండూరు మండలం,
ఎన్‌టిఆర్ జిల్లా.






ఎం.ప్రమోద్
6వ తరగతి,
ఎంపియుపి స్కూల్,
పి.నైనవరం, ఎన్‌టిఆర్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



విద్యుత్ ఆదాపై అవగాహన అవసరం

మనం నిద్ర లేచిన దగ్గర నుంచి మళ్లీ నిద్రించే వరకూ మనిషి జీవితం ఎలక్ట్రికల్ వస్తువులతో అనుసంధానమై ఉంది. అధునాతన టెక్నాలజీతో ఆఫీసులో ఉండే ఇంట్లోని ఎలక్ట్రికల్ వస్తువుల పనితీరును తెలుసుకోవచ్చు. ఆన్, ఆఫ్‌లు చేయొచ్చు. రిమోట్ టెక్నాలజీతో మనం కూర్చున్న వద్ద నుంచే పక్క గదుల్లోని ఫ్యాన్లు, లైట్లు, కంప్యూటర్లు, ఏసీలు ఇలా అన్నింటినీ ఆపేయొచ్చు. తద్వారా విద్యుత్‌తోపాటుగా డబ్బు కూడా ఆదా అవుతుంది. అక్టోబర్ 31న ప్రపంచ పొదుపు దినోత్సవం సందర్భంగా ఈ కథనం.



నేడు ప్రపంచ పొదుపు దినోత్సవం

రోజు రోజుకీ పెరుగుతున్న ఎలక్ట్రికల్ వస్తువుల వినియోగంతో నెలాఖరుకి విద్యుత్ బిల్లులు కూడా భారీగానే వస్తున్నాయి. లాప్‌టాప్, సెల్ ఛార్జర్, వాషింగ్ మెషీన్స్, టీవీలు వంటి వాటిని ఉపయోగించి మనకు తెలియకుండా చేసే చిన్న పొరపాట్లతో మొత్తం విద్యుత్ బిల్లుల్లో అదనపు మొత్తం పెరుగుతుంది. సెల్ ఛార్జర్ సగటున రోజుకు 1.3 వాట్ల పవర్‌ను తీసుకుంటుంది. అలా సాకెట్‌కు ఛార్జర్ ఉంచితే పాడైపోయే అవకాశమే కాదు, ఒక్కోసారి పేలిపోయే అవకాశం కూడా ఉంది. ఛార్జింగ్ పెట్టుకున్న తర్వాత సాకెట్ నుంచి తీసివేయడం మంచిది. ఇంటర్నెట్‌ను ఉపయోగించిన అనంతరం వైఫై మోడెమ్ స్విచ్ఛాఫ్ చేయాలి. ఇక మైక్రో ఓవెన్స్ తక్కువమంది ఇంట్లో ఉన్నా చాలా మంది వీటిని ఉపయోగించిన అనంతరం ఆపుచేయరు. అన్‌ప్లగ్ చేయకుండా వదిలేస్తుంటారు. మైక్రో ఓవెన్స్, ఓవెన్స్‌లు ఒకరోజులో 108 వాట్ల పవర్‌ను తీసుకుంటాయి. మనం రెగ్యులర్‌గా ఉపయోగించే ఎలక్ట్రికల్ వస్తువులైన డ్రైయర్స్, మిక్సర్స్, గ్రైండర్లు, రైస్ కుక్కర్లు, టేబుల్ ఫ్యాన్లు, బ్లూటూత్ స్పీకర్లు ఆఫ్ చేయడం ముఖ్యంగా అన్‌ప్లగ్ చేయడం మంచిది. ల్యాప్‌టాప్‌లను సిచ్ఛాఫ్ చేసి అన్‌ప్లగ్ చేయడంతో విద్యుత్ బిల్లు ఆదా అవ్వడమే కాదు. ఎలక్ట్రికల్ వస్తువులు త్వరగా పాడైపోకుండా ఉంటాయి.

ఎల్ఈడీ బల్బులు మేలు

ఫిలమెంట్ బల్బు వాడితే 60 వాట్ల విద్యుత్ వినియోగమైతే- అంతే కాంతినిచ్చే ఎల్ఈడి లైట్లు వాడితే కేవలం 9 వాట్ల విద్యుత్తే ఖర్చవుతుంది. సంప్రదాయ ట్యూబ్‌లైట్లతో పోలిస్తే ఎల్ఈడీ దీపాల ద్వారా 90 శాతం వరకు విద్యుత్తు ఆదా చేసుకోవచ్చు. మనం ఇంట్లో వాడే 60 వాట్స్, 100 వాట్స్ బల్బులతో వెలుగు కంటే వేడి ఎక్కువగా వస్తుంది. పర్యావరణ పరంగా కూడా ఈ దీపాలు ప్రయోజనకరం.

వాషింగ్ మెషిన్ పూర్తి లోడ్ బెటర్

8 కిలోల సామర్థ్యం ఉన్న మెషిన్‌లో 3, 4 కిలోలే వేసి వాడటం వల్ల విద్యుత్తు అవసరం పెరుగుతుంది. పూర్తి లోడ్‌తోఉపయోగిస్తే వాడకం గణనీయంగా తగ్గుతుంది.

సౌరవిద్యుత్తు సో బెటర్

సౌర విద్యుత్ కూడా తక్కువ ధరకే దొరుకుతుంది. ప్రభుత్వ రాయితీని ఉపయోగించుకుని తక్కువ ధరకే యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. దీంతో బిల్లుల భారం తగ్గుతుంది.

వాయిస్ కంట్రోల్‌తో నియంత్రణ

మొబైల్ సాయంతోనే ఆధునాతన ఫ్యాన్లు, ఏసీలు ఆన్ లేదా ఆఫ్ చేయొచ్చు. వాయిస్ కంట్రోల్‌తోనూ నియంత్రించొచ్చు.

స్టార్ రేటింగ్ చూసుకోవాలి

ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు కొనేటప్పుడు స్టార్ రేటింగ్ చూడండి. రేటింగ్ తక్కువగా ఉన్నవి తక్కువ ధరకే వస్తాయి. అవి అధిక విద్యుత్తును వినియోగిస్తాయి. అధునాతన ఫీచర్లున్న ఇన్వర్టర్ టెక్నాలజీ ఏసీలైతే, సంప్రదాయ ఏసీలకన్నా 20 నుంచి 30 శాతం విద్యుత్తును ఆదా చేస్తాయి. ఫ్రిజ్‌లలో ఇన్వర్టర్ కంప్రెషర్, అడ్వాన్స్‌డ్ ఇన్సులేషన్, ఎల్ఈడీ లైటింగ్ ముఖ్యం.

ఈ సూచనలు పాటించండి

- సంప్రదాయ మోటారుకు బదులుగా డీసీ మోటారు బిగించిన సీలింగ్ ఫ్యాన్లను రిమోట్‌తో ఆపరేట్ చేయొచ్చు. వేగాన్ని కావాల్సిన మేరకు పెట్టుకోవచ్చు. సాధారణ ఫ్యాన్లతో పోలిస్తే 60 శాతం తక్కువ విద్యుత్తుతో ఇవి పనిచేస్తాయి.
- ఫ్యాన్ బ్లేడ్‌లపై పేరుకు పోయిన దుమ్ము గాలి వేగాన్ని తగ్గిస్తుంది. మోటారు బలంగా పనిచేస్తే విద్యుత్తు వాడకం పెరుగుతుంది.
- రెండు, మూడు రోజులకో సారైనా ఫ్యాన్ రెక్కలపై దుమ్ము తొలగించాలి. లేకపోతే ఎలర్జీ సంబంధ వ్యాధులొచ్చే ప్రమాదం ఉంది.
- యాంటీ డస్ట్ ఫ్యాన్లు ఎంచుకోవటం కూడా మేలు
- స్టాండ్ ఫ్యాన్‌కు ఏడాదికి ఒకసారైనా సర్వీసింగ్ చేయించాలి.
- స్మార్ట్ థర్మోస్టాట్స్ ద్వారా విద్యుత్తు వినియోగాన్ని తగ్గించుకోవచ్చు. మీరు ఇంట్లో లేని సమయంలో వాడకాన్ని అవి నియంత్రిస్తాయి.
- ఎనర్జీ మానిటర్, స్మార్ట్ ఎనర్జీ మీటర్లతో ఇంట్లోని టీవీ, ఏసీ, ఫ్రిజ్, వాషింగ్‌మెషిన్, డిష్ వాషర్, ఓవెన్ వంటి వాటికి ఎంత విద్యుత్తు ఉపయోగిస్తున్నామో రియల్‌టైమ్‌లో తెలుస్తుంది. ఎక్కడైనా లోపం జరుగుతుంటే వెంటనే జాగ్రత్తపడొచ్చు.
- స్మార్ట్ పవర్ స్ట్రిప్‌ల ద్వారా ఇంట్లోని టీవీతోపాటు దానికి అనుసంధానంగా ఉండే కేబుల్ టీవీ బాక్స్, హోం థియేటర్ పరికరాలు, డీవీడీ ప్లేయర్లను కూడా ఒకేసారి యాప్ ద్వారా ఆపరేట్ చేసి ఆపేయొచ్చు.
- కిటికీలకు అమర్చే స్మార్ట్ బ్లైండ్స్ బయట నుంచి సూర్యరశ్మి లోపలకు రాకుండా చూసి గది ఉష్ణోగ్రతను నియంత్రిస్తాయి. ఏసీ వాడే సమయంలో చల్లదనం బయటకు పోకుండా చూస్తాయి.
- గదుల్లో ఎవరూ లేనప్పుడు ఫ్యాన్లు, బల్బులు ఆఫ్ చేసుకోవాలి.
- రెగ్యులేటర్‌ను వాడుతూ ఫ్యాన్ల వేగం నియంత్రిస్తే విద్యుత్తును ఆదా చేసుకోవచ్చు.
- ఇళ్లల్లో ఐఎస్ఐ గుర్తింపు కలిగిన స్టార్ రేటెడ్ విద్యుత్తు పరికరాలు వాడేలా చూసుకోవాలి.
- వాటర్ హీటర్లు, ఎలక్ట్రిక్ పొయ్యిలు, రైస్‌కుక్కర్లు నాణ్యమైనవే వాడాలి. నాసిరకమైనవి వాడితే బిల్లు అధికంగా వస్తుంది.
- గ్రైండర్‌కు నైలాన్ బెల్టును అమర్చితే యంత్రం మన్నికగా ఉండడంతో పాటు తక్కువ విద్యుత్తును తీసుకుంటుంది.
- ఫ్రిడ్జ్‌లను గాలి, వెలుతురు ఎక్కువగా వచ్చే చోటనే ఉంచాలి. డోర్లు ఎక్కువసార్లు తీస్తే ఎక్కువ కరెంటు ఖర్చవుతుంది.
- మంచి కంపెనీలకు చెందిన ఏసీల వినియోగంతో కొంత మేర విద్యుత్తు ఆదా చేసుకోవచ్చు.
- ఏసీ ఆన్ చేసినప్పుడు కిటికీలు, తలుపులు మూసి 10 నిమిషాల పాటు ఫ్యాన్ వేసుకుంటే గది ఉష్ణోగ్రత త్వరగా చల్లబడుతుంది. ఆ తర్వాత ఫ్యాన్ కట్టేయొచ్చు.
- ఏసీలను ఎల్లప్పుడూ 25 డిగ్రీల ఉష్ణోగ్రతతో వినియోగించుకుంటే విద్యుత్ ఆదా అవుతుంది.
- బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ, ఇతర ఇంధన సంస్థలు గది ఉష్ణోగ్రతను 24 నుంచి 26 డిగ్రీలని సిఫారసు చేస్తున్నాయి. ఒక్కో డిగ్రీ పెరుగుదల వల్ల 6 నుంచి 8 శాతం మేర విద్యుత్తు ఆదా అవుతుంది.
- 24 డిగ్రీల స్థాయిలో నిర్దేశిత సమయం మాత్రమే ఏసీ వినియోగించేలా రిమోట్ సెట్ చేసుకోండి.
- టైమర్ ఉపయోగించి స్లీప్ మోడ్‌లో పెట్టుకుంటే వాడకంలో 30 శాతం ఆదా అవుతుంది.
- ఫిల్టర్లను ప్రతి మూడు నెలలకోసారి మార్చాలి. లేదంటే శుభ్రం చేయాలి. దుమ్ము పేరుకుంటే చల్లదనం సరిగా ప్రవహించదు. విద్యుత్తు వాడకం పెరుగుతుంది.
- గీజర్ ఎక్కువసార్లు వేసే అవసరం లేకుండా చూసుకోండి.



నటనకు రిటైర్మెంట్ తీసుకోను



రవితేజ నటించిన 'మాస్ జాతర' చిత్రం అక్టోబరు 31న (నేడు) విడుదలవుతోంది. భాను భోగవరపు దర్శకత్వం వహించిన ఈ సినిమా గురించి రవితేజ మాట్లాడారు. 'ఈ సినిమా కొంచెం ఆలస్యమైంది. దీని చిత్రీకరణలో నాకు కొన్ని గాయాలు అయ్యాయి. వాటి కారణంగానే చాలాసార్లు వాయిదా పడింది. సంక్రాంతికి విడుదల చేయాలని అనుకున్నాం, తర్వాత వేసవిలో రావాలనుకున్నాం, వినాయక చవితికి రిలీజ్ చేద్దాం అనుకున్నాం. ఆ తేదీలేవీ కుదర్లేదు. ఇన్ని రోజులకు విడుదల చేస్తున్నాం. నా కెరీర్‌లో సినిమా ప్రారంభించిన తర్వాత ఇంత ఆలస్యం ఎప్పుడూ కాలేదు. మొదటిసారి ఇలా జరిగింది. జయాపజయాలను నేను పట్టించుకోను. నా పని చేస్తూ వెళ్తాను. ఎవరికైనా నేను ఇచ్చే సలహా ఇదే. మన పనిని వందశాతం కష్టపడి చేస్తూ వెళ్తే ఏదో ఒకరోజు దానికి తగిన ఫలితం వస్తుందని నమ్ముతాను. ఆత్మవిశ్వాసం తగ్గిపోతే ఏదీ సాధించలేరు. అన్నిటికంటే మనపై మనకు నమ్మకం ముఖ్యం. నటనకు రిటైర్మెంట్ తీసుకోను. నా చివరి శ్వాస వరకూ నటిస్తూనే ఉంటాను. సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్‌ను పట్టించుకోను. అందుకే అవి నన్ను ప్రభావితం చేయవు' అని రవితేజ తెలిపారు.



విస్మయ 'తుడక్కమ్' ప్రారంభం

మోహన్‌లాల్ కుమార్తె విస్మయ మోహన్‌లాల్ త్వరలో నటిగా వెండితెరపై అరంగేట్రం చేయనున్న విషయం తెలిసిందే. 'తుడక్కమ్' అనే సినిమాతో ఆమె పరిచయం అవుతున్నారు. తాజాగా ఈ చిత్రం ప్రారంభమైంది. కొచ్చిలోని క్రౌన్ ప్లాజాలో జరిగిన ఈ వేడుకలో ముఖ్య అతిథిగా మోహన్‌లాల్‌తో పాటు, ఆయన సతీమణి సుచిత్ర, కుమారుడు ప్రణవ్ మోహన్‌లాల్ సహా చిత్ర బృందం పాల్గొంది. ఈ చిత్రానికి '2018' వంటి బ్లాక్‌బస్టర్ సినిమాతో గుర్తింపు పొందిన దర్శకుడు జూడ్ ఆంథోనీ జోసెఫ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆంటోనీ పెరుంబావూర్ నేతృత్వంలోని ఆశీర్వాద్ సినిమాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ సినిమాలో ఆంటోనీ పెరుంబావూర్ కుమారుడు ఆశీష్ ఆంటోనీ కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రారంభ కార్యక్రమం అనంతరం మోహన్‌లాల్ మాట్లాడుతూ తన జీవితంలో ప్రతిదీ ఒక 'విస్మయం' (ఆశ్చర్యం)గా భావించే తన కుమార్తెను కూడా అదే పేరుతో పిలుచుకుంటానని తెలిపారు. తన పిల్లలు ఇద్దరూ (ప్రణవ్, విస్మయ) సినీ పరిశ్రమలోకి వస్తారని తాను ఎప్పుడూ ఊహించలేదని, ఇది ప్రేక్షకులే ఇచ్చిన ప్రేమ, ఆశీర్వాదం వల్లే అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు జూడ్ ఆంథోనీ జోసెఫ్ మాట్లాడుతూ.. 'తుడక్కమ్' అంటే 'ప్రారంభం' అని. ఇది ఒక సాధారణ కుటుంబ చిత్రం అని తెలిపారు.



'మహాకాళి' కీలకపాత్రలో భూమిశెట్టి

టాలీవుడ్ దర్శకుడు ప్రశాంత్ వర్మ తెరకెక్కిస్తున్న కొత్త సినిమా 'మహాకాళి'. సినిమాటిక్ యూనివర్స్ (పీవీసీయూ) ఈ సినిమాను తెరకెక్కిస్తోంది. ఫీమేల్ ఓరియెంటేషన్‌లో రానున్న ఈ సినిమాలో కన్నడ నటి భూమిశెట్టి ప్రధానపాత్రను పోషిస్తున్నారు. ప్రశాంత్ వర్మ కథ అందించగా పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నటుడు రిషబ్ శెట్టి జన్మించిన కుందాపుర గ్రామమే భూమిశెట్టిది కూడా. భాస్కర్, బేబీ శెట్టి దంపతులకు జన్మించిన భూమి కన్నడ, తెలుగు అనర్గళంగా మాట్లాడతారు. ఇంజనీరింగ్ పట్టభద్రురాలైన ఆమె సంగీతం, నృత్య శిక్షణలు సైతం పూర్తిచేశారు. కన్నడ సీరియల్ కిన్నరితో కెరీర్ ప్రారంభించిన ఆమె తెలుగు సీరియల్ నిన్నే పెళ్లాడతాలో ప్రధాన పాత్రలో మెరిశారు. బిగ్‌బాస్ కన్నడ సీజన్ 7 టాప్‌ఫైవ్‌లో నిలిచారు. అక్కడ వచ్చిన గుర్తింపుతో కన్నడ చిత్రం ఇక్కత్ (2021)తో హీరోయిన్‌గా సినీ రంగ ప్రవేశం చేశారు. ఈ ఏడాదిలో విడుదలైన కింగ్డమ్ చిత్రంలో సత్య దేవ్ సతీమణి గౌరి పాత్రలో మెరిచారు. ఇప్పుడు మహాకాళితో భూమి శెట్టికి మంచి అవకాశం లభించింది.

'స్పిరిట్'లో విలన్ డాన్‌లీ

సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ నటించనున్న చిత్రం 'స్పిరిట్'. త్రిప్తి దిమ్రి కథానాయిక. కాంచన, ప్రకాష్‌రాజ్, వివేక్ ఒబెరాయ్ ఇతర పాత్రలు పోషించనున్నారు. ప్రణయ్‌రెడ్డి వంగా, భూషణ్‌కుమార్, క్రిషణ్‌కుమార్ నిర్మించనున్న ఈ చిత్రం త్వరలో సెట్స్‌పైకి రానుంది. ప్రభాస్ పవర్‌ఫుల్ ఐపిఎస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. ఈ చిత్రంలో కొరియన్ నటుడు డాన్ లీ విలన్‌గా నటించనున్నారని సమాచారం. ప్రస్తుతం ఆయన మారుతి దర్శకత్వం వహిస్తున్న 'ది రాజా సాబ్' చిత్రంలో ప్రభాస్ నటిస్తున్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో 'ఫౌజి' వంటి ప్రాజెక్ట్‌లకు ప్రభాస్ ఓకే చెప్పిన విషయం తెలిసిందే. స్పిరిట్‌లో ప్రభాస్‌తో డాన్‌లీ నటిస్తున్నారని కొరియన్ ఇండస్ట్రీలో కూడా చర్చ జరుగుతోంది.



హర్మన్‌ప్రీత్ సేన రికార్డు ఛేదన

వన్డే ప్రపంచకప్‌లో 339 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించిన అమ్మాయిలు

జెమీమా చిరస్మరణీయ సెంచరీ • ఆస్ట్రేలియాపై గెలుపుతో ఫైనల్‌కు భారత్

ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్‌లో హర్మన్‌ప్రీత్ సేన నయా చరిత్రను లిఖించింది. ఆస్ట్రేలియా నిర్దేశించిన 339 పరుగుల భారీ లక్ష్యాన్ని మరో 9బంతులు మిగిలి ఉండగానే ఛేదించి ఈ రికార్డు నెలకొల్పింది. జెమీమా రోడ్రిగ్స్(127నాటౌట్) చిరస్మరణీయ సెంచరీకి తోడు, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(89) బ్యాటింగ్‌లో మెరిసారు. దీంతో వన్డే సెమీస్‌లో ఆస్ట్రేలియాపై ఐదు వికెట్లు తేడాతో నెగ్గిన టీమిండియా వన్డే ప్రపంచకప్ ఫైనల్లోకి మూడోసారి ప్రవేశించింది.



జెమీమా (127నాటౌట్)

నవీ ముంబయి: ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్‌లో టీమిండియా అమ్మాయిలు నయా చరిత్ర లిఖించారు. 339 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి చరిత్ర పుటల్లోకెక్కారు. ఆ లక్ష్యం ఛేదించింది ఆషామాషీ జట్టుపై ఏమీ కాదు.. ఏడుసార్లు వన్డే ప్రపంచకప్ విజేత, డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన ఆస్ట్రేలియాపై కావడం మరో విశేషం. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా జట్టును టీమిండియా బౌలర్లు కట్టడి చేయలేకపోయారు. లిచ్‌ఫీల్డ్(119) సెంచరీకి తోడు, అలీసా పెర్రీ(77), గార్డినర్(63) అర్ధసెంచరీలతో రాణించారు. దీంతో ఆ జట్టు 49.5ఓవర్లలో 338 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఆ లక్ష్యాన్ని టీమిండియా ఛేదిస్తుందా..? అనే అభిమానుల ఆశలను పటాపంచలు చేస్తూ హర్మన్‌ప్రీత్ సేన మరో 9బంతులు మిగిలి ఉండగానే 5వికెట్లు నష్టపోయి 341పరుగులు చేసి ఫైనల్లోకి దూసుకెళ్లింది. టీమిండియా గెలుపులో జెమీమా రోడ్రిగ్స్(127నాటౌట్) సెంచరీకి తోడు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(89) అర్ధసెంచరీతో మెరిసింది. వీరిద్దరూ 3వ వికెట్‌కు 167పరుగులు జతచేసి గెలుపుకు బాటలు వేశారు. ధాటిగా ఆడే క్రమంలో హర్మన్‌ప్రీత్ ఔటైనా.. దీప్తి శర్మ(24), రిచా ఘోష్(26) సహకారంతో జెమీమా రోడ్రిగ్స్ టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్ని అందించింది. దీంతో భారత మహిళలజట్టు మూడోసారి ఐసిసి వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు చేరింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రోడ్రిగ్స్‌కు లభించగా.. నవంబర్ 2న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. వన్డే ప్రపంచకప్ ఛేదనలో జెమీమా రోడ్రిగ్స్ రికార్డుపుటల్లోకెక్కింది. ఛేదనలో భాగంగా భారత్ తరఫున అత్యధిక పరుగులు కొట్టిన తొలి బ్యాటర్‌గా నిలువగా.. ప్రపంచకప్‌లో స్కీవర్ బ్రంట్ (148నాటౌట్) తర్వాత అత్యధిక పరుగులు కొట్టిన రెండో బ్యాటర్‌గా నిలిచింది.

లిచ్‌ఫీల్డ్ సెంచరీ

అంతకుముందు టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియాకు ఆదిలోనే కెప్టెన్ అలీసా హేలీ(5) వికెట్ కోల్పోయింది. క్రాంతి గౌడ్ ఆమెను ఔట్ చేసింది. మరో ఓపెనర్ ఫొబే లిచ్‌ఫీల్డ్(119) శతకానికి తోడు అలీసా పెర్రీ(77), అష్ గార్డ్‌నర్ (63) అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. ఫొబే లిచ్‌ఫీల్డ్–అలీసా పెర్రీ 2వ వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పారు. శ్రీచరణి ఓవర్లో బౌండరీతో ప్రపంచ కప్‌లో తొలి శతకం సాధించింది లిచ్‌ఫీల్డ్. లిచ్‌ఫీల్డ్ 22ఏళ్లకే వన్డే ప్రపంచకప్‌లోసెంచరీ కొట్టిన అత్యంత పిన్న వయస్కురాలిగా చరిత్ర సృష్టించింది. దీప్తి శర్మ ఓవర్లో రెండు భారీ సిక్సర్లు బాదిన ఆమెను అమన్‌జోత్ కౌర్ బౌల్డ్ చేసింది. అమన్‌జోత్ వేసిన బంతిని లాప్ స్వూప్ షాట్ ఆడబోయిన లిచ్‌ఫీల్డ్ క్లీన్‌బౌల్డ్ అయింది. దాంతో 155 పరుగుల భారీ భాగస్వామ్యానికి తెరపడింది. లిచ్‌ఫీల్డ్, పెర్రీల దూకుడుతో ఆసీస్ స్కోర్ సులువుగా 350 దాటుతుందనిపించింది. కానీ, శ్రీచరణి(2/49)ఆ జట్టును దెబ్బకొడుతూ వరుస ఓవర్లలో రెండు వికెట్లు తీసింది. గార్డ్‌నర్(63)దూకుడుగా ఆడడడంతో ఆసీస్ 338 పరుగుల వద్ద ఆలౌటైంది. శ్రీచరణి, దీప్తి శ్మకు రెండేసి, క్రాంతి గాడ్, అమన్‌జోత్, రాధా యాదవ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

స్కోర్‌బోర్డు...

ఆస్ట్రేలియా మహిళల ఇన్నింగ్స్: హీలీ (బి)క్రాంతి గాడ్ 5, లిచ్‌ఫీల్డ్ (బి)అమన్‌జ్యోత్ కౌర్ 119, ఎలైసే పెర్రి (బి)రాధా యాదవ్ 77, బెత్ మూనీ (సి)రోడ్రిగ్స్ (బి)శ్రీచరణి 24, సథర్లాండ్ (సి అండ్ బి)శ్రీచరణి 3, గార్డినర్ (రనౌట్)క్రాంతి గాడ్/రీచా 63, మెక్‌గ్రాత్ (రనౌట్) రోడ్రిగ్స్/రీచా 12, కిమ్ గ్రాత్ (రనౌట్) అమన్‌జోత్/రీచా 17, కింగ్ (సి)రీచా (బి)దీప్తి 4, మెలినెక్స్ (బి)దీప్తి 0, స్కట్ (నాటౌట్) 1, అదనం 13. (49.5ఓవర్లలో ఆలౌట్) 338పరుగులు. **వికెట్ల పతనం:** 1/25, 2/180, 3/220, 4/228, 5/243, 6/265, 7/331, 8/336, 9/336, 10/338 బౌలింగ్: రేణుకా సింగ్ 8-0-39-0, క్రాంతి గాడ్ 6-0-59-1, శ్రీచరణి 10-0-49-2, దీప్తి శర్మ 9.5-0-73-2, అమన్‌జోత్ కౌర్ 8-0-51-1, రాధా యాదవ్ 8-0-66-1.

ఇండియా మహిళల ఇన్నింగ్స్: షెఫాలీ వర్మ (ఎల్‌బి)కిమ్ గ్రాత్ 10, స్మృతి మంధాన (సి)అలైసే హీలీ (బి)కిమ్ గ్రాత్ 24, రోడ్రిగ్స్ (నాటౌట్) 127, హర్మన్ ప్రీత్ కౌర్ (సి)గార్డినర్ (బి)సథర్లాండ్ 89, దీప్తి శర్మ (రనౌట్)కిమ్ గ్రాత్/హీలీ 24, రీచా ఘోష్ (సి)కిమ్ గ్రాత్ (బి)సథర్లాండ్ 26, అమన్‌జ్యోత్ కౌర్ (నాటౌట్) 15, అదనం 26. (48.3ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 341 పరుగులు. **వికెట్ల పతనం:** 1/13, 2/59, 3/226, 4/264, 5/310 **బౌలింగ్:** స్కట్ 6-0-40-1, కిమ్ 7-0-46-2, గార్డినర్ 8-0-55-0, మోలినెక్స్ 6.3-0-44-0, సథర్లాండ్ 10-0-69-2, కింగ్ 9-0-58-0, మెక్ గ్రాత్ 2-0-19-0.

మహిళల్లో వన్డేల్లో అత్యధిక పరుగులు

781 : ఇండియా × ఆస్ట్రేలియా, ఢిల్లీ **2025**
679 : ఇండియా×ఆస్ట్రేలియా, ముంబయి **2025**
678 : ఇంగ్లండ్ × దక్షిణాఫ్రికా, బ్రిస్టల్ **2017**
661 : ఇండియా × ఆస్ట్రేలియా, విశాఖ **2025**
651 : ఇండియా×దక్షిణాఫ్రికా, కొలంబో **2025**

కబడ్డీ టైటిల్ కొట్టేదెవరో..?

నేడు ప్రొ కబడ్డీ సీజన్-12 ఫైనల్ • రాత్రి 8.00గం॥లకు



న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ సీజన్-12 ఫైనల్ శుక్రవారం జరగనుంది. లీగ్ దశలో టాప్-2 స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య టైటిల్ పోరుకు కూడా జరగనుంది. ఈ రెండు జట్ల మధ్య జరిగిన నాకౌట్ పోటీలో టై బ్రేకర్‌లో దబాంగ్ ఢిల్లీ జట్టు 6-4పాయింట్ల తేడాతో పుణేరిని చిత్తు చేసి ఫైనల్‌కు చేరగా.. పుణేరి జట్టు బుధవారం జరిగిన క్వాలిఫయర్-2లో తెలుగు టైటాన్స్‌పై 50-45పాయింట్ల తేడాతో విజయం సాధించింది. పుణేరి, దబాంగ్ ఢిల్లీ జట్లు లీగ్ దశలో ఆడిన 18మ్యాచుల్లో 13విజయాలతో టాప్-2 స్థానాల్లో ఉన్నాయి. 2023-24 సీజన్‌లో పుణేరి జట్టు టైటిల్‌ను సాధించగా.. గత సీజన్‌లో హర్యానా స్టీలర్ టైటిల్‌ను ఎగరేసుకుపోయింది. ఇక దబాంగ్ ఢిల్లీ 2021-22 సీజన్‌లో టైటిల్‌ను సాధించింది. దీంతో ఇరుజట్లు రెండో టైటిల్‌పై కన్నేసాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68